ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి


విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY

అక్రిడేషన్ లు కలవు
విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రికలో రిపోర్టర్లు కావలెను
తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను
సంప్రదించవలసిన ఫోన్ నంబర్స్:
9440897445, 8074636674

శుక్రవారం 04 సెప్టెంబర్ 2026 | సంపుటి: 28 సంచిక: 144
Friday 04 Septembar 2026 | Vol.No 28 Issue No .144
హైదరాబాద్ Hyderabad
పేజీలు: 12+12
వెల: రూ.1.00
PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA
www.visionandhra.in

# ఓల్డ్ సిటీ కాదు.. ఒరిజినల్ సిటీ



- హైదరాబాద్ అభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా కృషి చేస్తాం
- డిగ్రీ కాలేజీ అభివృద్ధికి రూ.50 కోట్లు.. డిసెంబర్‌లో మెట్రో పనులు
- మీరాలం ట్యాంక్‌కు రూ.500 కోట్లు.. నగరంలో లక్ష ఇందిరమ్మ ఇళ్లుచంచల్‌గూడసంతోష్‌నగర్ స్టీల్ ఫ్లైఓవర్ ప్రారంభం..
- అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వరాలు





హైదరాబాద్, సెప్టెంబర్ 3 (విజన్ ఆంధ్ర): చారిత్రక హైదరాబాద్ ఒరిజినల్ సిటీ (ఓల్డ్ సిటీ)ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, దేశంలోనే అత్యంత అభివృద్ధి చెందిన నగరంగా తీర్చిదిద్దేందుకు రాజకీయాలకు అతీతంగా శాయశక్తులా కృషి చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. అభివృద్ధి పనులకు సంబంధించి ఏ పార్టీ నుంచి ప్రతిపాదనలు వచ్చినా రాజకీయ కోణంలో చూడకుండా ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యం ఇస్తామని స్పష్టం చేశారు. చంచల్‌గూడ నుంచి సంతోష్‌నగర్ వరకు 3.2 కిలోమీటర్ల మేర నిర్మించిన స్టీల్ ఫ్లైఓవర్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం చంచల్‌గూడ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన ప్రసంగించారు. చంచల్‌గూడ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి రూ.50 కోట్లు మంజూరు చేస్తున్నట్లు సీఎం ప్రకటించారు. ఇందుకు సంబంధించిన జీవోను నెల రోజుల్లోగా జారీ చేయాలని, పనులను వచ్చే ఏడాదిన్నరలోగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాలాను ఆదేశించారు. విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం ఎంతైనా ఖర్చు మిగతా 2లో..

## భారత ఆర్థిక వృద్ధి వల్ల ప్రపంచానికి కొత్త అవకాశాలు

- భారత ప్రధాని నరేంద్ర మోదీ కీలక వ్యాఖ్యలు
- మోదీ, బెల్జియం ప్రధాని బార్ట్ డి వెవర్ మధ్య చర్చలు
- భారత్, బెల్జియం మధ్య పలు కీలక ఒప్పందాలు



న్యూఢిల్లీ,సెప్టెంబర్ 3 : ప్రపంచవ్యాప్తంగా భౌగోళిక, ఆర్థిక అనిశ్చితులు కొనసాగుతున్న వేళ భారత్, బెల్జియం ద్వైపాక్షిక సంబంధాలను మరింత వ్యూహాత్మక స్థాయికి తీసుకెళ్లాలని నిర్ణయించాయి. ప్రధాని నరేంద్ర మోదీ, బెల్జియం ప్రధాని బార్ట్ డి వెవర్ మధ్య గురువారం విస్తృత మిగతా 2లో..

## కేబినెట్‌లో బీసీ వర్గానికి ప్రాధాన్యత..

- సురేఖ, చిన్నారెడ్డి స్థానంలో కొత్త వారికి చాన్స్
- ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ గా గద్వాల విజయ లక్ష్మి
- రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా నెరెళ్ల శారద
- కుడా చైర్ పర్సన్ గా గుండు సుధారాణికి చాన్స్
- బీసీ వర్గానికి చెందిన మహిళలకు అవకాశం



హైదరాబాద్,సెప్టెంబర్3 : రాష్ట్ర ప్రభుత్వం రెండు కీలక పదవుల్లో కూడా మార్పులు చేసింది. ప్రణాళికా సంఘం ఉపాధ్యక్ష పదవి నుండి జి. చిన్నారెడ్డిని తొలగించి, ఆ స్థానంలో హైదరాబాద్ మాజీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని నియమించారు. అలాగే, తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ నూతన చైర్‌పర్సన్‌గా నెరెళ్ల శారద నియమితులయ్యారు. తెలంగాణ కాంగ్రెస్‌లో క్రమశిక్షణకు సంబంధించిన వివాదం నడుస్తున్న తరుణంలో ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయి. సిట్టింగ్ ఎమ్మెల్యే మిగతా 2లో..

# కొండా సురేఖ బర్తరఫ్

- మంత్రివర్గం నుంచి ఉద్వాసన
- రాజీనామాకు నిరాకరించిన సురేఖ
- బర్తరఫ్ నిర్ణయం తీసుకున్న రేవంత్
- గవర్నర్ కు సీఎం రేవంత్ రెడ్డి లేఖ
- సీఎం నిర్ణయానికి హైకమాండ్ ఓకే..
- చిన్నారెడ్డి పైనా కాంగ్రెస్ పార్టీ వేటు





హైదరాబాద్,సెప్టెంబర్3 : తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఊహించిన పరిణామమే చోటుచేసుకుంది. కొండా సురేఖ రాజీనామాకు నిరాకరించడంతో, ఆమెను మంత్రివర్గం నుంచి తక్షణమే తొలగిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఆమెను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేసేందుకు ప్రతిపాదించిన అధికారిక సిఫార్సు లేఖను సీఎంఓ ఇప్పటికే గౌరవ గవర్నర్‌కు పంపించింది. కొంత కాలంగా కొండా సురేఖ వ్యవహారశైలి ప్రభుత్వానికి, పార్టీకి ఇబ్బందికరంగా మారింది.

## నన్ను తొలగించడం కుట్రే..

- రేవంత్‌రెడ్డి బ్లాక్‌మెయిల్ రాజకీయాలు
- నన్ను తొలగించకపోతే తప్పుకుంటానన్నారు
- బ్లాక్‌మెయిల్ చేసి నన్ను బర్తరఫ్ చేయించారు
- కాంగ్రెస్‌పార్టీలోనే ఉంటా.. నేను పార్టీ మారను
- నా కుమార్తె వ్యాఖ్యలకు నన్నెలా బాధ్యురాలిని
- రాజీనామా చేయమని నన్నెవరూ అడగలేదు
- బీసీ మహిళా మంత్రిగా అణచివేతకు గురయ్యా
- నిర్ణయంపై రేవంత్ ఆత్మపరిశీలన చేసుకోవాలి
- బర్తరఫ్ పై మీడియా సమావేశంలో కొండా సురేఖ
- అధిష్ఠానానికి పంపిన లేఖ కొండా సురేఖ రిలీజ్

మంత్రి పదవి నుంచి తనను తొలగించడంపై కొండా సురేఖ సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు పాల్పడ్డారని ఆరోపించారు. సురేఖను తొలగించకపోతే తాను తప్పుకొంటానని అధిష్ఠానాన్ని రేవంత్ బెదిరించారని ఆమె వ్యాఖ్యానించారు. లోక్‌భవన్ నుంచి అధికారిక ప్రకటన ఇంకా వెలువడకముందే.. తన బర్తరఫ్‌ను ఆమె ధ్రువీకరించారు. మిగతా 2లో..

## ఇరాన్‌ను అణుశక్తిగా మారకుండా నిరోధిస్తాం

- ఏ దేశమూ ఇరాన్‌కు సహాయం చేయకూడదు
- ఇరాన్‌కు సాయం చేసే దేశాలపై ఆంక్షలు విధిస్తాం
- ఇరాన్‌తో వాణిజ్యంపై భారత్‌కు అమెరికా హెచ్చరిక!
- మోదీ, ఇరాన్ అధ్యక్షుడు భేటీ నేపథ్యంలో వ్యాఖ్యలు



న్యూఢిల్లీ,సెప్టెంబర్ 3 : ఇరాన్‌తో భారత్ వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోబోతోందన్న వార్తలను అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో కొట్టిపారేశారు. అయితే, అమెరికా ఆంక్షలను తప్పించుకోవడానికి ఇరాన్‌కు ఏ దేశం మిగతా 2లో..

## పరకాల నుంచి సిఎం పోటీ చేయాలి

- రేవంత్ రెడ్డికి సవాల్ విసురుతున్నా
- నా తల్లికి అన్యాయం జరిగింది
- బర్తరఫ్ నన్ను తీవ్రంగా బాధించింది
- మా అమ్మ గొంతును ఎవరూ నొక్కలేరు
- సురేఖ కుమార్తె కొండా సుస్మిత ఫైర్



హైదరాబాద్,సెప్టెంబర్3 : తెలంగాణ మంత్రివర్గం నుంచి కొండా సురేఖను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బర్తరఫ్ చేయడం రాజకీయంగా పెను సంచలనం సృష్టించింది. ఈ నిర్ణయంపై సురేఖ కుమార్తె సుస్మిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తన తల్లికి అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేస్తూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆమె శాపనార్థాలు మిగతా 2లో..

## కుట్టు మిషన్ల పథకం వేగవంతం కావాలి

- బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- బీసీ సంక్షేమ శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష
- దోభీ ఘాట్ ల ఏర్పాటుకు అధికారులకు ఆదేశం



హైదరాబాద్,సెప్టెంబర్3 : తెలంగాణా రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చెయ్యాలని తెలంగాణా సర్కార్ సంకల్పించింది. ఈ క్రమంలో మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు అనేక కీలక నిర్ణయాలను తీసుకుంటుంది. ఈ క్రమంలోనే తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం బీసీల కోసం అమలు చేస్తున్న కుట్టు మిషన్ల పథకం వేగవంతం కావాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో బీసీ సంక్షేమ శాఖ ఉన్నతాధికారులతో ప్రభుత్వ పథకాలు, కీలక అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించిన ఆయన, ప్రొక్యూర్‌మెంట్ ప్రక్రియను ఈ నెల 7వ తేదీలోగా పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు.ఈ పథకం కింద ఇప్పటికే సుమారు 1.80లక్షల దరఖాస్తులు మిగతా 2లో..

## మరింత పెరిగిన నేపాల్ మృతుల సంఖ్య

- 1,252 మంది ఆకస్మిక వరదల్లో మృతి
- ఇంకా దొరకని 4,800 మంది ఆచూకీ



న్యూఢిల్లీ,సెప్టెంబర్ 3 : నేపాల్ ప్రకృతి విలయంలో మృతుల సంఖ్య ఏకంగా 1,252కి చేరింది. విపత్తు జరిగి వారం రోజులు దాటినా వేలాది మంది ఆచూకీ ఇంకా తెలియరాలేదు. అదే సమయంలో ప్రభావిత ప్రాంతాల నుంచి మరిన్ని మృతదేహాలను అధికారులు వెలికితీశారు. నేపాల్ పోలీసులు విడుదల చేసిన గణాంకాల ప్రకారం చిత్వాన్ జిల్లాలో 355, నవల్‌పరాసి తూర్పులో 218, నవల్‌పరాసి పశ్చిమంలో 208, నువాకోట్ జిల్లాలో 177 మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా రసువా మిగతా 2లో..

## పాత ప్రాజెక్టులపై క్రెడిట్ కొట్టే యత్నం

- వైఎస్సార్ హయాంలోనే 79 శాతం పూర్తి
- ప్రజాధనంతో ప్రభుత్వం పబ్లిసిటీ స్టంట్లు
- కూటమి ప్రభుత్వంపై జగన్ విమర్శలు



అమరావతి,సెప్టెంబర్3 : వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సాగునీటి ప్రాజెక్టుల విషయంలో ప్రభుత్వం కొత్తగా పనులేమీ చేపట్టకుండా, కేవలం ప్రచార ఆర్భాటాలకే పరిమితమవుతోందని విమర్శించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ఆయన స్పందించారు. పురుషోత్తపట్నం మిగతా 2లో..

## ప్రపంచ స్థాయి స్పోర్ట్స్ హబ్‌గా చెన్నై


- మోటార్‌స్పోర్ట్స్ సిటీ"ని ఏర్పాటు
- చెన్నై నగరం వేదికగా ఒలింపిక్స్
- సీఎం విజయ్ సంచలన ప్రకటన



చెన్నై,సెప్టెంబర్ 3 : క్రీడారంగాన్ని కొత్త ఎత్తులకు తీసుకెళ్తూ తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ మిగతా 2లో..

## ప్రజల్లోకి వాస్తవాలు తీసుకెళ్ళండి

- నీళ్లపై గొడ్డలి పార్టీ తప్పుడు ప్రచారం, ● స్థానిక సంస్థల ఎన్నికలకు పకడ్బందీగా ముందుకు ● 23 మున్సిపాలిటీల్లోనూ ఎన్నికలు జరిగేలా చర్యలు, ● అన్ని ఎన్నికల్లో కూటమి విజయం సాధించాలి, ● అందుకు ఇంచార్జ్? మంత్రులు బాధ్యత తీసుకోవాలి, ● సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలి, ● ఎల్‌నినో పరిస్థితులపై కేంద్రానికి లేఖ రాస్తాం, ● జీఎస్‌డీపీ తగ్గకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు, ● పశుగ్రాసానికి ఎలాంటి కొరత లేకుండా చూడాలి, ● సీడ్ బాల్స్ కార్యక్రమానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలి, ● మంత్రివర్గ సమావేశంలో సీఎం చంద్రబాబు వెల్లడి, ● అజెండా అంశాలు, తాజా పరిణామాలపై సమీక్ష, ● సహచర మంత్రులతో సుదీర్ఘంగా చర్చించిన సీఎం,




అమరావతి, సెప్టెంబర్ 3 : మంత్రివర్గ సమావేశంలో అజెండా అంశాలు ముగిశాక తాజా పరిణామాలపై సీఎం చంద్రబాబు సహచర మంత్రులతో సుదీర్ఘంగా చర్చించారు. స్థానిక సంస్థల ఎన్నికలను ఈ సంవత్సరంలోనే పూర్తి చేసి, వచ్చే ఏడాదికి ఎలాంటి ఎన్నికలు మిగలకుండా కోర్టు సమస్యలను పరిష్కరించుకుదామని చంద్రబాబు స్పష్టం చేశారు. 100 మున్సిపాలిటీలతో పాటు కోర్టు పరిధిలో ఉన్న 23 మున్సిపాలిటీల్లోనూ ఎన్నికలు జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. అన్ని ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు విజయం మిగతా 2లో..

## ఓల్డ్ సిటీ కాదు.. ఒరిజినల్ సిటీ

చేసేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ప్రస్తావించిన అభివృద్ధి పనులన్నింటినీ మంజూరు చేస్తామని సీఎం స్పష్టం చేశారు. "ఇది ఓల్డ్ సిటీ కాదు.. ఒరిజినల్ సిటీ" అని పునరుద్ఘాటించారు. గతంలో రాష్ట్రానికి ఎంతోమంది ముఖ్యమంత్రులు పనిచేసినా ఈ ప్రాంతానికి రాలేదని, ప్రజల గుండెల్లో స్థానం సంపాదించాలనే ఉద్దేశంతో తాను ఇక్కడికి వచ్చానని అన్నారు. మీరాలం ట్యాంకును రూ.500 కోట్లతో అద్భుతమైన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆరాంఘర్ ఫ్లైఓవర్, శాస్త్రిపురం ఫ్లైఓవర్ పనులను పూర్తి చేశామని, అండర్‌గ్రౌండ్ కేబుల్, రోడ్ల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని వివరించారు. భూసేకరణ ప్రక్రియ తుది దశకు చేరుకున్న నేపథ్యంలో గౌలిగూడ నుంచి చాంద్రాయణగుట్ట వరకు మెట్రో రైలు విస్తరణ పనులను వచ్చే డిసెంబర్‌లో ప్రారంభిస్తామని సీఎం ప్రకటించారు. నిరుపేదల కోసం హైదరాబాద్ నగరంలో లక్ష ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నామని తెలిపారు. యాకుత్‌పురా, చార్మినార్ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అనువైన స్థలాలను గుర్తించాలని అధికారులను ఆదేశించారు. హిందూ, ముస్లింలు వేర్వేరు కాదని, ఇద్దరూ రెండు కళ్లలాంటి వారని సీఎం పేర్కొన్నారు. హైదరాబాద్ అభివృద్ధి కోసం అన్ని వర్గాలు పరస్పరం సహకరించుకుంటూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఎన్నికల సమయంలో ఎవరి రాజకీయాలు వారివేనని, అయితే అభివృద్ధికి సంబంధించిన దరఖాస్తులు వచ్చినప్పుడు పార్టీలు, రాజకీయాలను పక్కనపెట్టి ప్రజా సమస్యల పరిష్కారానికే కృషి చేస్తున్నామని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

## పాత ప్రాజెక్టులపై క్రెడిట్ కొట్టే యత్నం

ఎత్తిపోతల పథకం పంపుల ద్వారా నీటిని ఎత్తిపోస్తూ, వాటిని పోలవరం ప్రాజెక్టు జలాలుగా చూపిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రచారం చేసుకుంటున్నారని జగన్ విమర్శించారు. పురుషోత్తపట్నం పంపులు కానీ, పోలవరం ఎడమ ప్రధాన కాలువ కానీ ప్రస్తుత ప్రభుత్వం నిర్మించినవి కావని ఆయన స్పష్టం చేశారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలోనే పోలవరం ఎడమ కాలువకు సంబంధించి 79 శాతం పనులు పూర్తయ్యాయని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. క్షేత్రస్థాయిలో కొత్తగా ఎటువంటి పనులు చేపట్టకుండా, గతంలో పూర్తయిన ప్రాజెక్టుల ద్వారా లబ్ధి పొందాలని ప్రభుత్వం ఆరాటపడుతోందని జగన్ ఆక్షేపించారు. ప్రజాధనంతో ప్రాజెక్టుల వద్ద ప్రచార కార్యక్రమాలు, పబ్లిసిటీ స్టంట్లు నిర్వహించడం అత్యంత దారుణమని ఆయన పేర్కొన్నారు.

## ప్రపంచ స్థాయి స్పోర్ట్స్ హబ్‌గా చెన్నై

సంచలన నిర్ణయాలు తీసుకున్నారు. చెన్నై నగరాన్ని ప్రపంచ స్థాయి స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టారు. శాసనసభ సాక్షిగా గురువారం ఆయన చేసిన భారీ ప్రకటనలు రాష్ట్ర వ్యాప్తంగా క్రీడాభిమానులను, యువతను ఉత్సాహపరిచాయి. రాజధాని చెన్నైలో అంతర్జాతీయ స్థాయి వసతులతో కూడిన "తమిళనాడు ఒలింపిక్ సిటీ"తో పాటు, మోటార్ స్పోర్ట్స్ ప్రేమికుల కోసం ప్రత్యేకంగా ఒక "మోటార్‌స్పోర్ట్స్ సిటీ"ని ఏర్పాటు చేయనున్నట్లు స్పష్టం చేశారు. తమిళనాడు స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్మించబోయే ఈ ఒలింపిక్ సిటీలో క్రీడాకారులకు అవసరమైన అత్యంత ఆధునిక శిక్షణా కేంద్రాలు అందుబాటులోకి రానున్నాయి. హై-పెర్ఫార్మెన్స్ ట్రైనింగ్ సెంటర్లు, స్పోర్ట్స్ సైన్స్, స్పోర్ట్స్ మెడిసిన్ సెంటర్లను ఇక్కడ నెలకొల్పుతారు. అంతేకాకుండా, దేశ విదేశాల నుంచి వచ్చే అథ్లెట్లు, కోచ్‌ల కోసం పక్కా వసతి సదుపాయాలు కల్పిస్తారు. మన క్రీడాకారులు ఒలింపిక్స్ తో పాటు అంతర్జాతీయ వేదికలపై పసిడి పతకాలతో త్రివర్ణ పతాకాన్ని ఎగరవేయడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్టును డిజైన్ చేస్తున్నారు. కార్ల రేసింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించిన సీఎం విజయ్, ఫార్ములా-1 నుంచి ఫార్ములా-4 వరకు అన్ని రకాల రేసులను నిర్వహించేందుకు వీలుగా.. ప్రత్యేకంగా ఒక మోటార్‌స్పోర్ట్స్ సిటీని నిర్మిస్తామని ప్రకటించారు. స్థానిక యువతలోని డ్రైవింగ్, రేసింగ్ ప్రతిభను వెలికితీసి, వారికి అంతర్జాతీయ స్థాయి ఛాంపియన్లుగా ఎదిగేందుకు శిక్షణ ఇస్తామన్నారు. మోటార్ రేసింగ్ ట్రాక్‌ల ఏర్పాటు వల్ల కేవలం క్రీడలే కాకుండా పర్యాటక రంగం, ప్రత్యేక వాహనాల తయారీ పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు పెరిగి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ మరింత వేగంగా పరుగులు తీస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మరోవైపు, కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ కూడా దేశంలోకి మోటార్‌స్పోర్ట్స్‌ను, ముఖ్యంగా ఫార్ములా-1 ప్రదర్శనలను తిరిగి తీసుకురావడానికి కసరత్తు ప్రారంభించింది. 2028 నాటికి భారత్‌లో ఎఫ్-1 రేసింగ్‌ను మళ్లీ పునరుద్ధరించడమే లక్ష్యంగా ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను కూడా ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో తమిళనాడు ప్రభుత్వం ముందుస్తుగా స్పందించి మోటార్‌స్పోర్ట్స్ సిటీని ప్రకటించడం, చెన్నైని ప్రపంచ రేసింగ్ మ్యాప్‌లో నిలబెట్టే దిశగా ఒక మాస్టర్ స్ట్రోక్‌గా భావించవచ్చు.

## కేబినేట్‌లో బీసీ వర్గానికి ప్రాధాన్యత..

టి. మేఘా రెడ్డిపై చేసిన వ్యాఖ్యల కారణంగా చిన్నారెడ్డి కూడా విమర్శల పాలయ్యారు. కొండా సురేఖ తన పైన చర్యల సమయంలో బీసీ కార్డు తెర మీదకు తెచ్చారు. దీంతో.. చిన్నారెడ్డి పైనా చర్యలు వెంటనే తీసుకున్నారు. ఇదే సమయంలో బీసీ వర్గానికి ప్రాధాన్యత ఇస్తూ వీరి స్థానం లో కొత్త నియామకాలు చేపట్టారు. చిన్నారెడ్డి స్థానంలో సీనియర్ నేత కేకే కుమార్తె గద్వాల విజయ లక్ష్మికి ప్లానింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ గా బాధ్యతలు అప్పగించారు. తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా నెరెళ్ల శారద ను నియమిస్తూ నిర్ణయం తీసుకున్నారు. సురేఖ ను బర్తరఫ్ చేయటం తో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన మాజీ రాజ్యసభ సభ్యురాలు గుండు సుధారాణిని కాకతీయ అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ (కుడా) ఛైర్ పర్సన్ గా నియమించారు. ఇక.. సురేఖ స్థానంలో కేబినెట్ లోకి బీసీ వర్గానికి చెందిన మహిళకు అవకాశం ఇవ్వనున్నారు. ఈ స్థానంలో కొత్త మంత్రి గా ఎవరికి అవకాశం దక్కుతుందనేది ఆసక్తి గా మారింది. ఇక.. ఢిల్లీ కేంద్రంగా జరిగిన చర్చల్లో వీరిద్దరి పైనా చర్యలు తీసుకోవాలని రేవంత్ పట్టు బట్టినట్లు తెలుస్తోంది. ఫలితంగా హైకమాండ్ ఆమోదంతో వేటు వేసారు.

## కుట్టు మిషన్ల పథకం వేగవంతం కావాలి

వచ్చినట్లు మంత్రి వెల్లడించారు. దరఖాస్తుల స్వీకరణ గడువు 15వ తేదీ వరకు కొనసాగుతుందని గుర్తు చేశారు. అర్హులైన మహిళలకు త్వరితగతిన కుట్టుమిషన్లు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఇదే సమయంలో కల్యాణలక్ష్మి పథకంపై హైకోర్టు విధించిన స్టే ఇటీవల ఎత్తివేయడంతో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని కూడా మంత్రి ఆదేశించారు. బీసీ గురుకుల సొసైటీ పరిధిలో 327 గురుకులాలు ఉన్నాయని, వాటిలో కేవలం 22 పాఠశాలలకు మాత్రమే సొంత భవనాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. మిగిలిన గురుకులాలకు అవసరమైన స్థలాలు, భవనాల వివరాలపై సమగ్ర నివేదికను ఈ నెల 15లోగా సమర్పించాలని ఆర్సీవోలను ఆదేశించారు. ప్రతి గ్రామంలో గీత కార్మికుల రక్షణ కోసం కనీసం 10 రక్షణ కిట్లు అందుబాటులో ఉండేలా చూడాలని మంత్రి సూచించారు. అలాగే ప్రతి నియోజకవర్గానికి ఒక దోబీ ఘాట్ ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని తెలిపారు. తొలి దశలో హుస్నాబాద్, హుజూరాబాద్, చొప్పదండి, వేములవాడ నియోజకవర్గాల్లో ఈ ఘాట్‌లను ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. బీసీ సంఘాల సంక్షేమం, మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం చేపట్టిన పథకాలు సకాలంలో ఫలితాలు ఇచ్చేలా పని చెయ్యాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. అధికారులు ఈ ఆదేశాలను సక్రమంగా అమలు చేస్తే లక్షలాది మహిళలకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని మంత్రి పొన్నం ప్రభాకర్ అభిప్రాయం వ్యక్తం చేశారు.

## పరకాల నుంచి సిఎం పోటీ చేయాలి

పెట్టారు. తల్లి బర్తరఫ్‌పై స్పందించిన సుస్మిత "నా తల్లికి అన్యాయం జరిగింది. ఆమె పట్ల అనుసరించిన తీరు నన్ను తీవ్రంగా బాధించింది. మా అమ్మ గొంతును ఎవరూ నొక్కలేరు. నేను రేవంత్ రెడ్డిని శపిస్తున్నాను" అని వ్యాఖ్యానించారు. అంతేకాకుండా, "నా తల్లి ప్రాతినిధ్యం వహిస్తున్న పరకాల నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని రేవంత్ రెడ్డికి సవాల్ విసురుతున్నాను" అని పేర్కొన్నారు. గతంలో తాను చేసిన వ్యాఖ్యలు కేవలం వ్యక్తిగత హోదాలో ఒక వ్యక్తిని ఉద్దేశించినవే తప్ప, ఏ పార్టీకి వ్యతిరేకం కాదని ఆమె స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడికి సంబంధించిన ఓ షెల్ కంపెనీకి తక్కువ ధరకు విలువైన భూములను కేటాయించారని సుస్మిత చేసిన ఆరోపణలతో ఈ వివాదం మొదలైంది. దీనికి తోడు, టికెట్ల కేటాయింపులో నగదు ప్రమేయం ఉందంటూ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి. చిన్నారెడ్డి చేసిన వ్యాఖ్యలు ఈ దుమారాన్ని మరింత పెంచాయి. ఈ పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ అధిష్ఠానం జోక్యం చేసుకుని, కొండా సురేఖ తొలగింపునకు ఆమోదం తెలిపింది. ఈ క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించడంతో పాటు, చిన్నారెడ్డి నియామకాన్ని కూడా రద్దు చేశారు. ఈ మేరకు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాకు సిఫార్సులు పంపారు. తన కుమార్తె చేసిన వ్యాఖ్యలతో తనకు ఎటువంటి సంబంధం లేదని కొండా సురేఖ గతంలోనే ప్రకటించినప్పటికీ, ఆమెపై వేటు తప్పలేదు.

## ఇరాన్‌ను అణుశక్తిగా మారకుండా నిరోధిస్తాం

సహకరించినా, ఆ దేశం కూడా తీవ్రమైన ఆంక్షలను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన గట్టిగా హెచ్చరించారు. కిర్గిజ్‌స్థాన్‌లోని బిష్కెక్‌లో జరిగిన 26వ షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) శిఖరాగ్ర సదస్సులో భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్‌తో భేటీ అయిన నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు అంతర్జాతీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. "భారత్, ఇరాన్ మధ్య వాణిజ్య ఒప్పందం ఉందని నేను అనుకోవడం లేదు" అని రూబియో ఓ ఇంటర్వ్యూలో స్పష్టం చేశారు. అయితే, ప్రపంచంలోని చాలా దేశాలు తమ విదేశాంగ విధానాలను స్వతంత్రంగా రూపొందించుకుంటాయని, ఇరాన్‌తో సంప్రదింపులు జరుపుతాయని ఆయన అంగీకరించారు. అవసరమైనప్పుడు ఇరాన్ ప్రభుత్వ ప్రతినిధులతో తాము కూడా చర్చలు జరిపినట్లు ఆయన గుర్తుచేశారు. అదే సమయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గతంలో చేసిన హెచ్చరికను రూబియో పునరుద్ఘాటించారు. "అమెరికా ఆంక్షలను తప్పించుకోవడానికి ఇరాన్‌కు ఏ దేశం సాయం చేయకూడదు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడానికి, అణ్వాయుధాన్ని నిర్మించడానికి అవసరమైన ఆదాయాన్ని సమకూర్చుకునే మార్గాలను ఇరాన్‌కు కల్పించకూడదు. ఒకవేళ ఏవైనా దేశాలు అలా చేస్తే, వాటిపై కూడా మేము ఆంక్షలు విధించాల్సి వస్తుంది" అని రూబియో హెచ్చరించారు.

# కొండా సురేఖ బర్తరఫ్

సీఎం రేవంత్ పై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. చివరికి సీఎం కుటుంబసభ్యులను టార్గెట్ చేయడం, కొండా సురేఖ కుమార్తె సీఎంపై వ్యక్తిగత విమర్శలు చేయడంతో పరిస్థితి చేయి దాటిపోయింది. పీసీసీ క్రమశిక్షణా కమిటీ పదవుల నుంచి తప్పించాలని సిఫారసు చేయడంతో హైకమాండ్ ఈ నిర్ణయం తీసుకుంది. ఇదే సమయంలో పరిపాలనాపరమైన, నామినేటెడ్ పదవుల్లో కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారీ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారు. తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్‌గా ఉన్న డాక్టర్ జి. చిన్నారెడ్డి నియామకాన్ని రద్దు చేస్తూ సీఎం నిర్ణయం తీసుకున్నారు. ఆయన స్థానంలో గ్రేటర్ హైదరాబాద్ మాజీ మేయర్, కేకే కుమార్తె గద్వాల్ విజయలక్ష్మిని ప్రణాళికా సంఘం నూతన వైస్ ఛైర్‌పర్సన్‌గా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు.మహిళా సంబంధిత రంగాలు, అభివృద్ధి సంస్థలకు కూడా నూతన సారథులను ప్రకటిస్తూ ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారు. తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ నూతన ఛైర్‌పర్సన్ నేరెళ్ల శారద నియామకానికి సీఎం రేవంత్ రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన సీనియర్ నేత శారదకు ఈ కీలక బాధ్యతలు అప్పగించడం ద్వారా ఆ వర్గానికి పెద్దపీట వేసినట్లయింది. మరోవైపు ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధికి సంబంధించి కీలకమైన కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పీఠాన్ని కూడా భర్తీ చేశారు. మాజీ రాజ్యసభ సభ్యురాలు గుండు సుధారాణిని కుడా ఛైర్‌పర్సన్‌గా నియమిస్తూ సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. కొండా సురేఖను తప్పించినందున ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయంలో సుధారాణికి ఈ ప్రాధాన్యత ఇచ్చారు. కేబినెట్ నుంచి కొండా సురేఖ తొలగింపు మరియు నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియ రాష్ట్ర రాజకీయంలో సంచలనంగా మారింది. ప్రభుత్వ నిర్ణయంపై కొండా సురేఖ వర్గీయుల ప్రతిస్పందన ఎలా ఉండబోతుందనేది ఆసక్తికరంగా మారగా, రేవంత్ రెడ్డి మాత్రం తన నిర్ణయాలతో పాలనపై మరియు పార్టీపై తనకున్న పూర్తి పట్టును స్పష్టం చేశారు. రాజీనామా చేయాలని అధిష్టానం సూచించినా వెనక్కి తగ్గని కొండా సురేఖపై నేరుగా బర్తరఫ్ వేటు వేయడం, అదే సమయంలో కీలక నామినేటెడ్ పోస్టులను నింపడం ద్వారా రేవంత్ రెడ్డి ప్రభుత్వం తన రాజకీయ, పరిపాలనా ముద్రను బలంగా చాటుకుంది. సురేఖ న్యూఢిల్లీలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసి, తనపై తీసుకున్న క్రమశిక్షణా చర్యలను తీవ్రంగా ప్రశ్నించిన మరుసటి రోజే ఈ పరిణామం చోటుచేసుకుంది. క్రమశిక్షణా రాహిత్యం ఆరోపణలపై పార్టీ చర్య తీసుకోవాలనుకుంటే, ముందుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికే 'షో-కాజ్ నోటీసు' (వివరణ కోరే నోటీసు) జారీ చేయాలని ఆమె వాదించారు. ముఖ్యమంత్రి, ఇతర కాంగ్రెస్ నాయకులపై సురేఖ కుమార్తె సుస్మితా పటేల్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంలో, సురేఖపై చర్యలు తీసుకుంది. ఈ వ్యవహారం ఇప్పుడు ముఖ్యమంత్రికి, కొండా కుటుంబానికి మధ్య ప్రత్యక్ష ఘర్షణగా మారింది.ఇదిలా ఉండగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన దిల్లీ పర్యటన ముగించుకుని ఈ సాయంత్రం హైదరాబాద్‌కు తిరిగి వస్తున్నారు. ఆయన శంషాబాద్ విమానాశ్రయం నుండి నల్గొండ క్రాస్ రోడ్స్‌కు చేరుకుని, అక్కడ చంచల్‌గూడ-సంతోష్ నగర్ స్టీల్ ఫ్లైఓవర్‌ను ప్రారంభిస్తారు. అనంతరం అక్కడే జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు.

## నన్ను తొలగించడం కుట్రే..

ఈ సందర్భంగా టీవీ9తో మాట్లాడిన సురేఖ పలు కీలక విషయాలను వెల్లడించారు. తనను తొలగించే ముందు కనీసం ఒక్క మాట కూడా చెప్పలేదని సురేఖ ఆవేదన వ్యక్తం చేశారు. తన వివరణ కూడా తీసుకోలేదని, రాజీనామా చేయాలని కూడా ఎవరూ చెప్పలేదన్నారు. అధిష్ఠానం నుంచి తనకు ఎలాంటి సమాచారం రాలేదని చెప్పారు. తనతో మాట్లాడి వివరణ తీసుకుని ఉండాల్సిందని అన్నారు. తనపై వేం నరేందర్‌రెడ్డి, తిరుపతి రెడ్డి, కొండల్‌రెడ్డి, పొంగులేటి సుధాకర్‌రెడ్డి కుట్ర చేశారని సురేఖ ఆరోపించారు. అయితే తదుపరి కార్యాచరణపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని చెప్పారు. తాను తప్పు చేశాననే భావన లేదన్నారు. తన కుమార్తె కొండా సుస్మిత మాట్లాడిన మాటలను పొంగులేటి సుధాకర్‌రెడ్డి రాజకీయంగా ఉపయోగించుకున్నారని ఆరోపించారు. సుస్మిత స్వతంత్ర వ్యక్తిత్వం ఉన్న వ్యక్తి అని, ఆమె అభిప్రాయాలను తాము ఖండించాల్సిన అవసరం లేదన్నారు. ఆమెతో తాము మాట్లాడించలేదని స్పష్టం చేశారు. రేవంత్‌రెడ్డిని చాలామంది విమర్శిస్తున్నా.. తన విషయంలోనే ఎందుకు ఇంత తీవ్రంగా స్పందించారో సీఎం ఆత్మపరిశీలన చేసుకోవాలని సురేఖ అన్నారు. రేవంత్ పీసీసీ అధ్యక్షుడు కావాలని కోరుకున్నవారిలో తామే ముందున్నామని గుర్తుచేశారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తర్వాత తాను ఎక్కువగా అభిమానించింది రేవంత్‌రెడ్డినేనని చెప్పారు. ప్రస్తుతం పార్టీ మారే ఆలోచన లేదని సురేఖ స్పష్టం చేశారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీపై తమకు అభిమానం ఉందన్నారు. 2018లో కూడా ఇదే "దుష్టశక్తులు" తనకు టికెట్ రాకుండా అడ్డుకున్నాయని, అందుకే అప్పట్లో బీఆర్ఎస్ వైపు చూడాల్సి వచ్చిందని చెప్పారు. అన్ని విషయాలను కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్‌కు వివరించినట్లు వెల్లడించారు. ఉరిశిక్ష పడిన ఖైదీని కూడా చివరి కోరిక అడుగుతారన్న కొండా సురేఖ తనను మాత్రం ఏ వివరణ అడగకుండానే తొలగించారని, తనను ఇలా ఏకపక్షంగా తొలగించటం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. తనను తొలగించడం అధిష్ఠానానికి కూడా ఇష్టం లేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి పట్టుబట్టి తనని బర్తరఫ్ చేయిస్తున్నారని, 'బర్తరఫ్ చేస్తారా? నన్ను వెళ్లిపోమ్మంటారా' అని అధిష్ఠానాన్ని బ్లాక్‌మెయిల్ చేశారని ఆమె ఆరోపించారు. తన మీద, తన మాజీ ఓఎస్డీ మీద కుట్రలు చేస్తున్నారని, దీని వెనక వేం నరేందర్‌రెడ్డి, పొంగులేటి, కొండల్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, మరికొందరు ఉన్నారన్నారు. అందరూ కలిసి కావాలని కక్షగట్టి నన్ను, సుమంత్ కుటుంబాన్ని వేధించారని విమర్శించారు. సుమంత్‌పై పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, పార్టీపై నేను ఎలాంటి విమర్శలు చేయలేదు. ఒకప్పుడు మల్లు రవి కూడా ఒకప్పుడు కాంగ్రెస్‌ను తిట్టారు. మాజీ సీఎం రోశయ్య, జైపాల్‌రెడ్డి కూడా ఇందిరాగాంధీని తిట్టారు. నా కుమార్తె వ్యాఖ్యలకు నాపై చర్యలు తీసుకోవటం బాధాకరం. రూ.50 కోట్లు ఇచ్చి పీసీసీ పదవి తెచ్చుకున్నారని తిట్టినవారికి పదువులు ఇచ్చారు. నన్ను తొలగించినందుకు ఏమీ బాధపడటం లేదు. కారణం చెప్పకుండా తొలగించడమే చాలా బాధాకరం. బీసీ మహిళను ఇలా అవమానకరంగా తొలగించటం బాధాకరం. కారణం చెప్పకుండా తొలగించడాన్ని జీర్ణించుకోలేకపోతున్నా. కారణం చెప్పాల్సిన బాధ్యత సీఎం, ఏఐసీసీపై ఉందని అన్నారు. మంత్రిగా తనకు ఎలాంటి అధికారాలు లేకుండా చేశారని, తన ప్రమేయం లేకుండానే తన శాఖలో నిర్ణయాలు తీసుకున్నారని ఆరోపించారు. తనకు తెలియకుండా తన ఓఎస్డీ సుమంత్‌ను తప్పించారని, అభివృద్ధి విషయంలో తన నియోజకవర్గంపై వివక్ష చూపారని విమర్శించారు. తన శాఖలోని అంశాలపై కడియం శ్రీహరి జోక్యం చేసుకున్నారని, తన శాఖలోని అధికారులతో కడియం సమీక్షలు నిర్వహించారని తెలిపారు.మంత్రులందరూ సంతోషంగా ఉన్నారా? గుండెల మీద చెయ్యి వేసుకుని చెప్పాలని సురేఖ కోరారు. మంత్రులు, ఎమ్మెల్యేలు ఎవరూ సంతోషంగా లేరనే విషయం అందరికీ తెలుసనని తెలిపారు. ఇప్పటికైనా అందరూ బయటికి వచ్చి ధైర్యంగా మాట్లాడాలని సూచించారు. ప్రజలకు సేవ, అభివృద్ధి చేయలేకపోతు న్నామనే బాధ అందరిలో ఉందని, పనుల జరగాలంటే ఎవరివద్దకు వెళ్లాలో తెలియని స్థితిలో ఎమ్మెల్యేలు ఉన్నారని ఆరోపించారు. ఇస్తామన్న హామీలు నెరవేర్చకపోవటం వల్ల ప్రజల్లో వ్యతిరేకత ఉందని స్పష్టం చేశారు. తాను తప్పు చేయలేదని, తనకు పశ్చాత్తాపం లేదని కొండా సురేఖ వెల్లడించారు. సీఎం రేవంత్ రెడ్డి ఆత్మపరిశీలన చేసుకోవాలని హితవు పలికారు. వైఎస్ఆర్ తర్వాత రేవంత్ రెడ్డినే ఎక్కువ అభిమానించానని, రేవంత్ రెడ్డి పీసీసీ అధ్యక్షుడు, సీఎం కావాలని తానే ముందు కోరుకున్నానని పేర్కొన్నారు. తనపై కక్షపూరితంగా చర్యలు తీసుకున్నారని భావిస్తున్నానన్న కొండా సురేఖ తన వల్ల ముగ్గురు బీసీ మహిళలకు పదవులు రావటం సంతోషకరమని తెలిపారు. తన కోసం చిన్నారెడ్డిపై వేటు వేయటం సరికాదని అభిప్రాయపడ్డారు. తన కుమార్తె వ్యాఖ్యలను తాను ఖండించాల్సిన అవసరం లేదన్న సురేఖ తన కుమార్తె వ్యక్తిగత అభిప్రాయాన్ని తప్పుపట్టే అధికారం తనకు లేదని స్పష్టం చేశారు. అధిష్ఠానానికి తాను ఇచ్చిన లేఖను మీడియాకు ఇస్తున్నానని, భవిష్యత్ కార్యాచరణపై ఇంకా ఆలోచించుకోలేదని తెలిపారు. జగ్గారెడ్డి, రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలపై ఏం నిర్ణయం తీసుకున్నారని ఆమె నిలదీశారు. అధిష్టానం చర్యలకు ముందు ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేకు వివరణాత్మక లేఖ రాశారు. తాజాగా ఆమె ఆ లేఖను బహిర్గతం చేశారు. 2026 ఆగస్టు 23న రాసిన ఈ లేఖలో తాను బీసీ మహిళా మంత్రిగా రాజకీయ అణచివేతకు గురవుతున్నట్లు వివరించారు. వరంగల్ ఈస్ట్ ఎమ్మెల్యేగా, అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖల మంత్రిగా పనిచేస్తున్న ఆమె తనకు 31 సంవత్సరాల సుదీర్ఘ రాజకీయ చరిత్ర ఉందని, ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన అనుభవం ఉందని ప్రస్తావించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తన అధికారాలు క్రమంగా కుదించబడుతున్నాయని ఆమె ఆరోపించారు. తన శాఖలకు సంబంధించిన కీలక నిర్ణయాలు సీఎంఓ నుంచి నేరుగా జారీ అవుతున్నాయన్నారు. తనను సంప్రదించకుండా తీసుకుంటున్నారని పేర్కొన్నారు. యాదాద్రి టెంపుల్ ట్రస్ట్ బోర్డు ఏర్పాటు వంటి ముఖ్యమైన అంశాల్లో తనకు సమాచారం కూడా ఇవ్వలేదని, సమ్మక్క-సారలమ్మ ఆలయ అభివృద్ధి నిధులు ఒక్క రోజులోనే రోడ్లు, భవనాల శాఖకు బదిలీ చేశారని వివరించారు. శ్రీ రామనవమి సందర్భంగా ప్రభుత్వ ప్రకటనల్లో తన ఫోటోను తొలగించడం తన గౌరవాన్ని దెబ్బతీసిందని అన్నారు. మాజీ ఓఎస్డీ సుమంత్‌ను తనకు తెలియకుండా తొలగించి, పోలీసులు మంత్రి నివాసానికి వచ్చి అరెస్టు చేయడానికి ప్రయత్నించారని, ఇప్పుడు అతనిపై నాన్‌బెయిలబుల్ కేసు నమోదు చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. వరంగల్ ఈస్ట్ నియోజకవర్గ అభివృద్ధికి నిధులు ఆలస్యం అవుతున్నాయని, స్మార్ట్ సిటీ, మోడల్ బస్ స్టాండ్, బొంధి వాగు విస్తరణ వంటి పనులు నిలిచిపోయాయని తెలిపారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి దేవాదాయ శాఖ అధికారులతో రివ్యూ మీటింగ్ నిర్వహించినా తనకు సమాచారం ఇవ్వలేదని, అభ్యంతరం తెలిపినా చర్యలు లేవని ఆరోపించారు. జగ్గా రెడ్డి విషయంలో అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుందని సీఎం చెప్పి, పరకాలలో రేవూరి ప్రకాశ్ రెడ్డికి భారీ మెజారిటీ ఇవ్వాలని బహిరంగంగా పిలుపునివ్వడం ద్వంద్వ వైఖరికి నిదర్శనమని అన్నారు. తన 31 సంవత్సరాల కాంగ్రెస్ సేవను దృష్టిలో ఉంచుకుని న్యాయం జరిగేలా విచారణ జరపాలని ఖర్గేను కోరారు. లేఖతో పాటు సంబంధిత వీడియోలు, ఆధారాలు ఉన్న పెన్ డ్రైవ్‌ను కూడా జత చేశారు. అయినప్పటికీ కాంగ్రెస్ పార్టీపై తన విశ్వాసం చెరగలేదని స్పష్టం చేశారు. ఈ లేఖ ద్వారా అన్ని పరిణామాలను వివరించినా రేవంత్ రెడ్డి బ్లాక్ మెయిల్ కు అధిష్టానం తలొగ్గింది అని కొండా సురేఖ వ్యాఖ్యలు చేశారు. తాను అధిష్టానానికి పంపిన లేఖను రిలీజ్ చేశారు. కాగా కేబినెట్ నుంచి బర్తరఫ్ కావటంతో సురేఖ తదుపరి నిర్ణయం పైన ఉత్కంఠ కొనసాగుతోంది. కొండా సురేఖ ఇప్పుడు ఎమ్మెల్యే పదవికి.. పార్టీకి రాజీనామా చేసేందుకు సిద్దమైనట్లు తెలుస్తోంది. ఈ మేరకు తన మద్దతు దారులతో మంత్రాంగం కొనసాగిస్తున్నారు. తన పైన వేటు ఖాయమని డిసైడ్ అయిన సురేఖ తదుపరి కార్యాచరణ కు నిర్ణయించారు. ఇప్పటికే బీజేపీ నుంచి కొండా సురేఖ కుటుంబానికి ఆహ్వానం అందింది. దీంతో.. సురేఖ తిరిగి బీఆర్ఎస్ వైపు వెళ్తారా.. లేక బీజేపీ లోకి వెళ్తారా అనేది నిర్ణయం కావాల్సి ఉంది. తనను బర్తరఫ్ చేయటం అవమాన కరంగా భావిస్తున్న సురేఖ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి ఉప ఎన్నిక లో పోటా చేయాలని భావిస్తున్నారు. దీంతో.. ముందుగా రాజీనామా ప్రకటన తరువాత.. తదుపరి రాజకీయ ప్రయాణం పైన ప్రకటన చేసే విధంగా ఆలోచన చేస్తున్నారు. దీంతో.. ఇప్పుడు కొండా సురేఖ నిర్ణయం పైన కాంగ్రెస్ లో ఉత్కంఠ పెరుగుతోంది. మరోవైపు తెలంగాణ రాజకీయాల్లో సమీకరణాలు వేగంగా మారుతున్న నేపథ్యంలో ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర మంత్రి కొండా సురేఖపై రాజీనామా, బర్తరఫ్ వార్తలు వస్తున్న సందర్భంగా ఆయన ఆమెను తన పార్టీలోకి బహిరంగంగా ఆహ్వానించారు. కొండా సురేఖను తన పార్టీలోకి ఆహ్వానించిన కేఏ పాల్ మీ కోసం ప్రజాశాంతి పార్టీ ఉంది వేరే పార్టీలోకి వెళ్లకండి అంటూ వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు ఆయన ఒక వీడియోలో కాంగ్రెస్ లో సామాజిక సమీకరణాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. బీసీలకు అన్యాయం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీలో రెడ్డి నాయకుల పదవులకు ఎలాంటి డోకా ఉండదు, కేవలం బీసీ నాయకుల పదవులకే ప్రమాదం ఉందని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీలో రెడ్డి నాయకులకే పెద్దపీట వేస్తూ, బీసీ నాయకులను అణచివేస్తున్నారని ఆయన తీవ్రంగా ఆరోపించారు.80 సంవత్సరాలలో 5 శాతం ఉన్న రెడ్లను 12 మందిని ముఖ్యమంత్రిని చేసింది కాంగ్రెస్ పార్టీ అని సంచలన వ్యాఖ్యలు చేశారు. కొండా సురేఖ వంటి బీసీ వర్గానికి చెందిన బలమైన నాయకురాలు ప్రజాశాంతి పార్టీలోకి వస్తే తగిన గౌరవం, ప్రాధాన్యత దక్కుతాయని పేర్కొన్నారు. బీసీలు, బడుగు బలహీన వర్గాలు ఒక్కటి కావాలని పిలుపునిచ్చారు.కొండా సురేఖ బర్తరఫ్ కు గవర్నర్ కు లేఖ పంపిన వేళ కేఏ పాల్ చేసిన ఈ వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

## మరింత పెరిగిన నేపాల్ మృతుల సంఖ్య

జిల్లాలో 127, గోర్ఖాలో 69, ధాడింగ్‌లో 60, తహనులో 38 మృతదేహాలను వెలికితీశారు. మరోవైపు నేపాల్ సైన్యం నేతృత్వంలోని సంయుక్త సహాయక బృందాలు గురువారం తొమ్మిదో రోజు కూడా తమ గాలింపు, సహాయక చర్యలను కొనసాగించాయి. దాదాపు 4,800 మందికి పైగా గల్లంతయ్యారని అధికారులు వెల్లడించారు. సహాయక చర్యల్లో 11,993 మందిని రక్షించినట్లు తెలిపారు. వరద బీభత్సం సృష్టించిన ప్రాంతాల్లో సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. శిథిలాలు తొలగిస్తున్న కొద్దీ మృతదేహాలు బయటపడుతున్నాయి. గుర్తుపట్టలేనతంగా ఉన్న మృతదేహాలను డీఎన్ఏ పరీక్షలకు పంపుతున్నారు. నిర్ధరించిన వాటిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్నారు. 1,113 మృతదేహాల పోస్టుమార్టం, న్యాయపరమైన ప్రక్రియలను పూర్తి చేశామని నేపాల్ పోలీసులు వెల్లడించారు. గుర్తుతెలియని 911 మృతదేహాల వెబ్‌సైట్‌లో ఉంచారు. గల్లంతైన తమవారు ఇక తిరిగిరారని భావించిన కుటుంబ సభ్యులు పశుపతి ఆర్యఘాట్ వద్ద ప్రతీకాత్మక దహన సంస్కారాలు నిర్వహించారు. వరదల్లో కొట్టుకుపోయిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని ఆశిస్తూ ప్రార్థనలు చేస్తున్నారు. మరోవైపు నువాకోట్‌లోని బిదూర్‌లో వరద వల్ల రోడ్లు కొట్టుకుపోగా నేపాల్ ఆర్మీ త్రిశూలీ నదిపై తాత్కాలికంగా జిప్‌లైన్ ఏర్పాటు చేసింది. జిప్‌లైన్ ద్వారా ప్రజల్ని నదికి ఒకవైపు నుంచి మరోవైపు తరలిస్తోంది. విపత్తు ప్రభావిత ప్రాంతాల్లో 21,314 మంది భద్రతా సిబ్బంది ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. అయితే, భోటేకోశీ, త్రిశూలీ నదులపై ఉన్న జల విద్యుత్ ప్రాజెక్టుల భూగర్భ సొరంగాల్లో భారీగా బురద పేరుకుపోవడంతో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. సొరంగాల మార్గాలు కూడా ఎక్కడున్నాయో గుర్తించడం కష్టంగా ఉందని అధికారులు చెబుతున్నారు.

## భారత ఆర్థిక వృద్ధి వల్ల ప్రపంచానికి కొత్త అవకాశాలు

చర్చలు జరిగాయి. అందులో వాణిజ్యం, రక్షణ, కీలక ఖనిజాలు, క్లీన్ ఎనర్జీ, అధునాతన సాంకేతికత వంటి అంశాలపై ప్రధానంగా చర్చించారు. రెండు దేశాల మధ్య సహకారాన్ని మరింత విస్తరించేందుకు పలు నిర్ణయాలు తీసుకున్నారు. చర్చల అనంతరం నిర్వహించిన సంయుక్త మీడియా సమావేశంలో ప్రధాని మోదీ ప్రపంచ పరిస్థితులు, భారత్ ఆర్థిక ప్రగతి, శాంతి-భద్రత వంటి అంశాలపై మాట్లాడారు. ప్రస్తుతం ప్రపంచం తీవ్ర మార్పులు, అనిశ్చితితో కూడిన పరిస్థితులను ఎదుర్కొంటోందని అన్నారు. ఆహారం, ఇంధనం, సరఫరా వ్యవస్థల నుంచి దాదాపు ప్రతి రంగంపైనా అంతర్జాతీయ పరిణామాల ప్రభావం పడుతోందని మోదీ పేర్కొన్నారు. పలు ప్రాంతాల్లో ఘర్షణలు కొనసాగుతున్నప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ తన వేగాన్ని కొనసాగిస్తోందని చెప్పారు. ఇటీవల ముగిసిన త్రైమాసికంలో భారత్ 7.8 శాతం ఆర్థిక వృద్ధిని నమోదు చేసిందని వెల్లడించారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అనేక సవాళ్లను ఎదుర్కొంటున్న సమయంలో భారత్ వృద్ధి కొనసాగడం సానుకూల పరిణామమని పేర్కొన్నారు. దేశ ఆర్థిక ప్రగతి ఇప్పుడు ప్రపంచానికి విశ్వాసాన్ని కలిగించడంతో పాటు కొత్త అవకాశాలకు దారితీస్తోందని మోదీ అన్నారు. ఇక ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో కొనసాగుతున్న యుద్ధాలు, ఉద్రిక్తతలపైనా ఇరువురు నేతలు చర్చించారు. ఉక్రెయిన్, పశ్చిమాసియా ప్రాంతాల్లో నెలకొన్న పరిస్థితులపై భారత్ వైఖరిని మోదీ మరోసారి స్పష్టం చేశారు. అంతర్జాతీయ వివాదాలకు చర్చలు, దౌత్యం, న్యాయపాలన ఆధారంగా పరిష్కారం కనుగొనాల్సిన అవసరం ఉందన్నారు. ఉక్రెయిన్ లేదా పశ్చియాసియా అయినా ఘర్షణలు త్వరగా ముగిసి శాంతి నెలకొనేం దుకు చేపట్టే ప్రయత్నాలకు భారత్?, బెల్జియం మద్దతు ఇస్తాయని తెలిపారు. ఉగ్రవాదంపై కూడా ఇరుదేశాలు ఒకే వైఖరిని కలిగి ఉన్నాయని మోదీ చెప్పర్న్ణ. ఉగ్రవాదాన్ని ఏ రూపంలో ఉన్నా నిర్మూలించేందుకు కలిసి పనిచేయడం రెండు దేశాల ఉమ్మడి బాధ్యతగా పేర్కొన్నారు. భారత్?, బెల్జియం మధఅయ భవిష్యత్ సహకారంలో క్లీన్ ఎనర్జీ, సురక్షితమైన సరఫరా వ్యవస్థలకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించారు. పునరుత్పాదక ఇంధన రంగానికి సంబంధించి ఇరుదేశాల మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఇది సుస్థిర ఇంధన రంగంలో ద్వైపాక్షిక భాగస్వామ్యానికి మరింత ఊతమిస్తుందని మోదీ అన్నారు. ప్రపంచవ్యాప్తంగా కీలక ఖనిజాలకు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో ఈ రంగంపైనా ఇరుదేశాలు దృష్టి సారించాయి. ఖనిజాల ప్రాసెసింగ్, రీసైక్లింగ్‌లో సహకారాన్ని పెంచుకోవాలని నిర్ణయించినట్లు ప్రధాని తెలిపారు. సరఫరా వ్యవస్థలను బలోపేతం చేసేందుకు ఈ భాగస్వామ్యం ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. అధునాతన సాంకేతిక రంగంలోనూ భారత్, బెల్జియం మధ్య సహకారానికి విస్తృత అవకాశాలున్నాయని ప్రధాని మోదీ చెప్పారు. ముఖ్యంగా సెమీకండక్టర్ రంగంలో బెల్జియం సాంకేతిక నైపుణ్యం, భారత్ వద్ద ఉన్న విస్తృత స్థాయి ఉత్పత్తి సామర్థ్యం ఒకదానికొకటి అనుకూలంగా ఉంటాయని పేర్కొన్నారు. రక్షణ రంగంలోనూ భాగస్వామ్యాన్ని పెంచుకునేందుకు ఇరుదేశాలు ఆసక్తి చూపాయి. ఆధునిక రక్షణ సాంకేతికత పరికరాల తయారీ, పరిశ్రమల మధ్య భాగస్వామ్యానికి అవకాశాలను అన్వేషించున్నాయి. భారత్, యూరోపియన్ యూనియన్ మధ్య కుదిరిన చారిత్రక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం రెండు దేశాల సంబంధాలకు కొత్త అవకాశాలను తెరుస్తుందని బెల్జియం ప్రధాని బార్ట్ డి వెవర్ అన్నారు. భారత్, యూరప్ మధ్య ఆర్థిక సంబంధాలు మరింత బలోపేతం కావడానికి ఈ ఒప్పందం కీలక మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. భారత్, యూరోపియన్ యూనియన్ ప్రపంచంలోని అతిపెద్ద ప్రజాస్వామ్య శక్తుల్లో రెండుగా ఉన్నాయని మోదీ గుర్తుచేశారు. రెండు పక్షాల మధ్య పెరుగుతున్న సహకారం ప్రపంచ స్థిరత్వం, ఆర్థిక వృద్ధి, ఉమ్మడి అభివృద్ధికి దోహదపడుతుందని అన్నారు.

## ప్రజల్లోకి వాస్తవాలు తీసుకెళ్ళండి

సాధించేలా ఇంఛార్జ్? మంత్రులు బాధ్యత తీసుకోవాలని చంద్రబాబు సూచించారు. అదేవిధంగా జిల్లాల్లో జఠిలమైన సమస్యల పరిష్కారానికి ఇంఛార్జ్? మంత్రులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పరిష్కారం కాని అంశాలను సంబంధిత శాఖ మంత్రుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని ఆదేశించారు. నరసాపురంలో ప్రజల ఆధీనంలో ఉన్న ఆరు వేల ఎకరాలకు రెండు నెలల్లో పట్టాలు ఇవ్వాలని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి భూములను గుర్తించి అర్హులకు పట్టాలు మంజూరు చేయాలని ఆదేశాలిచ్చారు. రాష్ట్రంలో ఎల్‌నినో పరిస్థితులపై వివరాలతో ఇవాళే కేంద్రానికి లేఖ రాస్తామని చంద్రబాబు తెలిపారు. గత 30 ఏళ్లలో ఎన్నడూ లేనంతగా ఈసారి వర్షపాతం లోటు నమోదైందని చెప్పారు. అన్నమయ్య జిల్లాలో 76 శాతం, ప్రకాశం జిల్లాలో 70 శాతం లోటు ఉందన్నారు. దేశవ్యాప్తంగా సగటు వర్షపాతం లోటు 14 శాతం ఉంటే ఏపీలో 52 శాతం ఉందని వివరించారు. ప్రతి నెలా క్షేత్రస్థాయి పరిస్థితులను కేంద్రానికి నివేదించాలని ముఖ్యమంత్రి సూచించారు. తాగునీటికి ఎంతైనా ఖర్చు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చంద్రబాబు స్పష్టం చేశారు. అవసరమైన ప్రాంతాలకు తాగునీటిని రవాణా చేసేందుకు అన్ని చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అవకాశమున్న చోట నీటి నిల్వలు పెంచాలని, భూగర్భ జలాల పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ అవసరమైతే అదనపు బోర్లకు అనుమతించాలని సూచించారు. వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల్లో జీఎస్‌డీపీ తగ్గకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశాలిచ్చారు. పశుగ్రాసానికి ఎలాంటి కొరత లేకుండా చూడాలని, సీడ్ బాల్స్ కార్యక్రమానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రతి మంత్రివర్గ సమావేశంలో ఎల్‌నినో ప్రభావం, క్షేత్రస్థాయి పరిస్థితులపై సమీక్షించాలని తెలిపారు. వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు విపత్తు నిర్వహణ ద్వారా కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు పొందే అన్ని అవకాశాలను పరిశీలించాలని చంద్రబాబు ఆదేశించారు. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను కేంద్రానికి ఎప్పటికప్పుడు నివేదిస్తూ అవసరమైన సహాయం పొందేందుకు చర్యలు తీసుకోవాలని సూచన చేశారు. లాశయాల్లో నీరు ఉన్నప్పటికీ పంటలకు నీరు ఇవ్వడం లేదంటూ వైఎస్సార్సీపీ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని సమర్థంగా తిప్పికొట్టి వాస్తవాలను ప్రజలకు వివరించాలని సీఎం సూచించారు. వెలిగొండ, పోలవరం ఎడమ కాలువకు నీటి విడుదలపైనా దుష్ప్రచారం జరుగుతోందని చెప్పారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న ప్రతి మంచి పనిని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. మంత్రులు, పార్టీ శ్రేణులు నిత్యం ప్రజల్లో ఉంటూ వాస్తవాలను వివరించాలని సూచించారు గ్రౌండ్‌వాటర్ డేటాను అందుబాటులో ఉంచి రైతు సేవా కేంద్రాల ద్వారా అన్నదాతలకు అవసరమైన సమాచారాన్ని అందించాలని చంద్రబాబు ఆదేశించారు. వాస్తవ పరిస్థితులను ప్రజలకు వివరించే కార్యక్రమంలో అందరినీ భాగస్వాములను చేయాలని సూచించారు. సోషల్ మీడియాలో ప్రచారమయ్యే అవాస్తవాల ప్రభావానికి నేటి తరం లోనుకాకుండా వాస్తవాలను ప్రజలకు చేరవేయడంలో ప్రభుత్వం కూడా చురుగ్గా వ్యవహరించాలన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరగకుండా మంత్రులు నాదెండ్ల మనోహర్, పయ్యావుల కేశవ్, అచ్చెన్నాయుడు నిరంతరం పర్యవేక్షించాలని చంద్రబాబు ఆదేశించారు. రైతు బజార్లలో బియ్యాన్ని తక్కువ ధరకు అందిస్తున్నట్లు నాదెండ్ల మనోహర్ వివరించారు. మిగిలిన నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణకు తగిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సీఎం సూచించారు. సూర్యఘర్ పథకం వినియోగంలో నాలుగో స్థానంలో ఉన్న ఏపీని మొదటి స్థానానికి తీసుకురావాలని లక్ష్యంగా నిర్దేశించారు. రాష్ట్రంలో కనీసం 20 లక్షల కనెక్షన్లు వినియోగంలోకి వచ్చేలా చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. దేశవ్యాప్తంగా కోటి కనెక్షన్లకు సబ్సిడీ ఇస్తున్న నేపథ్యంలో మెజార్టీ సబ్సిడీ ఆంధ్రప్రదేశ్?కు దక్కేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వెలిగొండ ప్రాజెక్టు, పోలవరం ఎల్ఎంసీ ప్రారంభించిన సందర్భంగా మంత్రులు, ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఘనంగా గౌరవం తెలిపారు. కేబినెట్ హాల్‌లోకి ఆయన అడుగుపెట్టగానే మంత్రులంతా లేచి నిలబడి చప్పట్లతో అభినందించారు. రెండు ప్రాజెక్టుల ప్రారంభం సందర్భంగా సీఎంకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా చంద్రబాబుకు స్టాండింగ్ ఓవేషన్‌తో అభినందనలు తెలిపారు. వెలిగొండ ప్రారంభ కార్యక్రమాన్ని జలవనరులు, ఆర్థిక శాఖలు సమన్వయంతో విజయవంతంగా నిర్వహించాయని చంద్రబాబు ప్రశంసించారు. సింప్లిసిటీని పాటిస్తూ సమర్థంగా పనిచేసిన మంత్రి నిమ్మల రామానాయుడిని ముఖ్యమంత్రి అభినందించారు. వెలిగొండ, పోలవరం ఎల్ఎంసీలకు నీటి విడుదల కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన మంత్రి, ఇంజనీరింగ్ అధికారులకు సీఎం అభినందనలు తెలియజేశారు. కార్యక్రమాల నిర్వహణలో సమన్వయ లోపంతో ప్రోటోకాల్ ఉల్లంఘనలు జరగడం సరికాదని చంద్రబాబు స్పష్టం చేశారు. శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల ప్రకటనల్లో సంబంధిత శాఖ మంత్రుల ఫోటోలు తప్పనిసరిగా ఉండేలా చూడాలని ఆదేశించారు.

# సంపాదకీయం

## కూతురి రాజకీయ భవితవ్యం కోసమే!

నేడు రాష్ట్ర రాజకీయాలు కొండా ఫ్యామిలీ చుట్టూ తిరుగుతున్నాయి. ఎప్పుడు ఏ నిర్ణయం తీసుకుంటారో.. అధిష్టానం ఎటువైపుగా అడుగులు వేస్తుందో అని ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. కానీ కొండా దంపతులు తమ సుదీర్ఘ రాజకీయ అనుభవం, బీసీ వర్గాల్లోని బలం, ప్రజా మద్దతును ఉపయోగించి కూతురికి స్వతంత్ర రాజకీయ వేదికను సిద్ధం చేయాలని భావిస్తున్నట్టుగా కూడా చర్చ జరుగుతోంది. కొత్త వేదిక ద్వారా ఆమెకు అవకాశం కల్పించాలనే ఆలోచన ఉందని వారి సన్నిహితులు చెబుతున్నారు. బీసీల ఆత్మగౌరవం, ప్రాతినిధ్యం అజెండాగా కొత్త రాజకీయ శక్తిని నిర్మించే ప్రయత్నం కూడా ఈ కోణంలోనే చూడవచ్చు. తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం కొండా సురేఖ రాజీనామా వ్యవహారం హాట్ టాపిక్ గా మారింది. కొండా సురేఖ మంత్రి పదవికి రాజీనామా చెయ్యాలని, లేదంటే పార్టీ నుండి బర్తరఫ్ చేస్తామని పార్టీ అధిష్టానం ఆదేశాలు జారీ చేయటంతో కొండా కపుల్ రాజకీయ భవితవ్యం గందరగోళంలో పడింది. కూతురు చేసిన వ్యాఖ్యలు కొండా సురేఖ రాజకీయ జీవితాన్ని మార్చేస్తుంది అన్న చర్చ స్థానికంగా జోరుగా సాగుతోంది. చాలా కాలంగా కొండా కపుల్ తమ కుమార్తె పొలిటికల్ ఎంట్రీ కోసం ప్రయత్నం చేస్తున్నారు. గతంలోనూ బీఆర్ఎస్ లో ఉన్న సమయంలో కూడా కొండా సుస్మితకు టికెట్ కావాలని అధిష్టానం మీద ఒత్తిడి తెచ్చారు. కొండా సుస్మిత తన తల్లిదండ్రుల రాజకీయ వారసత్వాన్ని కొనసాగించాలనే ఆలోచనతో పరకాల నియోజకవర్గంపై గంపెడు ఆశలు పెట్టుకుంది. అయితే ఇటీవల సీఎం రేవంత్ పరకాలలో మళ్ళీ టికెట్ రేవూరి ప్రకాష్ రెడ్డికే అని ప్రకటన చేయటంతో సుస్మిత ఆశలమీద నీళ్ళు చల్లినట్టు అయ్యింది. దీంతో పొలిటికల్ ఫ్యూచర్ పైన ఆందోళనలో ఉన్న కొండా సుస్మిత సీఎం రేవంత్ రెడ్డిని తీవ్రస్థాయిలో టార్గెట్ చేశారు. సీఎంపై సుస్మిత చేసిన విమర్శలు పార్టీలో తీవ్ర అలజడి సృష్టించాయి. దీనితో కొండా సురేఖపై షోకాజ్ నోటీసు, పదవి నుంచి తొలగించాలనే డిమాండ్లు వచ్చాయి. అయితే కొండా దంపతులు తమ కుమార్తె చేసిన వ్యాఖ్యలకు తాము బాధ్యులు కాదని, ఆమె స్వతంత్ర వ్యక్తి అని స్పష్టం చేశారు. వారు కొండా సుస్మిత వ్యాఖ్యలను ఖండించి ఉంటే పరిస్థితి మరోలా ఉండేది. కానీ కొండా సుస్మిత వ్యాఖ్యలను ఖండించలేదు. ఒకవేళ అదే చేస్తే కూతురికి రాజకీయంగా అనవసరపు ఇబ్బంది వస్తుందని, కూతురి కోసం పోరాటమే చెయ్యాలని నిర్ణయం తీసుకున్నారు. కొండా దంపతులు తమ సుదీర్ఘ రాజకీయ అనుభవం, బీసీ వర్గాల్లోని బలం, ప్రజా మద్దతును ఉపయోగించి కూతురికి స్వతంత్ర రాజకీయ వేదికను సిద్ధం చేయాలని భావిస్తున్నట్టుగా కూడా చర్చ జరుగుతోంది. కొత్త వేదిక ద్వారా ఆమెకు అవకాశం కల్పించాలనే ఆలోచన ఉందని వారి సన్నిహితులు చెబుతున్నారు. బీసీల ఆత్మగౌరవం, ప్రాతినిధ్యం అజెండాగా కొత్త రాజకీయ శక్తిని నిర్మించే ప్రయత్నం కూడా ఈ కోణంలోనే చూడవచ్చు. తల్లిదండ్రులు తమ బిడ్డ రాజకీయ భవిష్యత్తు కోసం తమ పదవి, పార్టీలోని స్థానం, దశాబ్దాలుగా నిర్మించుకున్న రాజకీయ జీవితాన్ని రిస్క్ చేయటం మామూలు విషయం కాదు. కానీ కొండా దంపతులు ఈ రిస్క్ చేశారు. ఏదేమైనా ఎదో ఒక రచ్చతో నిత్యం ప్రజల మధ్యన హాట్ టాపిక్ గా నిలుస్తూ కొత్త రకం ప్రచారానికి తెర తీస్తున్నారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. మరోవైపు తెలంగాణ రాజకీయాల్లో కొత్త సమీకరణాలు ఊపందుకుంటున్నాయి. మంత్రివర్గం నుండి కొండా సురేఖకు ఉద్వాసన పలుకుతున్న క్రమంలో కొండా దంపతుల రాజకీయ భవితవ్యంపైన చర్చ జరుగుతోంది. మొదట నుండి వివాదాస్పదులే అయినప్పటికీ సుదీర్ఘ రాజకీయ అనుభవం, బలమైన కేడర్, వరంగల్ లో బలమైన పట్టు, ఉన్న మంత్రి కొండా సురేఖ, కొండా మురళీ దంపతులు నూతన రాజకీయ శక్తిగా ఆవిర్భవించేందుకు సమాయత్తమవుతున్నారనే వార్తలు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశం అవుతున్నాయి. బీసీ వర్గాల హక్కులు, ఆత్మగౌరవమే ప్రధాన అజెండాగా వారు ఈ నిర్ణయం తీసుకోబోతున్నారని వారి అనుచరులు, శ్రేయోభిలాషులు చెబుతున్నారు. రాష్ట్ర జనాభాలో 50 శాతానికి పైగా ఉన్న బీసీ సామాజిక వర్గాల ఆత్మగౌరవ జెండాను ఎగురవేయడమే లక్ష్యంగా వారు వ్యూహ రచన చేస్తున్నారని సమాచారం. 40 ఏళ్ల రాజకీయ అనుభవం, పుష్కలమైన ప్రజా మద్దతు, అంగబలం, ఆర్థిక బలం తమకు అనుకూలంగా ఉన్నాయని కొండా దంపతులు భావిస్తున్నారు. ప్రస్తుతం బీసీ మేధావులు, శ్రేయోభిలాషులు, మద్దతుదారులతో విస్తృత స్థాయిలో సమాలోచనలు కొనసాగుతున్నాయి. కొండా దంపతుల నిర్ణయం బీసీల ఏకీకరణకు ఇది మంచి అవకాశం అని వారి మద్దతుదారులు భావిస్తున్నారు. రాష్ట్రంలో మెజారిటీ జనాభా ఉన్న బీసీ వర్గాలను ఒకే వేదికపైకి తెచ్చి, వారికి తగిన రాజకీయ ప్రాధాన్యం కల్పించేందుకు ఈ చర్య దోహదపడుతుందని అంటున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలలో టికెట్లు దక్కక నిరాశలో ఉన్న సమర్థులైన నాయకులకు అవకాశం కల్పించి, వారిని గెలిపించుకునే వ్యూహంతో ముందుకు వెళ్లాలని భావిస్తున్నట్టు సమాచారం. కోదండరామ్, కవిత, తీన్మార్ మల్లన్న వంటి నాయకులు స్వంత వేదికల ద్వారా గుర్తింపు పొందినట్లే, దశాబ్దాలుగా ప్రజాదరణ ఉన్న తాము కూడా స్వతంత్రంగా ముందుకు రావాలనే ఆలోచన కొండా దంపతుల్లో ఉందని వారి సన్నిహితులు చెబుతున్నారు. ప్రకటన అనంతరం నేరుగా ప్రజల్లోకి వెళ్లి వారి సమస్యలు తెలుసుకునేందుకు రాష్ట్రవ్యాప్త పాదయాత్రకు కూడా ప్రణాళికలు సిద్ధమవుతున్నట్లు సమాచారం. మరి కొండా దంపతులు కొత్త రాజకీయ పార్టీ పెడితే వారి వెంట నడిచేవారు ఎందరు? వారు ఈ ప్రయత్నంలో సక్సెస్ అవుతారా అన్న చర్చ కూడా సాగుతుంది. అయితే, దీనిపై కొండా కుటుంబం నుండి అధికారిక ప్రకటన ఇంకా రాలేదు.

## మత్తు పదార్థాలపై ఎక్సైజ్ శాఖ ఉక్కుపాదం



కాగజ్‌నగర్, సెప్టెంబర్ 3 (విజన్ ఆంధ్ర): కొమురం భీం జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలో ఎక్సైజ్ సీఐ రవికుమార్ మాట్లాడుతూ సిర్పూర్ నియోజకవర్గ పరిధిలోని ఏడు మండలాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. అక్రమ మద్యం, దేశీదారు విక్రయాలు, రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. తనిఖీల్లో ఇప్పటివరకు రూ.18 లక్షల జరిమానాలు విధించడంతో పాటు అక్రమ రవాణాకు ఉపయోగించిన 145 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. నిబంధనలకు విరుద్ధంగా దేశీదారు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గుడుంబా తయారీ, విక్రయాలను అరికట్టేందుకు ప్రత్యేక తనిఖీలు కొనసాగుతున్నాయని తెలిపారు. అలాగే గంజాయి వంటి మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలకు పాల్పడే వారిపై కూడా కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. మత్తు పదార్థాల వల్ల యువత భవిష్యత్తు నాశనం కావడంతో పాటు కుటుంబాలు, సమాజంపై తీవ్ర ప్రభావం పడుతుందని పేర్కొన్నారు. మత్తు పదార్థాల నియంత్రణకు ప్రజలు కూడా సహకరించాలని, అక్రమ మద్యం, గుడుంబా, గంజాయి విక్రయాలపై సమాచారం ఉంటే ఎక్సైజ్ అధికారులకు తెలియజేయాలని సూచించారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. సిర్పూర్ నియోజకవర్గంలో మత్తు పదార్థాల అక్రమ కార్యకలాపాలకు పూర్తిగా అడ్డుకట్ట వేసే వరకు తనిఖీలు, చర్యలు నిరంతరం కొనసాగుతాయని సీఐ రవికుమార్ స్పష్టం చేశారు.

## ఎన్నారైల నుంచి పోటెత్తనున్న విరాళాలు

ముంబై, సెప్టెంబర్ 3విదేశీ మారక నిధులను ఆకర్షించేందుకు భారత ప్రభుత్వం, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) చేపట్టిన ప్రయత్నాలు అద్భుతమైన ఫలితాలనిచ్చాయి. ఆర్బీఐ ప్రవేశపెట్టిన ప్రత్యేక యూఎస్ డాలర్–రూపాయి స్వాప్ సదుపాయం ద్వారా ఆగస్టు 31 నాటికి ఏకంగా 136 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 1.30లక్షల కోట్లు) నిధులు దేశంలోకి వచ్చాయి. ఆర్బీఐ విడుదల చేసిన ప్రాథమిక గణాంకాల ప్రకారం ఈ భారీ మొత్తం సమీకరణ జరిగింది. ఇది ఇటీవలి భారత చరిత్రలో అత్యంత విజయవంతమైన డాలర్ల సమీకరణ ప్రయత్నాల్లో ఒకటిగా నిలిచింది.ప్రవాస భారతీయులు (ఎన్నారైలు), భారత కంపెనీలను ప్రోత్సహించి, దేశంలోకి విదేశీ కరెన్సీ ప్రవాహాన్ని పెంచే లక్ష్యంతో ఈ స్కీమ్‌ను జూన్ 8న ప్రారంభించారు. మూడు మార్గాల ద్వారా ఈ నిధులను సమీకరించారు. అవి: ప్రవాస భారతీయుల ఫారిన్ కరెన్సీ డిపాజిట్లు (ఎఫ్‌సీఎన్ఆర్–బి), భారత కంపెనీలు విదేశాల నుంచి సేకరించే రుణాలు, ఎక్స్‌టర్నల్ కమర్షియల్ బారోయింగ్స్ (ఈసీబీ). మొత్తం 136 బిలియన్ డాలర్లలో సింహభాగం, అంటే సుమారు 127 బిలియన్ డాలర్లు (93%), ఎన్నారైల డిపాజిట్ల రూపంలోనే రావడం గమనార్హం. మిగిలిన నిధుల్లో విదేశీ రుణాల ద్వారా 5 బిలియన్ డాలర్లు, ఈసీబీల ద్వారా 3.8 బిలియన్ డాలర్లు సమకూరాయి. ఈ గణాంకాలు ప్రాథమికమైనవి కావడంతో తుది లెక్కల్లో స్వల్ప మార్పులు ఉండవచ్చని ఆర్బీఐ తెలిపింది.ఈ స్కీమ్‌కు చివరి రోజుల్లో స్పందన అనూహ్యంగా పెరిగింది. ఆగస్టు 21 నాటికి 73 బిలియన్ డాలర్లు నిధులు రాగా, చివరి 10 రోజుల్లోనే మరో 63 బిలియన్ డాలర్లు వచ్చి చేరాయి. ఈ భారీ స్పందనతో నిర్దేశిత లక్ష్యం గడువు కంటే ముందే నెరవేరడంతో ఆర్బీఐ కీలక నిర్ణయం తీసుకుంది. ఎఫ్‌సీఎన్ఆర్(బి) డిపాజిట్ల విండోను ముందుగా ప్రకటించిన సెప్టెంబర్ 30కి బదులుగా, ఆగస్టు 31నే ముగించింది. అయితే, మిగిలిన రెండు రుణ సమీకరణ మార్గాలు డిసెంబర్ 31 వరకు అందుబాటులో ఉంటాయి. దీంతో తుది నిధుల సమీకరణ మరింత పెరిగే అవకాశం ఉంది.ఈ భారీ నిధుల రాకతో భారత్ విదేశీ మారక నిల్వలు (ఎక్స్‌టర్నల్ బఫర్స్) మరింత పటిష్ఠం కానున్నాయి. అంతర్జాతీయంగా చమురు ధరల పెరుగుదల, పెట్టుబడుల తరలింపు వంటి ఒడిదొడుకుల నుంచి ఆర్థిక వ్యవస్థను కాపాడేందుకు ఆర్బీఐకి ఇది అదనపు బలాన్ని ఇస్తుంది. భారత ఆర్థిక వ్యవస్థ, బ్యాంకింగ్ వ్యవస్థపై ఎన్నారైలు ఉంచిన నమ్మకానికి ఇది నిదర్శనమని ఆర్థిక మంత్రిత్వ శాఖ వర్గాలు భావిస్తున్నాయి. 2013లో ఆర్బీఐ ప్రవేశపెట్టిన ఇలాంటి స్కీమ్ ద్వారా మూడు నెలల్లో కేవలం 26 బిలియన్ డాలర్లు మాత్రమే సమీకరించగలిగారు. దానితో పోలిస్తే తాజా స్కీమ్ ఇప్పటికే ఐదు రెట్లకు పైగా నిధులను ఆకర్షించడం విశేషం. అంతర్జాతీయ కరెన్సీ మార్కెట్లు అనిశ్చితితో ఉన్న ఈ తరుణంలో, ఈ స్కీమ్ ద్వారా లభించిన భారీ నిధులు ఆర్బీఐకి గొప్ప ఊరటనిస్తున్నాయి

## భూసేకరణ పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులో పూర్తి చేయాలి: కలెక్టర్ ఖుష్బూ గుప్తాలి

మహబూబ్ నగర్ ప్రతినిధి ఆగస్ట్ 3(విజన్ ఆంధ్ర)జిల్లా లో వివిధ సాగునీటి ప్రాజెక్టులు, భారత్ మాల జాతీయ రహదారి, రైల్వేలైన్ డబ్బింగ్, పారిశ్రామిక ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ పనులను వేగవంతం చేసి, పెండింగ్ అంశాలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు.గురువారం కలెక్టర్ కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్ హాల్లో భారత్‌మాల, జాతీయ రహదారులు, రైల్వే లైన్ డబ్లింగ్, బ్రహ్మోస్ క్షిపణి తయారీ కర్మాగారం, కురుమూర్తి దేవాలయ అభివృద్ధి, ఎం.జి.కె.ఎల్.ఐ, లక్ష్మీదేవిపల్లి, అజిలాపూర్ ఎత్తిపోతల ప్రాజెక్టుల సంబంధించిన భూసేకరణతో పాటు పునరావాసం, పునరావాస పరిహారం కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు.ముందుగా మహబూబ్‌నగర్ రూరల్, భూత్పూర్, దేవరకద్ర మండలాల పరిధిలో భూసేకరణ పురోగతిని సమీక్షిస్తూ అవార్డుల ప్రక్రియ, పరిహారం చెల్లింపులు, ఖాతా ధ్రువీకరణ, న్యాయస్థాన కేసులు, వివాదాస్పద భూముల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించి, న్యాయస్థాన పరిధిలో ఉన్నవి, ఇతర వివాదాలకు సంబంధించిన కేసులను స్పష్టంగా వర్గీకరించి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు.దేవరకద్ర మండలంలో పెండింగ్ కేసులపై నివేదికల సమర్పణలో జాప్యం చేయకుండా వెంటనే నివేదికలను సమర్పించి, మిగిలిన వాటినీ దశలవారీగా పరిష్కరించాలని ఆదేశించారు. న్యాయస్థాన కేసులకు సంబంధించిన ఓఎస్ నంబర్లను నివేదికల్లో తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. వచ్చే సమీక్ష నాటికి పెండింగ్ కేసులను పూర్తిగా పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. భూత్పూర్ మండలంలో జాతీయ రహదారి భూసేకరణకు సంబంధించి స్థానికుల నుంచి ఎదురవుతున్న సమస్యలను ప్రత్యేకంగా సమీక్షించారు. జాతీయ రహదారుల అధికారులతో సమన్వయం చేసుకుని భూ యజమానులతో సమావేశం నిర్వహించాలని, వారి అభ్యంతరాలను నమోదు చేసి సమస్యకు పరిష్కారం చూపాలని ఆదేశించారు. తహసీల్దార్లపై మాత్రమే ఆధారపడకుండా సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని సూచించారు. వచ్చే వారంలోగా స్థానికులతో సమావేశం నిర్వహించి, తీసుకున్న చర్యలపై



నివేదిక సమర్పించాలని ఆదేశించారు.జిల్లాలో రైల్వే లైన్ డబ్లింగ్ పనులకు సంబంధించి అవసరమైన భూముల గుర్తింపు, సరిహద్దు గుర్తులు, భూ యజమానుల వివరాలు, అవార్డులు, పరిహారం చెల్లింపులపై కలెక్టర్ సమీక్షించారు. మహబూబ్‌నగర్ అర్బన్ మండల పరిధిలో కొన్ని ప్రాంతాల్లో సరిహద్దు గుర్తుల ప్రక్రియ పూర్తికాకపోవడం, భూసేకరణ దస్త్రాల్లో స్పష్టత లేని అంశాలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అవసరమైన చోట భూసేకరణ ప్రతిపాదనలను సక్రమంగా సిద్ధం చేసి సమర్పించాలని సూచించారు.అవార్డుల ప్రక్రియను నిర్ణీత గడువులో పూర్తి చేసి, అవార్డులు జారీ అయిన ప్రాంతాల్లో పరిహారం చెల్లింపులను వేగవంతం చేయాలని ఆదేశించారు. రైల్వే లైన్ రెట్టింపుతో పాటు రైల్వే స్టేషన్ల విస్తరణకు అవసరమైన భూసేకరణను కూడా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని పూర్తి చేయాలని సూచించారు.తెలంగాణ పారిశ్రామిక మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ (టి.జి.ఐ.ఐ.సి) ఆధ్వర్యంలో చేపడుతున్న బ్రహ్మోస్ క్షిపణి తయారీ కర్మాగారానికి అవసరమైన భూసేకరణపై కలెక్టర్ సమీక్షించారు. ప్రభుత్వ భూముల సర్వే పూర్తయినందున ప్రైవేట్ భూముల సర్వేను అదనపు సర్వేయర్లను నియమించి వేగవంతం చేయాలని, పది రోజుల్లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే అమర్‌రాజా పరిశ్రమకు రహదారి నిర్మాణానికి అవసరమైన భూసేకరణను కూడా త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.కురుమూర్తి దేవాలయ అభివృద్ధి పనులకు అవసరమైన భూముల సర్వే పూర్తయినందున భూసేకరణకు సంబంధించిన ప్రతిపాదనలు, నివేదికలను త్వరగా సిద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు. పట్టా భూములపై ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేసిన నేపథ్యంలో భూ యజమానుల అభ్యంతరాలు, వినతులను పరిశీలించాలని ఆదేశించారు. ప్రస్తుత ధరల ప్రకారం భూముల విలువను పరిగణనలోకి తీసుకుని పరిహారం ఖచ్చితంగా లెక్కించాలని, ప్రభుత్వ, పట్టా భూముల వివరాలను వేర్వేరుగా సిద్ధం చేయాలని సూచించారు.సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణలో సర్వే, ఎస్‌డీఆర్ సమర్పణ, పరిహారం చెల్లింపుల పురోగతిని కలెక్టర్ సమీక్షించారు. లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టుకు సంబంధించిన సర్వే, ఎస్‌డీఆర్ ప్రక్రియ పూర్తయిన భూములకు పరిహారం చెల్లింపు దస్త్రాలను వెంటనే సిద్ధం చేసి సమర్పించాలని ఆదేశించారు.అజిలాపూర్ ఎత్తిపోతల ప్రాజెక్టు భూసేకరణకు సంబంధించి రోజువారీ పురోగతిని నమోదు చేసి పర్యవేక్షించాలని, వెంటనే పరిహారం చెల్లింపులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.జిల్లాలో నిర్మిస్తున్న వివిధ ప్రాజెక్టుల కింద నిర్వాసితులకు అందించాల్సిన పునరావాసం, పునరావాస పరిహారం కార్యక్రమాల పురోగతిని కూడా కలెక్టర్ సమీక్షించారు. అర్హులైన నిర్వాసితులకు పరిహారం చెల్లింపుల్లో ప్రస్తుతం పెండింగ్ లేదని అధికారులు తెలిపారు. భవిష్యత్ అవసరాలకు సరిపడా నిధులను ముందుగానే అంచనా వేసి, మిగులు నిధుల వివరాలను ప్రాజెక్టుల వారీగా సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అవార్డులు, నిర్మాణాల పరిహారం, నిర్వాసితుల చెల్లింపులను నిర్ణీత గడువులో పూర్తి చేసి, నిధుల అవసరం, ఇప్పటికే చేసిన చెల్లింపులు, మిగిలిన మొత్తాలను స్పష్టంగా చూపించే నివేదికలను సమర్పించాలని ఆదేశించారు.భూసేకరణ ప్రక్రియలో ఏ దశలోనూ జాప్యం జరగకుండా సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ, శాఖల మధ్య సమన్వయంతో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ ఖుష్బూ గుప్తా స్పష్టం చేశారు.ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. ఎల్. బి హరిప్రియ, అసిస్టెంట్ కలెక్టర్ అండర్ ట్రైని సాయి శివాని, భూసేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ రామ్ రెడ్డి, ఆర్డీఓ నవీన్, నీటిపారుదల శాఖ అధికారులు, తాసిల్దారులు, తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు, చిన్నారుల భద్రతకు మరింత పటిష్ట చర్యలు


### జిల్లా మహిళా భద్రతా విభాగం ఏర్పాటు: ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్



కొత్తగూడెం బ్యూరో, సెప్టెంబర్ 04(విజన్ ఆంధ్ర)మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలను అరికట్టడంతో పాటు బాధితులకు తక్షణ సహాయం అందించేందుకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జిల్లా మహిళా భద్రతా విభాగాన్ని నూతనంగా ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర మహిళా భద్రతా విభాగం ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన ఈ విభాగం ద్వారా మహిళలు, బాలికలు, చిన్నారులపై జరిగే నేరాల నివారణ, కేసుల దర్యాప్తు, పర్యవేక్షణ, అవగాహన కార్యక్రమాలు, కౌన్సెలింగ్, పునరావాసం తదితర సేవలను సమన్వయంతో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ జిల్లా మహిళా భద్రతా విభాగం సభ్యులతో సమావేశమై వారి విధులు, బాధ్యతలపై దిశానిర్దేశం చేశారు. మహిళలు, బాలికలు, చిన్నారుల భద్రతకు సంబంధించిన అంశాల్లో ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ బాధితులకు అండగా నిలవాలని సూచించారు.జిల్లాలో ఇప్పటికే పనిచేస్తున్న మహిళా భద్రతా బృందాలు, మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం, మహిళా పోలీస్ స్టేషన్, కౌన్సెలింగ్ కేంద్రాలతో సమన్వయం చేసుకుని మరింత సమర్థవంతమైన సేవలు అందించాలని ఆదేశించారు. నమోదైన కేసుల దర్యాప్తులో నాణ్యతను పెంచడంతో పాటు బాధితులకు అవసరమైన చట్టపరమైన సహాయం, కౌన్సెలింగ్, ఇతర సహాయ సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్బీ ఇన్‌స్పెక్టర్ ఇ. శ్రీనివాస్, ఎస్సై శ్రీనివాస్, ఏఎస్ఐ కస్తూరి, సిబ్బంది పాల్గొన్నారు.

## చిన్నారుల భవిష్యత్తుకు బాటలు..

## శివపూర్‌లో నూతన అంగన్వాడీ భవనం ప్రారంభం



కాగజ్ నగర్ సెప్టెంబర్ 3(విజన్ ఆంధ్ర): కొమరం భీం జిల్లా కాగజ్ నగర్ మండలంలోని బారెగూడ గ్రామ పంచాయతీ పరిధిలోని శివపూర్ గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ కేంద్ర ప్రభుత్వ నిధులతో రూ.12 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన నూతన అంగన్వాడీ భవనాన్ని గురువారం సిర్పూర్ ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్ బాబు ప్రారంభించారు. బారెగూడ సర్పంచ్ కోట వేణుగోపాల్‌తో కలిసి ఎమ్మెల్యే భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలోని చిన్నారులకు మెరుగైన వాతావరణంలో అంగన్వాడీ సేవలు అందించేందుకు నూతన భవనం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. భవన నిర్మాణ సమయంలో పలు అభ్యంతరాలు, ఆటంకాలు ఎదురైనప్పటికీ వాటిని అధిగమించి పనులను పూర్తి చేసినట్లు చెప్పారు. అభివృద్ధి పనుల విషయంలో ఎన్ని అడ్డంకులు ఎదురైనా ప్రజలకు అవసరమైన పనులను ముందుకు తీసుకెళ్లడమే తమ లక్ష్యమన్నారు. బారెగూడ గ్రామ పంచాయతీ పరిధిలోని బీటీ రోడ్డు రెన్యువల్ చేయడంతో పాటు శివపూర్ ప్రాథమిక పాఠశాలకు నూతన భవనం మంజూరు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్ బాబు మాట్లాడుతూ చిన్నారులు, గర్భిణీ మహిళలకు పౌష్టికాహారం అందించడంతో పాటు పోషకాహార లోపాన్ని నివారించేందుకు ప్రభుత్వం ఐసీడీఎస్ కార్యక్రమాన్ని అమలు చేస్తోందని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చిన్నారుల ఆరోగ్యం, విద్య, పోషణకు అంగన్వాడీ కేంద్రాలు ఎంతో కీలకమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అంగన్వాడీ కేంద్రాలకు మెరుగైన వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. నూతన భవనం అందుబాటులోకి రావడంతో శివపూర్ గ్రామంలోని చిన్నారులకు సౌకర్యవంతమైన వాతావరణం ఏర్పడిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ స్వరూప, సీడీపీఓ రెబెకా, సూపర్వైజర్లు స్పందన, చందన, పంచాయతీ కార్యదర్శి నరేష్, ఉప సర్పంచ్ వెంకటేష్, అంగన్వాడీ టీచర్లు, వైద్య సిబ్బంది, ఆయాలు, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## గడువులోగా అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

**–ప్రజలకు, విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి**
**–బస్ డిపో పనులు వేగవంతం చేయాలి**
**–టాస్క్ కేంద్రంలో సెప్టెంబర్ 8 నుంచి కొత్త బ్యాచ్‌లు**
**–జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**

పెద్దపల్లి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్–03(విజన్ ఆంధ్ర)జిల్లా కేంద్రంలో చేపడుతున్న అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు, విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. గురువారం పెద్దపల్లి పట్టణంలో విస్తృతంగా పర్యటించిన ఆయన బస్ డిపో నిర్మాణం, టాస్క్ కేంద్రం, ప్రభుత్వ జూనియర్ కళాశాల పునరుద్ధరణ పనులను పరిశీలించారు.బస్‌స్టాండ్ సమీపంలో కొనసాగుతున్న బస్ డిపో నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్.. పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. డిపో ప్రవేశ ద్వారాన్ని పక్కా ప్రణాళికతో ఏర్పాటు చేయాలని, బస్సులు, ఇతర వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రయాణికులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించాలని, నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు.అనంతరం టాస్క్ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్.. విద్యార్థులకు అందిస్తున్న శిక్షణ, కోర్సుల వివరాలను తెలుసుకున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ తదితర ఆధునిక సాంకేతిక అంశాల్లో శిక్షణ ఇస్తున్నట్లు అధికారులు వివరించారు. సెప్టెంబరు 8 నుంచి కొత్త బ్యాచ్‌లు ప్రారంభం కానున్నందున ఆసక్తి ఉన్న విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఆధునిక సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించుకుంటే మెరుగైన ఉద్యోగ అవకాశాలు పొందవచ్చన్నారు.టాస్క్ కేంద్రంలో శిక్షణ పొందిన పలువురు విద్యార్థులు ప్రముఖ సంస్థల్లో ఉద్యోగాలు సాధిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఫాక్స్‌కాన్‌లో ఉద్యోగాలు పొందిన కొందరు విద్యార్థులతో కలెక్టర్ వీడియో కాల్‌లో మాట్లాడి వారి ఉద్యోగ అనుభవాలను తెలుసుకున్నారు.ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న పునరుద్ధరణ పనులను కూడా కలెక్టర్ పరిశీలించారు. భవనం, తరగతి గదుల్లో జరుగుతున్న పనుల పురోగతిని తెలుసుకుని, త్వరితగతిన పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. విద్యార్థులకు అనుకూలమైన విద్యా వాతావరణం కల్పించేలా అవసరమైన మౌలిక వసతులు సమకూర్చాలని సూచించారు.అభివృద్ధి పనులను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, క్షేత్రస్థాయిలో పురోగతిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ గడువులోగా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ పర్యటనలో జిల్లా ఉపాధి అధికారి ఎం. రాజశేఖర్, టాస్క్ పెద్దపల్లి ప్రాంతీయ కేంద్రం ఇన్‌చార్జి కౌసల్య, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

# పేదల సొంతింటి కలకు కాంగ్రెస్ సర్కార్ శ్రీకారం.. 710 కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లులి!

## నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేసుకోవాలి

## రెండో విడతలో ప్రతి నియోజకవర్గానికి 2,000 ఇళ్లు.. నాలుగు దశల్లో రూ.5 లక్షల ఆర్థిక సాయం

రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 3 (విజన్ ఆంధ్ర బ్యూరో):అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి, పేదల సొంతింటి కలను సాకారం చేస్తామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను లబ్ధిదారులు వేగంగా పూర్తి చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.మొదటి విడతలో మంజూరైన ఇళ్లను నిర్ణీత సమయంలో నిర్మించుకున్న వారి స్థానంలో నూతనంగా 710 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ధ్రువపత్రాల పంపిణీ కార్యక్రమాన్ని తెలంగాణ గృహ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో గురువారం సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని సాయి మణికంఠ ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. కార్యక్రమానికి ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ముఖ్య అతిథులుగా హాజరై లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు.సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీలతో పాటు ఆయా మండలాలకు చెందిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే, కలెక్టర్, అధికారులు కలిసి మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఆయా మండలాల వారీగా ప్రత్యేక స్టాళ్లు ఏర్పాటు చేయగా, పంపిణీ ప్రక్రియను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పరిశీలించారు.పేదల సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యంగా ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు



మంజూరు చేస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో పేదల సొంతింటి కల సాకారం కావడంతో పాటు గ్రామాలు, మున్సిపాలిటీల్లో కూలీలకు ఉపాధి, వివిధ వృత్తుల వారికి పని, వ్యాపారులకు లావాదేవీలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు.జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు సరిసమానంగా అమలవుతున్నాయని అన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, వ్యవసాయానికి ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం వంటి పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నామని వివరించారు.రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేశామని, నూతన రేషన్ కార్డులు జారీ చేస్తున్నామని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని, నూతన పెన్షన్ల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నామని చెప్పారు. అన్ని వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. జిల్లాలోని ధార్మిక, కార్మిక క్షేత్రాల అభివృద్ధికి పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని వెల్లడించారు.ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు పొందిన లబ్ధిదారులు నిర్మాణ పనులను ఆలస్యం చేయకుండా త్వరగా పూర్తి చేసుకోవాలని ఆది శ్రీనివాస్ సూచించారు.ప్రభుత్వ సాయంతో ఇళ్లు పూర్తి చేసుకోవాలిజిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. సొంత ఇల్లు నిర్మించుకోవడం ప్రతి ఒక్కరి కల అని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు పొందిన లబ్ధిదారులు ప్రభుత్వం నిర్ణయించిన విస్తీర్ణంలో త్వరగా ముగ్గు పోసుకుని నిర్మాణ పనులు ప్రారంభించాలని సూచించారు.ప్రతి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మోడల్ హౌస్‌లను లబ్ధిదారులు తప్పనిసరిగా సందర్శించాలని, ప్రభుత్వం అందించే రూ.5 లక్షల ఆర్థిక సహాయంతో ఇళ్లను పూర్తి చేసుకోవాలని సూచించారు.ండో విడతలో ప్రతి నియోజకవర్గానికి 2,000 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన ఆర్థిక సహాయం నాలుగు దశల్లో లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుందని వెల్లడించారు. పంచాయతీ కార్యదర్శులు, హౌసింగ్ అధికారులు లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి నిర్మాణ దశలకు సంబంధించిన ఫొటోలను తీసుకుంటారని తెలిపారు.లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసి, గృహప్రవేశాలు నిర్వహించుకుని ఆనందంగా జీవించాలని కలెక్టర్ ఆకాంక్షించారు.కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ చైర్మన్లు జిందం కళ, పుల్కం రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్లు తిరుపతి, ఎల్లయ్య, రాజు, స్వరూప, సబేరా బేగం, రాణి, రాములు నాయక్, విజయ, హౌసింగ్ పీడీ వెంకట మాధవరావు, సిరిసిల్ల ఆర్డీఓ శ్రీధర్ బాబు, తహసీల్దార్ మహేష్, కౌన్సిలర్లు, సర్పంచులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పచ్చదనమే భావి తరాల భద్రతకు పునాది

## పర్యావరణ పరిరక్షణకు 20 ఏళ్ల ప్రణాళికతో ముందుకు సాగాలి

## తాటి చెట్లు, మడ అడవులతో తీర ప్రాంతాల రక్షణ

## పర్యావరణ పరిరక్షణను ప్రజా ఉద్యమంగా మార్చాలి


సూర్యలంక బీచ్ లో విద్యార్థులతో కలిసి తాటి మొక్కలు నాటిన అనంతరం మీడియాతో మాట్లాడిన ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్ నాగబాబు వాతావరణ సమతుల్యతను పరిరక్షించడంతో పాటు జీవవైవిధ్యం, జీవరాశుల మనుగడను కాపాడుకోవడానికి విస్తృత స్థాయిలో పచ్చదనాన్ని పెంపొందించడం అత్యంత అవసరమని ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్ నాగబాబు పేర్కొన్నారు. మొక్కలు నాటడం కేవలం ఒక కార్యక్రమంగా కాకుండా, భావి తరాల భవిష్యత్తును కాపాడే సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ భావించాలని అన్నారు. పర్యావరణ పరిరక్షణ అనేది ఒకటి లేదా రెండు సంవత్సరాల్లో పూర్తయ్యే కార్యక్రమం కాదని, రాబోయే తరాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని దీర్ఘకాలిక ప్రణాళికతో, నిరంతర కృషితో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. గురువారం బాపట్ల జిల్లా సూర్యలంకలో పర్యటించారు. సముద్ర తీరం వెంబడి విద్యార్థులతో కలిసి తాటి చెట్లను నాటారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ "గ్రేట్ గ్రీన్ వాల్ వంటి కార్యక్రమాల ద్వారా పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. పర్యావరణం గురించి పుస్తకాల్లో చదవడం, కాగితాలపై అవగాహన పొందడం కంటే పిల్లలు, పెద్దలు స్వయంగా మొక్కలు నాటి, వాటి సంరక్షణలో భాగస్వాములు కావడం ద్వారా ప్రకృతితో మరింత గాఢమైన అనుబంధం ఏర్పడుతుంది. ముఖ్యంగా విద్యార్థులు, యువతతో పాటు సమాజంలోని ప్రతి వర్గాన్ని పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాల్లో భాగస్వాములను చేస్తాం. మొక్క నాటడంతోనే బాధ్యత పూర్తి కాదని, అది ఆరోగ్యంగా ఎదిగి పెద్ద చెట్టుగా మారే వరకు సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత. మొక్కల పెంపకాన్ని కేవలం ఒక కార్యక్రమంగా కాకుండా, భావితరాలకు పచ్చని, సురక్షితమైన భవిష్యత్తును అందించే సామాజిక బాధ్యతగా భావించాలి. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ప్రణాళికలు సిద్ధం చేయాలి పర్యావరణ పరిరక్షణ కోసం రూపొందించే ప్రణాళికలు కనీసం 20 సంవత్సరాలను దృష్టిలో పెట్టుకొని చేయాలి. ఏ ప్రాంతాల్లో ఎలాంటి మొక్కలు, చెట్లు పెంచాలి, భవిష్యత్తులో అక్కడి పర్యావరణ అవసరాలు ఎలా ఉంటాయి అనే అంశాలను అధ్యయనం చేసి ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలి.

# ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ అభివృద్ధి చెందాలి కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం మణికంఠ సర్వీస్ ఫిల్లింగ్ స్టేషన్ ప్రారంభం




వరంగల్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 03(విజన్ ఆంధ్ర);–నూతనంగా ప్రారంభమైన మణికంఠ సర్వీస్ ఫిల్లింగ్ స్టేషన్ సంస్థ ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ అభివృద్ధి చెందాలని కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం ఆకాంక్షించారు.వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలోని డి.సి. తండాలో తుమ్మల యాకయ్యకు చెందిన మణికంఠ సర్వీస్ ఫిల్లింగ్ స్టేషన్ (హిందూస్తాన్ పెట్రోలియం) ప్రారంభోత్సవ కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఫిల్లింగ్ స్టేషన్ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కరిమిల సంపత్ రావు, జూలూరి శ్రీనివాస్, గుమ్మడి హరిబాబు, బక్కతట్ల రాజు, నందిపాక భాస్కర్, రాజుతో పాటు వర్ధన్నపేట పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు, స్థానికులు పాల్గొన్నారు.

# మాజీ మంత్రి హరీష్ రావుకు వినతి పత్రం అందజేసిన ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు




కౌడిపల్లి, ఆగస్టు 3 (విజన్ ఆంధ్ర): మండల కేంద్రంలో గురువారం రోజున కాంగ్రెస్ వెయ్యి రోజుల దగా సమరభేరీకి వచ్చిన మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు కి జిల్లా ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయుల బృందం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. జీతాల పెంపుదల సిఆర్టియు లుగా గుర్తించడం తదితర అంశాలపై ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయుల సమస్యల గూర్చి అసెంబ్లీలో చర్చించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనకు కుత్బుల్లాపూర్‌లో హర్షం

## ఐడిపిఎల్ డీ-మార్ట్ నుంచి గాంధీనగర్ వరకు ఘనంగా బైక్ ర్యాలీ

## సంక్షేమ, అభివృద్ధి పథకాలపై కాంగ్రెస్ శ్రేణుల హర్షం

జగద్గిరిగుట్ట సెప్టెంబర్ 3 (విజన్ ఆంధ్ర): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలనకు వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ ర్యాలీలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఐడిపిఎల్ డీ-మార్ట్ నుంచి గాంధీనగర్ వరకు నిర్వహించిన బైక్ ర్యాలీలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలను హన్మంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పార్టీ జెండాలు చేతబూని పెద్ద సంఖ్యలో బైక్‌లపై తరలివచ్చిన కాంగ్రెస్ శ్రేణులతో ర్యాలీ ఉత్సాహభరితంగా




సాగింది. ఈ సందర్భంగా కొలను హన్మంత్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి సాధిస్తుందని పేర్కొన్నారు. ఒకవైపు కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ నాయకులు విమర్శలు చేస్తుండగా.. మరోవైపు కుత్బుల్లాపూర్‌లో కాంగ్రెస్ శ్రేణులు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు మద్దతుగా బైక్ ర్యాలీ నిర్వహించి హర్షం వ్యక్తం చేయడం రాజకీయంగా ఆసక్తికరంగా మారింది. ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు, ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యంగా ర్యాలీ నిర్వహించినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి వైస్ ప్రెసిడెంట్ బి. శివకుమార్, 283వ డివిజన్ అధ్యక్షుడు కనకరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ జైరామ్, 281వ డివిజన్ అధ్యక్షుడు జలీల్ ఖాన్, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ గౌడ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అనిమిరెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ తైలం శ్రీనివాస్, డివిజన్ వైస్ ప్రెసిడెంట్ కార్యం ప్రకాష్, మైనారిటీ అధ్యక్షుడు అజర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మురళీ, భాస్కర్, వెంకటేష్, మహిళా అధ్యక్షురాలు మాధవిరాణి, చిన్నమ్మ, నీల గుప్త, లక్ష్మీరెడ్డి, లక్ష్మీ, భాగ్య తదితరులు పాల్గొన్నారు.

# సౌత్ జోన్ నేషనల్స్ కు ఎంపికైన కార్మెల్ పాఠశాల విద్యార్థులు



మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 03,(విజన్ ఆంధ్ర) గత నెల 26 27న హనుమకొండలో జరిగిన సౌత్ జోన్ అథ్లెటిక్స్ మీట్ లో మంచిర్యాల పట్టణంలోని కార్మెన్ పాఠశాల విద్యార్థిని శ్రీనిధి ట్రయథ్లాన్ సి విభాగంలో మొదటి రెండు స్థానాల్లో ప్రతిభ కనబరిచి, ఈనెల 16 నుండి 18 తేదీల్లో పాండిచ్చేరిలో జరిగే సౌత్ జోన్ నేషనల్స్ కు ఎంపికయ్యారని పాఠశాల ప్రిన్సిపల్ సిస్టర్ సారూప్య తెలిపారు. అదేవిధంగా పాఠశాల పూర్వ విద్యార్థిని బోనాల శృతి 400 మీటర్స్ విభాగాల్లో మన రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించబోతున్నారన్నారు. ఈ నెలలో జరగబోయే సౌత్ జోన్ నేషనల్స్ లో మరింత ప్రతిభ కనబరిచి పాఠశాలకు రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. పాఠశాల విద్యార్థులు సాధించిన ఘనవిజయాలకు పాఠశాల ప్రిన్సిపల్ సిస్టర్ సారూప్య, వైస్ ప్రిన్సిపల్ సిస్టర్ సీమా క్లర్క్ సిస్టర్ సోఫీ కోచ్ అనిల్ కుమార్ పి ఈ టి లు చిరంజీవి, శ్రీలత, అనుదీప్, పద్మ, పాఠశాల సిబ్బంది విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.

# ఎంపీపీ ఎస్ పర్వతగిరి పాఠశాలలో ముందస్తు శ్రీ కృష్ణాష్టమి వేడుకలు



వరంగల్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 03(విజన్ ఆంధ్ర);–వరంగల్ జిల్లా కేంద్రంలోని పర్వతగిరి మండలంలోని ఎంపీపీ ఎస్ పర్వతగిరి పాఠశాలలో ముందస్తు శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాశాఖ అధికారి ఏ. బిక్షపతి పాల్గొన్నారు అనంతరం మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు పాఠశాలలో నిర్వహించడం వలన విద్యార్థులలో సృజనాత్మకత, నైతిక విలువలు పెరుగుతాయని ధర్మం, న్యాయం అలవడుతాయని చెప్పడం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులకు క్విజ్ కార్యక్రమం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థినీ విద్యార్థులకు బహుమతులు, అరటి పండ్లు పంపిణీ చేయడం జరిగింది. పాఠశాలలో ఉట్టి కొట్టే కార్యక్రమం ఘనంగా నిర్వహించుకోవడం జరిగింది.ఈ కార్యక్రమానికి స్కూల్ కాంప్లెక్స్ హెడ్మాస్టర్ కె నవీన్ కుమార్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏ వెంకటరమణారెడ్డి, ఏఏపిసి చైర్ పర్సన్ నీరటి జ్యోతి,స్టాఫ్ సెక్రెటరీ రామస్వామి, ఉపాధ్యాయులు లలితాదేవి, సుభాషిని, నవీన్ కుమార్, ప్రసాద్, కిషన్ మరియు ఆఫీస్ సబార్డినేట్ వంశీ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు

# గల్ఫ్ వలస కార్మికుడి కుటుంబానికి రూ.19,01,968 బీమా చెక్కును అందించిన కలెక్టర్ ఖుష్బూ గుప్తాలి

మహబూబ్ నగర్ ప్రతినిధి ఆగస్ట్ 3(విజన్ ఆంధ్ర)గల్ఫ్‌లో పనిచేస్తూ స్వదేశానికి వచ్చి తిరిగి వెళ్తున్న సమయంలో గుండెపోటుతో మృతి చెందిన గల్ఫ్ వలస కార్మికుడు ముసిరిప్ప మాసప్ప కుటుంబానికి రూ.19,01,968 బీమా సొమ్ముకు సంబంధించిన చెక్కును జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా గురువారం కలెక్టర్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో అందజేశారు.గండీడ్ మండలం వెన్నచేడ్ గ్రామానికి చెందిన ముసిరిప్ప మాసప్ప గత 15 సంవత్సరాలుగా గల్ఫ్ దేశంలో వలస కార్మికుడిగా పనిచేస్తున్నారు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం, 22.05.2025న స్వగ్రామానికి వచ్చి తిరిగి గల్ఫ్‌కు వెళ్తున్న సమయంలో విమానం ఎక్కే క్రమంలో గుండెపోటుతో మృతి చెందారు.గల్ఫ్‌లో పనిచేస్తున్న సమయంలో మాసప్ప పనిచేస్తున్న కంపెనీతో కుదుర్చుకున్న బీమా ఒప్పందం మేరకు ఆయనకు సంబంధించిన రూ.19,01,968 బీమా మొత్తం మంజూరైంది.ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా గురువారం మాసప్ప



భార్య ముసిరిప్ప వెంకటమ్మకు అందజేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విదేశాల్లో పనిచేస్తున్న వలస కార్మికుల కుటుంబాలకు బీమా పథకాలు ఆపద సమయంలో ఆర్థిక భరోసా కల్పిస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డి.ఆర్.ఓ ఎ.నిర్మల, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జితేందర్ రెడ్డి, పి.ఎ.సి.ఎస్ డైరెక్టర్లు ప్రభాకర్ రెడ్డి, బసప్ప తదితరులు పాల్గొన్నారు.

# మీడియా సమావేశంలో కొండా సురేఖప్రజలకే మేం జవాబుదారీ

హైదరాబాద్అధిష్టానం ఏకపక్షంగా నిర్ణయం తీసుకుంది. ఒక్కమాట నాకు చెప్పలేదు.. నేరుగా భర్తరఫ్ చేసారని కొండా సురేఖ అన్నారు. గురువారం నాడు ఆమె మీడియాతో మాట్లాడారు.ఉరిశిక్ష అమలు చేసే సమయంలో కూడా ఉరివేస్తున్నాం..అని చెప్తారు.. చివరికోరిక ఏమైనా ఉందా అని అడుగుతారు. కానీ కావాలని కక్ష కట్టి కుట్ర చేసి తిరుపతి రెడ్డి... తదితరులు..నన్ను తీసేయించారని అన్నారు. సుమంత్ విషయంలో కూడా అంతా కుట్ర చేసారు..సుమంత్ పేరు చెప్పి నేరాలు సెటిల్మెంట్లు చేసి కావాలని బద్నాం చేశారు. సుమంత్ కేసును సీసీఎస్ కు బదిలీ చేసి టార్గెట్ చేసి మరీ వేధిస్తున్నారు. నేను మంత్రిగా ఉండగా మా ప్రభుత్వంలో ఇంత జరుగుతోంది. ఎవరైతే నన్ను బర్తరఫ్ చేయించిన వారిలో మల్లు రవి ఉన్నాడు.. ఆయన తిట్టలేదా పార్టీని. మాజీ సీఎం రోశయ్య ఏకంగా విధవ రాజ్యం ఏలుతోందని ఇందిరాగాంధీని తిట్టాడని అన్నారు.యాబై కోట్లు ఇచ్చి పీసీసీ అధ్యక్ష పదవి కొన్నాడు అని తిట్టిపోసిన వాళ్ళని ఎందుకు వదిలేశారు. ప్రజలనుండి రాజకీయాల్లో పైకి వచ్చాం... ప్రజలకే మేం జవాబుదారీ. కడియం శ్రీహరి కూడా నాగురించి మాట్లాడుతున్నాడు.నా కూతురు అంటే నన్ను తీసేస్తారా..? నాకు చెప్పాపెట్టకుండా నన్ను తీసేస్తారా..? నాకు జరిగిందే మీకు జరుగుతుంది..! ఇబ్బంది పడుతున్న నేతలారా.. బయటకు రండి.. గళం విప్పండని అన్నారు.ప్రభుత్వంలో జరుగుతున్న వ్యవహారాలపై నోరు విప్పండి. లేదంటే నష్టం తప్పదు.. నా పదవి తీసేయడం వేరు.. నాకు ముందే చెప్పాల్సింది. బీసీ రిజర్వేషన్లు మేము చేశాం అంటున్న సీఎం రేవంత్ ఒక బీసీ మహిళ మంత్రి పదవి ఎలా తీసేసారో చెప్పాలి. ప్రభుత్వం సర్దుకోవాలి.. మార్చుకోవాలి.. మున్సిపల్ కార్పొరేషన్స్ ఎన్నికలు రాబోతున్నాయి.మోనోపోలీ వ్యవహారం తప్పు..నేను పదేళ్లు సీఎం అని ఆయనకు ఆయన చెప్పుకోవడం తప్పు.ఎమ్మెల్యే అభ్యర్థులను ప్రకటించడం తప్పని అన్నారు. మీడియా సమావేశంలో ఆమె లేఖ విడుదల చేసారు. .అందులో అన్ని అంశాలు పేర్కొన్నట్లుగా చెప్పారు.

# అమెరికా, కెనడాల నుంచి లండన్‌కు 86 టన్నుల బంగారాన్ని తరలింపు

ముంబై, సెప్టెంబర్ 3ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు, ఆర్థిక అనిశ్చితి నేపథ్యంలో నెదర్లాండ్స్ ప్రభుత్వం అత్యంత కీలక నిర్ణయాన్ని అమలు చేసింది. అమెరికా, కెనడా దేశాల్లో నిల్వ ఉంచిన తమ 86 టన్నుల పసిడి నిల్వలను బ్రిటన్ రాజధాని లండన్‌లోని 'బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్' వాల్ట్‌కు విజయవంతంగా తరలించినట్లు డచ్ సెంట్రల్ బ్యాంక్ అధికారికంగా ధ్రువీకరించింది. సంక్షోభ సమయంలో ఈ పసిడిని అత్యంత వేగంగా ట్రేడింగ్ చేయడానికి, నగదు రూపంలోకి మార్చుకోవడానికి వీలుగానే ఈ క్లిష్టమైన ఆపరేషన్‌ను పూర్తి చేసినట్లు బ్యాంక్ గవర్నర్ ఒలాఫ్ స్లీపెన్ వెల్లడించారు.ఈ భారీ తరలింపు ప్రక్రియను ఈ ఏడాది మార్చి నుంచి ఆగస్టు మధ్య కాలంలో రెండు విభిన్న పద్ధతుల్లో అత్యంత జాగ్రత్తగా నిర్వహించారు. మొదటగా అమెరికా, కెనడాలలోని బ్యాంకుల నుంచి సుమారు 27 టన్నుల భౌతిక (ఫిజికల్) బంగారాన్ని నెదర్లాండ్స్‌లోని జైస్ట్ (జివతిబబి) ప్రాంతానికి తీసుకొచ్చి, అక్కడి నుంచి లండన్‌లోని బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్‌కు భద్రంగా చేర్చారు. ఇక మిగిలిన పసిడికి సంబంధించి రవాణా ప్రమాదాలను తగ్గించేందుకు, న్యూయార్క్‌లో ఉన్న గోల్డ్ బార్‌లను అక్కడే విక్రయించి, సమాన పరిమాణంలోని అంతర్జాతీయ ప్రామాణిక బంగారాన్ని తిరిగి లండన్ మార్కెట్‌లో కొనుగోలు చేశారు. ఈ విధానం వల్ల బంగారాన్ని కరిగించాల్సిన అవసరం లేకుండానే, సమర్థవంతంగా లండన్‌కు తరలించడం సాధ్యమైంది.ప్రస్తుతం అమెరికా–కెనడా మధ్య నడుస్తున్న వాణిజ్య పోరు,


# ఆనంద్ సాయి కొడుకు కేసులో బిగ్ ట్విస్ట్ బెయిల్ వచ్చాక గంజాయి వీడియో కలకలం!

హైదరాబాద్, సెప్టెంబర్ 3ప్రముఖ సినీ ఆర్ట్ డైరెక్టర్ ఆనంద్ సాయి కుమారుడు సందీప్ హిట్ అండ్ రన్ కేసు అనూహ్య మలుపు తిరిగింది. ఒకరి మృతికి కారణమైన ఈ కేసులో నిందితుడిగా ఉన్న సందీప్‌కు బెయిల్ లభించిన కొన్ని గంటల్లోనే, అతడు గంజాయి తాగుతున్నట్టుగా ఉన్న ఒక వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడం సంచలనం సృష్టిస్తోంది. ఈ కొత్త పరిణామంతో పోలీసులు దర్యాప్తును మరో కోణంలో వేగవంతం చేశారు.ఈ నెల 1న రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వేగంగా కారు నడిపి ఒకరి మరణానికి సందీప్ కారణమయ్యాడని పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రమాదం జరిగిన తర్వాత కారు ఆపకుండా వెళ్లిపోవడంతో (హిట్ అండ్ రన్) అతడిపై పలు సెక్షన్లతో పాటు మోటార్ వెహికల్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. అయితే, ప్రమాద సమయంలో సందీప్ మద్యం తాగలేదని, యూరిన్ డ్రగ్స్ స్క్రీనింగ్‌లో కూడా నెగటివ్ అని తేలడంతో ప్రాథమికంగా ఊరట లభించింది.ఈ క్రమంలోనే మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో పోలీసులు సందీప్‌ను న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా, అతడికి బెయిల్ మంజూరైంది.

# నస్పూర్, తాండూరు తహసీల్దార్ కార్యాలయాల తనిఖీ

**- ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలి**

**- జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు**



మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 03,(విజన్ ఆంధ్ర ) : జిల్లాలో చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. గురువారం జిల్లాలోని తాండూర్, నస్పూర్ మండల తహసిల్దార్ కార్యాలయాలను సందర్శించి వివిధ రెవెన్యూ అంశాలపై సమీక్ష నిర్వహించారు. తాండూర్ తహసీల్దార్ కార్యాలయంలో రాబోయే ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టుకు సంబంధించిన పురోగతి పనులు, రెవెన్యూ అంశాలపై సమీక్ష నిర్వహించి సంబంధిత అధికారులు చేపడుతున్న పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పనులను నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేయాలని సూచించారు.అనంతరం నస్పూర్ తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ఎస్ఐఆర్ పనుల పురోగతి, 22–ఎా భూములకు సంబంధించిన పనులను సమీక్షించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను నిబంధనల ప్రకారం వేగవంతంగా పూర్తి చేయాలని, 22–ఎాకు సంబంధించిన అంశాలను పరిశీలించి పెండింగ్ పనులను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.మంచిర్యాల రాజస్వ మండల అధికారి నూతన కార్యాలయ నిర్మాణానికి ప్రతిపాదించిన స్థలాన్ని పరిశీలించి కార్యాలయ నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో నాణ్యమైన విద్యాబోధన అందించాలి

**- జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్**



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 3,(విజన్ ఆంధ్ర) : ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో నాణ్యమైన విద్యాబోధన అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ అన్నారు. గురువారం జిల్లాలోని ఆసిఫాబాద్ మండలం బూరుగూడ గ్రామంలో గల ప్రభుత్వ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించి పాఠశాలలోని తరగతి గదులు, విద్యార్థుల హాజరు పట్టికలు, విద్యాబోధన తీరు, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠ్యాంశాలను సులభంగా, అర్థమయ్యే రీతిలో బోధించాలని సూచించారు. ప్రతి విద్యార్థి విద్యా ప్రగతిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి అవసరమైన అదనపు బోధన అందిస్తూ వారి అభ్యసన సామర్థ్యాన్ని మెరుగుపరచాలని తెలిపారు. పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం పౌష్టికాహారం, నాణ్యమైన భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం, పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, పాఠశాల పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు వారి సమగ్ర అభివృద్ధికి అవసరమైన వాతావరణాన్ని పాఠశాలలో కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా వాసవి వారోత్సవాలు...

**- ఉపాధ్యాయులు, జర్నలిస్టులు, కేసీజీఫ్ దాతలకు ఘన సత్కారం**

మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 03,(విజన్ ఆంధ్ర ) : నిరుపేదలను గుర్తించి వారికి అవసరమైన వివిధ రకాల సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న మంచిర్యాల వాసవి క్లబ్, వాసవి వనిత క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో వాసవి వారోత్సవాలను బుధవారం రాత్రి వైశ్య భవన్‌లో ఘనంగా నిర్వహించారు. వాసవి క్లబ్ అంతర్జాతీయ సంస్థ పిలుపుమేరకు సెప్టెంబర్ 1 నుంచి 7వ తేదీ వరకు వివిధ సేవా కార్యక్రమాలను వారోత్సవాల పేరిట నిర్వహిస్తున్నారు. వారోత్సవాల్లో భాగంగా వాసవి క్లబ్ అంతర్జాతీయ సంస్థ నిర్వహిస్తున్న సరస్వతి పథకానికి సహకరిస్తున్న సిల్వర్ స్టార్, గోల్డెన్ స్టార్, క్రౌన్ స్టార్ దాతలను గుర్తించి ఘనంగా సత్కరించారు. అదేవిధంగా విద్యారంగంలో విశేష సేవలు అందిస్తున్న పలువురు ఉపాధ్యాయులను సన్మానించారు. ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా నిలుస్తూ సమాజంలో కీలక పాత్ర పోషిస్తున్న పాత్రికేయులను కూడా ఘనంగా సత్కరించారు. వాసవి క్లబ్‌ల ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు అండగా నిలిచి సహకరిస్తున్న గురువులను గుర్తించి సన్మానించారు.ఈ సందర్భంగా వాసవి క్లబ్ అంతర్జాతీయ ఉపాధ్యక్షులు సిరిపురం రాజేష్, ముక్తా శ్రీనివాస్, కటకం హరీష్, జిల్లా గవర్నర్ పుల్లూరి బాల మోహన్ మాట్లాడుతూ వాసవి క్లబ్ ఆధ్వర్యంలో అనేక రకాల సేవా కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపడుతున్నట్లు తెలిపారు. సరస్వతి పథకం ద్వారా పలువురు నిరుపేద విద్యార్థులకు నోట్ పుస్తకాలు, స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. సమాజంలోని పేదలు, విద్యార్థులకు అండగా నిలవడమే వాసవి క్లబ్‌ల ప్రధాన లక్ష్యమని తెలిపారు.ఈ కార్యక్రమంలో మంచిర్యాల వాసవి క్లబ్ అధ్యక్షుడు వెనిశెట్టి రాఘవేంద్ర, కార్యదర్శి గుండా మనోహర్, కోశాధికారి బండ శ్రీనివాస్, వనిత క్లబ్ అధ్యక్షురాలు ముక్త యామిని, కోశాధికారి వెలిశెట్టి దివ్య, క్యాబినెట్ సెక్రెటరీ సేవా కేశెట్టి వంశీకృష్ణ, కోశాధికారి కుంకుమొట్టి వెంకటేశ్వర్లు, పీఆర్వో ఉత్తూరి రమేష్, రీజియన్ చైర్‌పర్సన్ సిద్ధంశెట్టి మధుశ్రీ, జోన్ చైర్‌పర్సన్ ఇరుకుల్ల సూర్యనారాయణ, కాచం మల్లికార్జున్, అంతర్జాతీయ ప్రోగ్రాం కోఆర్డినేటర్ అక్కినపల్లి రవీందర్, జిల్లా అధికారులు ఇరుకుల్ల శ్రీనివాస్, కాసం సతీష్, కొత్త సురేందర్, నాలుమాసు లావణ్య, దైద సరిత, మల్యాల సంగీత తదితరులు పాల్గొన్నారు.

# 1000 రోజుల పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

**- ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి**



మల్కాజిగిరి, సెప్టెంబర్ 3,(విజన్ ఆంధ్ర): 1000 రోజుల పరిపాలనలో కాంగ్రెస్ ప్రభు త్వం పూర్తిగా విఫలమైందని మల్కాజిగిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. గురువారం మల్లికార్జున నగర్ ఫ్రెండ్స్ అసోసియేషన్ గ్రౌండ్ లో గౌతమ్ నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మేకల సునీత రాముయా దవ్ ఆధ్వర్యంలో, 22 ఏ నిషేధిత జాబితాలో ఉన్న నివాసితులు, జయగిరి లక్ష్మీనరసింహస్వామి నగర్ కాలనీలో ఉన్న ఎండో మెం ట్ భూముల నివాసితులు, మల్లి కార్జున్ నగర్ యుఎల్ సీ లో ఉన్న నివాసితులతో అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హజరైన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, మల్లికార్జున నగర్ లో నివాసముంటున్న యు ఎల్ సి సమస్య పరిష్కారానికి 118 జీవో ద్వారా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపా రు. అలాగే జయగిరి లక్ష్మీ నరసింహ స్వామినగర్ ఆలయ భూములలో నివాసముంటున్న వారికి ఈ సమస్య నుంచి త్వర లోనే విముక్తి లభిస్తుందని ప్రకటించారు. గౌతమ్ నగర్ లెవెల్ క్రాసింగ్ వద్ద త్వరలో ఆర్ యూబి నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధమైనా యని, త్వరలోనే ఈ పనులు కూడా ప్రారంభం అవుతాయని ఆయన చెప్పారు. అలాగే మల్కాజిగిరి నియోజక వర్గంలో ఉన్న 22 ఏ నిషేధిత జాబితాను తొలగించడానికి ఉన్నతా ధికారులతో తాను మాట్లా డటం జరిగిందన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ ను కలిసి వినతి పత్రం సైతం సమర్పిం చానని ఎమ్మెల్యే చెప్పారు.

# వినాయక చవితి ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి

**- కలెక్టర్ సి నారాయణ రెడ్డి**



రంగారెడ్డి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 3, ( విజన్ ఆంధ్ర ) : వినాయక చవితి ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి కోరారు.వినాయక చవితి పండుగను పురస్కరించుకుని జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా శాంతియుతంగా, సురక్షితంగా ఉత్సవాలు నిర్వహించేలా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని ఆయన అధికారులకు సూచించారు.గురువారం నాడు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో గణేష్ చవితి ఉత్సవాల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్ డా. కె. కిరణ్మయితో కలిసి డీసీపీలు, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, పోలీస్ అధికారులు, గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 14న వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభమై 24న నిమజ్జనం జరగనున్న నేపథ్యంలో మండపాల నిర్వాహకులు భక్తిశ్రద్ధలతో పాటు భద్రతా ప్రమాణాలను పాటిస్తూ ఉత్సవాలను నిర్వహించాలని ఆయన కోరారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. గణేష్ శోభాయాత్ర మార్గాల్లో గుంతలు, దెబ్బతిన్న రహదారులకు ప్యాచ్‌వర్క్ చేపట్టాలని, నిమజ్జన ప్రదేశాల్లో క్రేన్లు, బారికేడింగ్, వేదికలు, మొబైల్ టాయిలెట్లు, తదితర ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని సూచించారు.గ్రామీణ ప్రాంతాల్లో ఆర్డీఓలు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, పోలీసు అధికారులు సమన్వయంతో ప్రతి ఉత్సవ కేంద్రాన్ని ముందుగానే పరిశీలించి అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. విద్యుత్ సరఫరా, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ వైర్లు, కనెక్షన్లు తదితర అంశాలను విద్యుత్ శాఖ నిపుణుల సహకారంతో తనిఖీ చేయాలని సూచించారు. ఉత్సవ మండపాలు, విగ్రహాల ఏర్పాటు ప్రదేశాలను సురక్షితంగా ఎంపిక చేసి, అవసరమైన అనుమతులు తప్పనిసరిగా పొందాలని, మండపాల నిర్మాణం పటిష్టంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రమాదాలకు అవకాశం ఉన్న ప్రదేశాలను ముందుగానే గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు.ఉత్సవాల సందర్భంగా నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైన ప్రాంతాల్లో అదనపు పోలీస్ బందోబస్తు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని అన్నారు. మండపాల వద్ద పరిశుభ్రత, ఫాగింగ్, పారిశుద్ధ్య చర్యలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, అవసరమైన చోట విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి వేలాడుతున్న విద్యుత్ తీగలను సరి చేయాలని సూచించారు.విగ్రహాల ఊరేగింపు సమయంలో వాహనాల్లో యాంత్రిక సమస్యలు తలెత్తకుండా ముందస్తు తనిఖీలు చేపట్టాలని, నిమజ్జన మార్గాల్లో వేలాడుతున్న విద్యుత్ తీగలు, వంగిన చెట్లు తదితర ప్రమాదకర అంశాలను తొలగించాలని తెలిపారు. చెరువుల వద్ద అవసరమైన సంఖ్యలో క్రేన్లు, బారికేడింగ్, వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి భక్తుల భద్రతకు పటిష్ట చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మున్సిపల్, పోలీస్, రెవెన్యూ, విద్యుత్, వైద్య, ఆర్అండ్‌బీ తదితర శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ సూచించారు.పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు, కంట్రోల్ రూమ్, వేగవంతమైన స్పందన వ్యవస్థను ఏర్పాటు చేసి, ఎక్కడైనా సమస్య తలెత్తిన వెంటనే స్పందించేలా అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పని చేసి గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా, భక్తిశ్రద్ధలతో, ఎలాంటి ప్రమాదాలు లేకుండా విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేయాలని ఆయన కోరారు.భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి శశిధర్ మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని, నిమజ్జన ప్రదేశాల్లో తగినన్ని క్రేన్లు, నిరంతర విద్యుత్ సరఫరా, భద్రతా ఏర్పాట్లు కల్పించాలని కలెక్టర్‌ను కోరారు.ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) డాక్టర్ కె.కిరణ్మయి, జిల్లా రెవెన్యూ అధికారి శారదాదేవి, మహేశ్వరం డీసీపీ నారాయణ రెడ్డి, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి స్టేట్ ఎగ్జిక్యూటివ్ రవీందర్ రెడ్డి, బాలాపూర్ గణేష్ ఉత్సవ సమితి చైర్మన్ కె.నిరంజన్, సెక్రెటరీ సాయికిరణ్ చారి, వైస్ ప్రెసిడెంట్ టి.ఆనంద్ గౌడ్, ఆర్డీఓలు శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్, మున్సిపల్ కమిషనర్లు, పోలీస్ అధికారులు, ఆర్అండ్‌బీ అధికారులు, గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రజకులకు రక్షణ చట్టం చేయాలి

**- ఫైళ్ళ ఆశయ్య ...తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం**

**- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి..**



అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 3. (విజన్ ఆంధ్ర) : రజక వృత్తిదారుల సంఘం జిల్లా జనరల్ బాడీ సమావేశం చంద్రగిరి తులసి దాస్ అధ్యక్షతన సత్యనారాయణ టెంపుల్ కొండపైన జరిగింది. అనంతరం సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబుకు వినతి పత్రం ఇచ్చిన రజక సంఘం నాయకులు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఫైళ్ళ ఆశయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో రజక వృత్తిదారుల యొక్క ఆర్థిక, సామాజిక స్థితిగతులు తీవ్ర అత్యంత వెనుకబడ్డ వారీగా ఉన్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. స్వాతంత్రం వచ్చి 80 ఏళ్లు దాటినా కూడా గ్రామీణ ప్రాంతంలో రజకులపై దాడులు దౌర్జన్యాలు కులవ్యక్షత పెత్తందారులచే గురవుతున్నారని తెలిపారు. రజకుల సామాజిక భద్రత ప్రత్యేక రక్షణ చట్టం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఏర్పడి రెండున్నర సంవత్సరాలు అవుతున్న కామారెడ్డి బీసీ డిక్లరేషన్ లో ప్రతి రజక వృత్తిదారునికి 10 లక్షల ఆర్థిక సహకారం అందిస్తామన్న హామీ ఇంతవరకు అమలు చేయలేదని, మోడ్రన్ ధోబి ఘట్లు నిర్మించాలని వృద్ధాప్య పెన్షన్ ఇవ్వాలని, ఉచిత విద్యుత్తు బకాయిలు ప్రభుత్వశీ వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరుతు ఎమ్మెల్యే పాల్వాయి కి వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి పాయిరాల రాములు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల పథకంలో రజక వృత్తిదారులకు ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వం డిమాండ్ చేశారు. కార్యక్రమశీలో కొమరంభీమ్ జిల్లా లోని మండలాల అధ్యక్షులు, గుండా హనుమంతు, రాచకొండ అశోక్, ఉప సర్పంచ్ మామిడి భీమేష్, రాసకొండ శ్రీనివాస్,మామిడి సాయి,గుండా.శంకర్, మల్రాజ్ రవీందర్, తక్కల ప్రశాంత్, రాగల్ల రాజమౌళి, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

# ,మెడికల్ కాలేజీ నర్సింగ్ కాలేజీల నిర్మాణ పనుల్లో వేగం పెంచండి

**- : రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ**



సంగారెడ్డి డెస్క్ విజన్ ఆంధ్ర సెప్టెంబర్ 03 : మెదక్ గవర్నమెంట్ మెడికల్ కాలేజీ,నర్సింగ్ కాలేజీ,హాస్టల్ భవనాల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని,ఏడాదిలోగా భవనాలను విద్యార్థులకు అదుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు.ఈమేరకు మెదక్ గవర్నమెంట్ మెడికల్ కాలేజీ,నర్సింగ్ కాలేజీ,హాస్టల్ భవనాల నిర్మాణ పురోగతి,మెదక్ గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ పనితీరుపై ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ గురువారం సమీక్ష చేశారు.కోఠిలోని తెలంగాణ మెడికల్ సర్వీసెస్,ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీజీఎంఎస్ఐడీసీ) ఆఫీస్‌లో జరిగిన ఈ సమావేశంలో మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ,డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తు, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ, డాక్టర్ గౌరవ్ ఉప్పల్, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్,డాక్టర్ సంగీత సత్యనారాయణ, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్,డాక్టర్ వాణి, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్,డాక్టర్ రవిందర్ నాయక్,మెదక్ గవర్నమెంట్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్,నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాల్,మెదక జనరల్ హాస్పిటల్ సూపరింటెండెంట్, సంగారెడ్డి నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాల్,ఇతర అధికారులు పాల్గొన్నారు. సుమారు రూ.40 కోట్ల రూపాయలతో నిర్మించిన సంగారెడ్డి నర్సింగ్ కాలేజీ భవనం ప్రారంభానికి సిద్ధమైందని టీజీఎంఎస్ఐడీసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు మంత్రికి తెలిపారు.కాలేజీ బిల్డింగ్ ప్రారంభించడానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. సుమారు రూ.156 కోట్ల రూపాయలతో చేపడుతున్న మెదక్ మెడికల్ కాలేజీ, హాస్టల్స్, నర్సింగ్ కాలేజీ భవనాల నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయని అధికారులు మంత్రికి వివరించారు. పనుల్లో వేగం పెంచాలని, ఏడాదిలోగా అన్ని భవనాలను స్టూడెంట్స్‌కు అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి ఆదేశించారు. ప్రస్తుతం అద్దె భవనాల్లో కాలేజీలు, హాస్టళ్లు కొనసాగుతున్నాయని.. వాటిల్లో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని హెల్త్ సెక్రటరీ,డీఎంఈని మంత్రి ఆదేశించారు.వెంటనే వెళ్లి మెదక్ మెడికల్, నర్సింగ్ కాలేజీలు, హాస్టల్ భవనాలను విజిట్ చేయాలని డీఎంఈని మంత్రి ఆదేశించారు. అవసరమైతే,అన్ని సౌకర్యాలు ఉన్న ఇతర భవనాలను అద్దెకు తీసుకుని,హాస్టళ్లను అక్కడికి మార్చాలని మంత్రి సూచించారు. ప్రస్తుతం పాత భవనంలోనే మెదక్ జనరల్ హాస్పిటల్ కొనసాగుతోందని, త్వరలోనే కొత్త హాస్పిటల్ భవనాలను మంజూరు చేస్తామని మంత్రి పేర్కొన్నారు.

# కామాంధుడు సైనఉల్లా ఖాన్‌ను వెంటనే ఎన్‌కౌంటర్ చేయాలి

**- ఆదివాసీ బిడ్డ శిరీష హత్యచారానికి నిరసనగా ఆసిఫాబాద్‌లో కొవ్వొత్తుల ర్యాలీ..**

**- అగ్రకులాలకో న్యాయం. అదివాసులకో న్యాయమా? పాలకుల పక్షపాత వైఖరిపై 'తుడుందెబ్బ' నిప్పులు..**

**- నిందితుడిని ఎన్‌కౌంటర్ చేయకపోతే జైనూర్ లో గతంలో జరిగిన తరహా ఉద్యమం తప్పదు: జిల్లా అధ్యక్షుడు కోవ విజయ్ కుమార్ హెచ్చరిక...**



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 3. (విజన్ ఆంధ్ర) : ఆదివాసీ యువతి శిరీషపై జరిగిన ఘోర హత్యచారాన్ని నిరసిస్తూ, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ ఆదివాసి హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) ఆధ్వర్యంలో కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో పాఠశాలలు, కళాశాలల విద్యార్థినీ విద్యార్థులు, ఆదివాసీ సంఘాల నేతలతో భారీ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. తుడుందెబ్బ ఆసిఫాబాద్ మండల అధ్యక్షుడు కోడప జగన్ నిర్వహణలో, జిల్లా అధ్యక్షుడు కోవ విజయ్ కుమార్ నేతృత్వంలో కొమురం భీం విగ్రహం నుండి ప్రారంభమై అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ కొనసాగింది. అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్ద శిరీష చిత్రపటానికి పూలమాలలు వేసి కొవ్వొత్తులతో ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు కోవ విజయ్ కుమార్ మాట్లాడుతూ....ఆదివాసీ బిడ్డపై ఇంత దారుణంగా హత్యాచారం జరిగి ఇన్ని రోజులవుతున్నా తెలంగాణ రాష్ట్ర నాయకులు, పాలకులు ఎందుకు నోరు విప్పడం లేదు? గతంలో అగ్రవర్ణాల మహిళలకు ఇలాంటి అన్యాయం జరిగితే తక్షణమే స్పందించి ఎన్‌కౌంటర్లు చేసిన ప్రభుత్వం, ఒక అడవి బిడ్డకు అన్యాయం జరిగితే ఎందుకు మౌనంగా ఉంది? అగ్రకులాలకో న్యాయం... బడుగు, బలహీన వర్గాలకో న్యాయమా?" దుర్మార్గుడైన సైనఉల్లా ఖాన్‌ను వెంటనే ఎన్‌కౌంటర్ చేయాలి. లేనిపక్షంలో జైనూర్‌లో గతంలో ఏ విధంగా తీవ్రస్థాయి నిరసనలు, ఉద్యమాలు జరిగాయో... అదే తరహాలో ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో కూడా మహా ఉద్యమం నిర్మిస్తాం. "ప్రస్తుతం రాష్ట్రంలో మహిళలకు ఏమాత్రం రక్షణ లేకుండా పోయింది. విధివిధానాలు మార్చకుంటే ఈ దాడులు ఆగేలా లేవు. మహిళలపై హత్యచారాలకు పాల్పడే దుర్మార్గులను క్షణాల్లో ఎన్‌కౌంటర్ చేసేలా నూతన చట్టాలను తీసుకురావాలి అని అన్నారు, ఈ కార్యక్రమంలో ...కొట్నక శకుంతల (గొండేశ్వరి మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి) పెందోర్ మారుతీ (తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి). బాబురావు (మంచిర్యాల తుడుందెబ్బ జిల్లా కార్యనిర్వహక అధ్యక్షుడు).. మడవి భీంరావు, కోట్నక రాంశావ్ (జిల్లా ఉపాధ్యక్షులు)పెందోర్ సుధాకర్ (రాజ్ గోండ్ సేవా సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి) రాజు తదితరులు పాల్గొన్నారు.

# ధ్రువీకరణ పత్రాలు తెచ్చిన వారి పేర్లను నమోదుచేయాలి..



సూర్యాపేట సెప్టెంబర్ 03:(విజన్ ఆంధ్ర) : ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో భాగంగా నోటీసులు అందుకున్న వారిలో సరైన ధ్రువీకరణ పత్రాలు సమర్పించిన వారి పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. గురువారం సూర్యాపేట పట్టణంలోని రాజీవ్ నగర్ చౌరస్తా (బర్ల పెంట బజార్) నందు 7,22,23 వార్డులకు సంబంధించి ఏర్పాటు చేసిన సమగ్ర ఓటర్ సవరణ ప్రక్రియ సెంటర్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా ఎన్యుమరేషన్‌లో మ్యాపింగ్‌కాని ఓటర్లతోపాటు వివరాలు తప్పుగా ఉన్న ఓటర్లకు సక్రమంగా నోటీసులు అందుతున్నాయా? లేదా? అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. నోటీసులు అందుకున్న వారు సరైన ధ్రువీకరణ పత్రాలు సమర్పించినప్పుడే వారిని ఓటర్ లిస్టులో చేర్చాలని అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో తహసీల్దార్ సాయి గౌడ్,బి ఎల్ వో లు, తంతేనపల్లి సుజాత, సుజాత, జిపిఓ విజయ్, మున్సిపాలిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


# రైల్వే లెవెల్ క్రాసింగ్‌లు ప్రతిపాదిత

**- రైల్వే ఓవర్ బ్రిడ్జిల పరిశీలన**



రంగారెడ్డి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 3, ( విజన్ ఆంధ్ర ) : రైల్వే శాఖ ప్రతిపాదించిన లెవెల్ క్రాసింగ్‌లు 12, 13తో పాటు ప్రతిపాదిత రైల్వే ఓవర్ బ్రిడ్జిలను రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సంబంధిత శాఖల అధికారులతో కలిసి గురువారము నాడు పరిశీలించారు.పరిశీలనలో గుర్తించిన అంశాల ఆధారంగా సమగ్ర నివేదికలను సిద్ధం చేసి, తదుపరి చర్యల కోసం రైల్వే శాఖకు అందజేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

# గీసుగొండలో భారీ బందోబస్తు కొండా సురేఖ బర్తరఫ్ నేపథ్యంలో ముందస్తు చర్యలు ప్రధాన కూడళ్లు, సున్నిత ప్రాంతాల్లో నిఘా సీఐ విశ్వేశ్వర్ ఆధ్వర్యంలో పోలీసుల కవాతు



వరంగల్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 03(విజన్ ఆంధ్ర);– కొండా సురేఖను మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేసిన నేపథ్యంలో గీసుగొండ మండలంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా మండల కేంద్రంలో భారీగా పోలీసు బలగాలను మోహరించారు. సీఐ విశ్వేశ్వర్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది కవాతు నిర్వహించారు. ప్రధాన కూడళ్లు, రహదారులు, సున్నిత ప్రాంతాల్లో బందోబస్తు ఏర్పాటు చేసి పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారు. రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఉద్రిక్తతలకు తావులేకుండా ప్రజలు సంయమనం పాటించాలని పోలీసులు సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. మండలంలో పరిస్థితి పూర్తిగా అదుపులో ఉందని తెలిపారు.

# భూభారతి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

**- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**



నిర్మల్ జిల్లా,సెప్టెంబర్ 03,(విజన్ ఆంధ్ర); జిల్లాలో పెండింగ్‌లో ఉన్న భూభారతి దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, ఎలాంటి జాప్యం లేకుండా నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో భూభారతి దరఖాస్తుల పరిష్కారంపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, వాటి పరిష్కార ప్రగతిని పరిశీలించారు. ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో పరిశీలించిన అనంతరం నిబంధనల ప్రకారం తగిన నిర్ణయం తీసుకోవాలని సూచించారు. దరఖాస్తుల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యం, జాప్యానికి తావులేకుండా నిర్ణీత గడువులోగా పెండింగ్ కేసులన్నింటినీ క్లియర్ చేయాలని స్పష్టం చేశారు. ఏదైనా సాంకేతిక లేదా ఇతర కారణాలతో దరఖాస్తును తిరస్కరించాల్సి వస్తే, తిరస్కరణకు గల స్పష్టమైన కారణాలను రికార్డుల్లో తప్పనిసరిగా నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే 22ఏ (22ఎ) నిషేధిత జాబితాలోని భూములకు సంబంధించిన సమస్యలను ప్రత్యేకంగా పరిశీలించి, నిబంధనల మేరకు తక్షణమే పరిష్కరించాలని సూచించారు. దరఖాస్తుదారులకు పారదర్శకంగా, నిబంధనల ప్రకారం సేవలు అందించడంతో పాటు భూభారతి దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆర్డీవో దేవీదాస్, సంబంధిత శాఖల అధికారులు, తహసీల్దార్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి కి శంషాబాద్ విమానాశ్రయంలో ఘన స్వాగతం..



మంచిర్యాల టౌన్ సెప్టెంబర్ 3 (విజన్ ఆంధ్ర) జపాన్ పర్యటనను విజయవంతంగా ముగించుకుని గురువారం హైదరాబాద్ చేరుకున్న కార్మిక, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి కి శంషాబాద్ విమానాశ్రయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. మంత్రి రాక సందర్భంగా మంచిర్యాల నియోజకవర్గాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, శ్రేణులు విమానాశ్రయానికి చేరుకుని ఆయనకు శాలువాలతో, పూలమాలలతో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. విమానాశ్రయంలో మంత్రిని కలిసిన వారిలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మంతెన జగన్ మోహన్ రావు ఇతర నాయకులు పాల్గొన్నారు. మంత్రి వివేక్ వెంకటస్వామి విదేశీ పర్యటన ముగించుకుని తిరిగొచ్చిన నేపథ్యంలో, మంచిర్యాల జిల్లా కేంద్రంగా కాంగ్రెస్ పార్టీ వర్గాల్లోనూ మరియు స్థానిక రాజకీయాల్లోనూ తీవ్ర ఆసక్తికర చర్చలు మొదలయ్యాయి.

# పరుగు వీరున్ని వరించిన స్వర్ణ పథకం

- **1500 మీ. దూరాన్ని 6 ని., 400మీ. దూరాన్ని 1ని.12సెకన్లలో పూర్తి**
- **నిర్దేశిత లక్ష్యాన్ని ఛేదించి ఒడిసి పట్టిన స్వర్ణ పథకం**
- **అలీ ఫిట్నెస్ జిమ్ వ్యవస్థాపకుడు, కోచ్ సద్దాం ఆధ్వర్యంలో శిక్షణ**
- **రాష్ట్ర స్థాయి పరుగు పందెంలో 5 సార్లు సాధించిన గోల్డ్ మెడల్**
- **వికారాబాద్ మం.గోధంగూడ గ్రామ నివాసి ఈడిగి శ్రీశైలం గౌడ్**




వికారాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 03 ( విజన్ ఆంధ్ర ) : పట్టుదల, ఓర్పు, అంకితభావం, క్రమశిక్షణతో అనునిత్యం సాధన చేస్తే సాధించలేనిది ఏదీ ఉండదు. పరుగు పందెంలో రాష్ట్ర స్థాయిలో సాధించాలనే లక్ష్యంతో ప్రతిరోజు కఠోర సాధన చేసి సత్ఫలితాన్ని సాధించాడు. అతని వివరాలు తెలుసుకునే ప్రయత్నం చేద్దాం. వికారాబాద్ మండల పరిధిలో గల గోధంగూడ గ్రామ నివాసి ఈడిగి శ్రీశైలం గౌడ్ పట్టణంలోని అలీ ఫిట్నెస్ జిమ్ వ్యవస్థాపకుడు, కోచ్ సద్దాం ఆధ్వర్యంలో తగు నైపుణ్య మెరుగులు తీర్చిదిద్దుకున్నాడు. 2026 ఆగస్ట్ 30 ఆదివారం హైదరాబాద్ లోని జింఖానా గ్రౌండులో జరిగిన రాష్ట్ర స్థాయి పరుగు పందెంలో 1500 మీటర్ల దూరాన్ని 6 నిమిషాలు, 400 మీటర్ల దూరాన్ని 1నిమిషం 12 సెకన్లలో అధిగమించి బంగారు పథకాన్ని కైవసం చేసుకున్నాడు. 1500మీ., 400 మీటర్లలో బంగారు పథకాన్ని సాధించిన ఈడిగి శ్రీశైలం గౌడ్ ను ఆల్ ఇండియా అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్షుడు మర్రి లక్ష్మారెడ్డి గోల్డ్ మెడల్ తో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని గోల్డ్ మెడల్ సాధించిన ఈడిగి శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ నేటి యువత శారీరక శ్రమ చేయకుండా సెల్ ఫోన్లకు అంకితమవడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇండోర్, అవుట్ డోర్ గేమ్స్ లలో నేటి యువత ఆసక్తి కనబరిస్తే లక్ష్యాలను సాధిస్తారని ఆయన ఆకాంక్షించారు. అలీ ఫిట్నెస్ జిమ్ లో శిక్షణ పొందుతున్న శిక్షణార్థులు కరంతోట్ రాఘవన్ నాయక్, పిల్లల వైద్య నిపుణులు తుప్ప ఆనంద్, చందర్, మహమ్మద్ కరీం, ప్రవీణ్, మహమ్మద్ షోయబ్ తదితరులు ఘనంగా శాలువా కప్పి పూలమాలాంకృతం చేసి సన్మానం చేశారు.

# అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి

**- జిల్లా కలెక్టర్ కె.హరిత**



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 3,(విజన్ ఆంధ్ర) : జిల్లాలో వివిధ పథకాల ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తిచేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె హరిత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ–ఉట్నూర్ ప్రాజెక్టు అధికారి మంద మకరందు, జిల్లా అటవీ అధికారి బాలమణి, కాగజ్ నగర్, ఆసిఫాబాద్ డివిజన్ అటవీ అధికారులు భార్గవ్, అప్పయ్య లతో కలిసి జిల్లాలో వివిధ శాఖల ద్వారా చేపడుతున్న పనులు, అటవీశాఖ అనుమతుల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భూముల రీ సర్వేలో రెవెన్యూ, అటవీ శాఖల మధ్య వివాదాలు గల భూములను జాయింట్ సర్వే నిర్వహించి సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో చేయబడుతున్న ఇందిరమ్మ ఇండ్లు, ప్రధానమంత్రి జన్ మన్ పథకం క్రింద మంజూరైన ఇండ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని, అటవీ అధికారులతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. టి.డబ్ల్యు.ఐ.డి.సి. ఆధ్వర్యంలో లింగాపూర్ మండలంలో కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం ప్రహరీ గోడ నిర్మాణం త్వరగా పూర్తిచేయాలని, గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పలు మండలాలలో బిటి రహదారులు, వంతెనలు, కల్వర్టు పనులు మంజూరయ్యాయని, సంబంధిత అటవీ శాఖ అనుమతులు త్వరగా పొంది పనులు చేపట్టాలని తెలిపారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ ఆధ్వర్యంలో చేపడుతున్న రహదారులు, గ్రామపంచాయతీ భవనాలు, మండల సమాఖ్య భవనాలు, సి సి రహదారుల పనులు త్వరగా చేపట్టాలని తెలిపారు. బిఎస్ఎన్ఎల్, జియో సంస్థల సెల్ టవర్ల నిర్మాణాల కొరకు అవసరమైన అనుమతులు పొంది పనులు వేగవంతంగా పూర్తి చేసి నెట్వర్క్ సేవలను మారుమూల గ్రామాలకు అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు. అభివృద్ధి పనులలో అవసరమైన చోట అటవీ శాఖ అనుమతులు త్వరగా పొంది పనులు పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ పి.డి. ప్రకాష్ రావు, పంచాయితీ రాజ్ ఈ ఈ ధర్మేందర్, జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి, నీటిపారుదుల, రహదారి భవనాలు, గిరిజన సంక్షేమ శాఖల అధికారులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జీవన శైలి వ్యాధుల నిర్ధారణ పరీక్షలు, చికిత్స పెంచండి



నిజామాబాద్ సెప్టెంబర్03:( విజన్ ఆంధ్ర ) నిజామాబాద్ నగరంలో గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జీవనశైలివాదుల పై ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమాన్ని మరియు సమీక్షను నిర్వహించడానికి డబ్ల్యూహెచ్ఓ కన్సల్టెంట్ వైద్యులు డాక్టర్ అబ్దుల్ వాసి ముఖ్యఅతిథిగా విచ్చేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ బి రాజశ్రీ తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అబ్దుల్వాసి మాట్లాడుతూ జీవనశైలి వ్యాధులు ముఖ్యంగా హైపర్ టెన్షన్, మధుమేహం మరియు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలను ఆరోజు ఉప కేంద్రాల వారిగా గ్రామాల వారీగా ప్రతి ఒక్కఆశ ప్రతిరోజు పదిమంది 30 సంవత్సరాల పైబడిన వారికి నిర్ధారణ పరీక్షలు నిర్వహించినట్లయితే జిల్లావ్యాప్తంగా పెండింగ్ స్క్రీనింగ్ ఈ నెల చివరి వరకు పూర్తి చేయవచ్చన్నారు. 30 సంవత్సరాల పైబడిన వారిలో 26% గుండెజబ్బుల కోసం 13 శాతం మధుమేహం వ్యాధిగ్రస్తులు ఉంటారని , మొత్తం పాపులేషన్ లో 56% 36 సంవత్సరాల పైబడిన వారు ఉంటారని వారికి నిర్ధారణ పరీక్షలు పూర్తిచేసి చికిత్స ప్రారంభించాలన్నారు. అదేవిధంగా ఈపాటికే ప్రైవేట్ హాస్పిటల్ లో చికిత్స తీసుకుంటున్న పాజిటివ్ కేసులు అన్నింటిని ఆన్లైన్లో నమోదు చేయాలని సూచించారు. ఇాదీనాా కార్డుల కొరకు ఇంకా నమోదు చేయని వారు 100% పూర్తి చేయాలన్నారు. స్థాయిలో మరియు ఆరోగ్య ఉపకేంద్రస్థాయిలో ప్రతినెల 5వ తేదీ లోపు నమోదు చేయాలన్నారు. ఇంకా హైపర్ టెన్షన్ మరియు డయాబెటిస్ ట్రీట్మెంట్ ప్రోటోకాల్ పై వివిధ జూష్ట్రష ల వైద్యాధికారులకు పిపిటి ప్రజెంటేషన్ ద్వారా వివరించడం జరిగింది. ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ డాక్టర్ బి రాజశ్రీ మాట్లాడుతూ జీవన శైలి వ్యాధులతో పాటు మిగతా జాతి ఆరోగ్య కార్యక్రమాలను ముఖ్యంగా మాతా శిశు ఆరోగ్య సేవలు, క్షయ వ్యాధి నిర్ధారణ శిబిరాలను విస్తృతంగా నిర్వహిస్తూ నూతన కేసులకు చికిత్స అందించాలని, వివిధ శాఖల సమన్వయంతో, మరియు మండల స్థాయి స్పెషల్ ఆఫీసర్ సహకారంతో టీబీ ఎంబీఏ కార్యక్రమాన్ని ప్రతి పీహెచ్సీ స్థాయిలో పోషణ కిట్లను క్షయ వ్యాధి గ్రాస్తులకు అందించడం, పోషకాహారం కోసం క్షయ వ్యాధిగ్రస్తులకు ప్రతినెలా ఇచ్చే వెయ్యి రూపాయలను అందించే డిబిటీ ని 100% పూర్తి చేయాలన్నారు. ఈ ఆరోగ్యాన్ని పకడ్బందీగా నిర్వహించాలని, ఈ ఔషధీలో అవసరమైన మరియు పంపిణీ చేసిన ఔషధాలను నమోదు చేయాలని అన్నారు. వ్యాధినిధులకు టీకాలను ప్రతి పీహెచ్సీలో నిర్వహించే 100% పూర్తి చేయాలని, హెచ్పివి వ్యాక్సినేషన్ ను అర్హులైన 14 సంవత్సరాల బాలికలు అందరికీ అందజేయాలని తెలియజేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో డి ఐ ఓ డాక్టర్ అశోక్, డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ సికందర్ నాయక్, పివో ఎన్ సి డి డాక్టర్ వెంకన్న, డాక్టర్ నవ్య, ఎన్సిడి కోఆర్డినేటర్ వెంకటేష్, డిహెచ్ఈ ఘనపూర్ వెంకటేశ్వర్లు, డిడిఏం నారాయణ, డిపిఓ విశాల, మరియు వివిధ పీహెచ్సీల వైద్యాధికారులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- **గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చు పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి**
- **డాక్టర్లు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలి**
- **జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**



సూర్యాపేట సెప్టెంబర్ 03:(విజన్ ఆంధ్ర) : సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఇక పై వైద్యులు, సిబ్బంది విధుల్లో క్రమశిక్షణ, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు. గురువారం ఆయన ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా పురుషుల, మహిళల ఓ పి రూమ్ లను సందర్శించి ఔట్ పేషెంట్ రిజిస్టర్ లు పరిశీలించి, ఎంతమంది అవుట్ పేషంట్స్ ఈరోజు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు తదుపరి ఏఎంసి వార్డును తనిఖీ చేశారు ఈ సందర్భంగా డ్యూటీ డాక్టర్లను ఈరోజు పేషెంట్లకు వైద్య సేవ అందించు రౌండ్స్ పూర్తయ్యాయ అడిగి తెలుసుకున్నారు, పీఎంజేవై, ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ పేషెంట్ రిజిస్ట్రేషన్ కౌంటర్ ను, డ్రగ్స్ స్టోర్ రూమ్ ను, జనరల్ మెడిసిన్ డాక్టర్ రూమ్ ను తనిఖీ చేశారు. డయాగ్నస్టిక్ రూమ్, బ్లడ్ శాంపిల్ కౌంటర్ ను తనిఖీ చేసి ఈరోజు పేషెంట్లకు ఏమేమి పరీక్ష నిర్వహించారు, రిపోర్టు ఎలా ఉన్నవి అని రిపోర్ట్స్ పరిశీలించారు, డయాగ్నస్టిక్ కెమికల్స్ వివరాలు సిబ్బందిని అడిగితెలుసుకున్నారు తదుపరి జనరల్ వార్డును తనిఖీ చేసి పేషంట్ల వివరాలను డ్యూటీ డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు, అక్కడే మెడిసిన్ రియాక్షన్ వలన చికిత్స పొందుతున్న తిరుమలగిరి కి చెందిన రహీమా బేగం ను పరామర్శించి రియాక్షన్ కు గల కారణాలను అడిగి తెలుసుకుని ఆమె కు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆర్ఎం ను ఆదేశించారు. తదుపరి కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలం కావడంతో డెంగ్యూ, టైఫాయిడ్, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, మెడికల్ వార్డులను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రతిరోజూ ఫీవర్ కేసులు, అడ్మిషన్లు, డిశ్చార్జ్ వివరాలను అప్‌డేట్ చేయాలని చెప్పారు. మందుల కొరత లేకుండా బఫర్ స్టాక్ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఆసుపత్రిలో మౌలిక సదుపాయాలు, అత్యాధునిక శస్త్రచికిత్సల కోసం ఉపయోగించు మందులు, పరికరాల కొనుగోలుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చు పేద ప్రజల పట్ల మర్యాదగా వ్యవహరిస్తూ వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని, విధుల పట్ల అలసత్వం ప్రదర్శించరాదని, దూర ప్రాంతాల నుండి వచ్చు వృద్ధులకు వికలాంగులకు బయట వీల్ చైర్లు అందుబాటులో ఉంచాలని ఆర్ ఎం ను డ్యూటీ డాక్టర్లను ఆదేశించారు. అలాగే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా డ్రెస్ కోడ్ పాటించాలని, ఐడీ కార్డులు ధరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డాక్టర్లు వాణి, జనార్ధన్, అనిత, శ్రీలత, ఉపేందర్, యశ్వంత్, వినయ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బాలికల భద్రతపై అప్రమత్తత అవసరం

- **రుద్రంపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో షీ టీమ్**
- **ఎస్ఐ రమాదేవి అవగాహన**



కొత్తగూడెం బ్యూరో సెప్టెంబర్ 04(విజన్ ఆంధ్ర) : మహిళలు, బాలికలు తమ భద్రత విషయంలో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని షీ టీమ్ ఎస్ఐ రమాదేవి సూచించారు. రుద్రంపూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మహిళలు, బాలికలు, చిన్నారుల భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు డయల్ 112, షీ టీమ్స్, టీ–సేఫ్ యాప్, 'పోలీస్ అక్క' కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఎస్ఐ రమాదేవి మాట్లాడుతూ.. ఎవరైనా బాలికలను వేధించినా, అసభ్యకరంగా ప్రవర్తించినా, వెంటపడినా లేదా బెదిరించినా భయపడకుండా వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. సమస్యలను మనసులో పెట్టుకుని మౌనంగా ఉండవద్దని, ఇబ్బందులను దాచిపెట్టడం వల్ల సమస్య మరింత తీవ్రమయ్యే అవకాశం ఉంటుందని తెలిపారు. మహిళలు, బాలికల రక్షణ కోసం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో షీ టీమ్స్ పనిచేస్తున్నాయని, ఎలాంటి ఇబ్బంది ఎదురైనా పోలీసులను



సంప్రదించేందుకు సంకోచించాల్సిన అవసరం లేదన్నారు. "సహాయం కోరడం బలహీనత కాదు.. అది తెలివైన నిర్ణయం" అని విద్యార్థులకు సూచించారు. మహిళలు, బాలికలపై వేధింపులు, అసభ్య ప్రవర్తన, వెంటపడటం, బెదిరింపులు వంటి ఘటనలు ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు.

**ఆపదలో 112కు కాల్ చేయాలి**


రోడ్డు ప్రమాదాలు, మహిళలు, బాలికలపై వేధింపులు, గొడవలు, బెదిరింపులు లేదా ఇతర అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు భయపడకుండా వెంటనే డయల్ 112కు ఫోన్ చేయాలని విద్యార్థులకు వివరించారు. "ఆపదలో ఉంటే భయపడొద్దు.. 112కు కాల్ చేయండి" అని ఎస్ఐ రమాదేవి సూచించారు. పోలీసులకు సమాచారం అందించడంలో ఆలస్యం చేయకుండా సకాలంలో సమాచారం అందిస్తే సత్వర సహాయం పొందే అవకాశం ఉంటుందని తెలిపారు.

**మహిళలు, చిన్నారుల రక్షణకు 'పోలీస్ అక్క'**

మహిళలు, చిన్నారుల రక్షణ కోసం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 'పోలీస్ అక్క' కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు ఎస్ఐ రమాదేవి తెలిపారు. మహిళలు, బాలికలు తమకు ఎదురయ్యే సమస్యలను ఎలాంటి భయం, సంకోచం లేకుండా పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.ఎవరైనా వేధించినా, అసభ్యకరంగా ప్రవర్తించినా, వెంటపడినా లేదా బెదిరించినా మౌనంగా ఉండకూడదని, వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులను ఆశ్రయించాలని తెలిపారు."మీ భద్రత మీ హక్కు.. మీ సమస్యను చెప్పడం మీ ధైర్యం" అని విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు చదువులో రాణించడంతో పాటు బాధ్యతాయుతమైన, చైతన్యవంతమైన మంచి పౌరులుగా ఎదగాలని ఎస్ఐ రమాదేవి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అక్క టూ టౌన్ ఇన్‌చార్జి లక్ష్మి, హెడ్ కానిస్టేబుళ్లు లచ్చు, శ్రీనివాస్, షి టీం సిబ్బంది, పాఠశాల హెడ్‌మాస్టర్ బి. బాలాజీ, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు లక్ష్మి, రాధ, వెంకటేశ్వర్లు, రజియా సుల్తానా, గణేష్ కుమార్, కృష్ణవేణి, విజయనిర్మల తదితరులు పాల్గొన్నారు. అలాగే పాఠశాల సిబ్బంది గోవర్ధన చారి, ధీరజ్ బాబు, ఉమా తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు పాల్గొని మహిళలు, బాలికలు, చిన్నారుల భద్రత, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన చర్యలు, పోలీసులను సంప్రదించే విధానాలపై అవగాహన పొందారు.

## సరూర్ నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ

**- అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి**



రంగారెడ్డి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 3, ( విజన్ ఆంధ్ర ): సరూర్ నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి మరియు జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ స్వర్ణ కుమారి. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో అందిస్తున్న వైద్య సేవలు, రోగుల హాజరు, ఓపీ రిజిస్టర్లు, సిబ్బంది హాజరు, మందుల లభ్యత, ల్యాబొరేటరీ సేవలు, ప్రసూతి మరియు శిశు ఆరోగ్య సేవలను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలు మరింత సమర్థవంతంగా అందేలా సిబ్బంది సమయపాలన పాటిస్తూ, అందుబాటులో ఉన్న అన్ని సేవలను ప్రజలకు తెలియజేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఆరోగ్య కేంద్రంలో పరిశుభ్రతను నిరంతరం పాటించాలని, మందుల కొరత లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అందుకు అనుగుణంగా వైద్య సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి సూచించారు.

# వర్షాకాలం చిరుతిళ్లతో దంత సమస్యలు


**-ప్రముఖ దంత వైద్య నిపుణురాలు డాక్టర్ సోనియా దత్తా**



హైదరాబాద్, సెప్టెంబర్ 03 (విజన్ ఆంధ్ర) : వర్షాకాలపు రుచులను మితంగా ఆస్వాదిస్తూ నోటి పరిశుభ్రతను నిరంతరం పాటించాలని ప్రముఖ దంత వైద్య నిపుణురాలు డాక్టర్ సోనియా దత్తా గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వర్షాకాలంలో తరచూ చిరుతిళ్లు, చక్కెర–పిండి పదార్థాలు అధికంగా ఉండే ఆహారం తీసుకోవడం వల్ల దంతాలపై పాచి పేరుకుపోవడం, క్యావిటీలు వచ్చే ప్రమాదం పెరుగుతుందని హెచ్చరించారు. చిరుతిళ్లు తిన్న తర్వాత నీటితో నోరు పుక్కిలించడం, తగినంత నీరు తాగడం, రోజుకు రెండుసార్లు పళ్లు తోమడం ద్వారా నోటి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సూచించారు. రోజువారీ దంత సంరక్షణలో లవంగం, శొంఠి వంటి ఆయుర్వేద మూలికలతో కూడిన, ఐడిఎ గుర్తింపు పొందిన డాబర్ రెడ్ టూత్‌పేస్ట్ ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.

# జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

**-జిల్లా విద్యాశాఖాధికారి జి.శారద**



పెద్దపల్లి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్–03(విజన్ ఆంధ్ర) : జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని సెప్టెంబరు 5న జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి జి. శారద తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా స్థాయిలో ఎంపికైన ఉత్తమ ఉపాధ్యాయులందరూ సెప్టెంబరు 5న ఉదయం 10.30 గంటలకు సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించే కార్యక్రమానికి హాజరుకావాలని ఆమె సూచించారు. ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# ఆల్పాహారం పథకం పేద విద్యార్థులకు వరం

**- 23 వ డివిజన్ కార్పొరేటర్ కర్రు శంకర్**

23వ డివిజన్ పరిధిలోని తిలక్ నగర్ ప్రభుత్వ పాఠశాలలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉచిత అల్పాహార పథకాన్ని ప్రారంభించడం ఎంతో సంతోషకరమని, ఆల్పాహర పథకం పేద విద్యార్థులకు వరం లాంటిదని కాంగ్రెస్ పార్టీ 23 వ డివిజన్ కార్పొరేటర్ కర్రు శంకర్ అన్నారు. గురువారం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఆల్ఫాహారం అందించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు ప్రతిరోజు ఉదయం ఆరు రకాల పోషకాలతో కూడిన అల్పాహారాన్ని అందించడం జరుగుతుందన్నారు.దీనివల్ల ఎంతోమంది పేద విద్యార్థులకు బలవర్ధకమైన పోషకాహారం అందుతుందని,పిల్లలు ఉన్నత చదువులు చదివి ఈ దేశానికి,రాష్ట్రానికి ఎన్నో సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమాన్ని ఇస్కాన్ సంస్థ ద్వారా అమలు చేస్తున్నందుకు, దీనికి సహకరిస్తున్న సింగరేణి యాజమాన్యానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, స్థానిక శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు కి కృతజ్ఞతలు తెలిపారు.రాష్ట్రంలోనే నాలుగో స్థానంగా మంచిర్యాల జిల్లాలో ఈ పథకాన్ని ఏర్పాటు చేయడంలో కృషి చేసిన పెద్దలు ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావుకి, మాజీ డిసిసి అధ్యక్షురాలు సురేఖ కు ప్రత్యేక అభినందనలు తెలిపారు.అనంతరం విద్యార్థులతో కలిసి ఆల్ఫాహారం చేశారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల హెడ్ మాస్టర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## చేపల పెంపకం ద్వారా ఉపాధి అవకాశాలు

**- జిల్లా కలెక్టర్ కె.హరిత**



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 3,(విజన్ ఆంధ్ర) : స్వయం సహాయక సంఘాల మహిళలు, ఉపాధి కూలీలు చేపల పెంపకం ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపరచుకుని అదనపు ఆదాయం పొందవచ్చని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయం ఆవరణలో జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలోని వి బి జి రామ్ జి పథకం క్రింద చేపట్టిన పంట కుంట, నీటి కుంట, ఊట కుంటలలో ప్రధానమంత్రి కె.ఎ.ఎస్.వై. ద్వారా జల్ జీవిక స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన చేప పిల్లల పంపిణీ కార్యక్రమానికి హాజరై జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావుతో కలిసి లబ్ధిదారులకు చేప పిల్లలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల కుటుంబాలు, ఉపాధి కూలీలు తమ వ్యవసాయ భూములలో ఊట కుంటలు, నీటి కుంటలు, పంట కుంటల నిర్మాణాలు చేపట్టి వాటిలో చేపల పెంపకం ద్వారా అదనపు ఆదాయం పొంది ఉపాధి అవకాశాలు మెరుగుపరచుకోవచ్చని తెలిపారు. చేప పిల్లలను జల్ జీవిక స్వచ్ఛంద సంస్థ ముందుకు వచ్చి అందించడం అభినందనీయమని, లబ్ధిదారులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి ఆంజనేయులు, జల్ జీవిక స్వచ్ఛంద సంస్థ సంచాలకులు పద్మాకర్, సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# అంగన్వాడీల్లో చిన్నారులకు ఆహ్లాదకర వాతావరణం కల్పించాలి

**- పిల్లల సమగ్ర వికాసంపై ప్రత్యేక దృష్టి సారించాలి**

**- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**




నిర్మల్ జిల్లా,ఆగస్ట్ 03,( విజన్ ఆంధ్ర); అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులు ఆహ్లాదకరమైన వాతావరణంలో గడిపేలా అన్ని రకాల మౌలిక వసతులు, ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. గురువారం నిర్మల్ గ్రామీణ మండలం రత్నాపూర్ కాండ్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలోని రికార్డులను పరిశీలించి, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందుతున్న సేవలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లోని చిన్నారులందరినీ అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించేలా అధికారులు, సిబ్బంది ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. కేంద్రాలను పిల్లలను ఆకట్టుకునే విధంగా రంగురంగుల బొమ్మలు, పెయింటింగ్స్, వర్ణమాల, విద్యా చార్టులతో అలంకరించి, ఆటపాటల ద్వారా చిన్నారులకు విద్యాబోధన అందించాలని తెలిపారు. చిన్నారుల శారీరక, మానసిక వికాసానికి తోడ్పడేలా ప్రతిరోజూ పౌష్టికాహారం అందించడంతో పాటు ఆటలు, రైమ్స్ వంటి కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పిల్లల ఆరోగ్య పరిస్థితి, ఎత్తు, బరువు తదితర వివరాలను ఎప్పటికప్పుడు రికార్డుల్లో నమోదు చేయాలని ఆదేశించారు.

**- సామ్, మామ్ పిల్లలపై ప్రత్యేక దృష్టి**

సామ్ , మామ్ కేటగిరీకి చెందిన పిల్లల వివరాలను పకడ్బందీగా నమోదు చేసి, పోషకాహార లోపం ఉన్న చిన్నారులకు అదనపు పౌష్టికాహారం అందించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి గర్భిణి, బాలింతకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, పోషకాహార సేవలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తనిఖీ సందర్భంగా కలెక్టర్ చిన్నారులతో సరదాగా ముచ్చటించారు. వారి పేర్లు, చదువు గురించి అడిగి తెలుసుకుని, ప్రతిరోజూ క్రమం తప్పకుండా అంగన్వాడీ కేంద్రానికి రావాలని సూచించారు. చిన్నారులతో రైమ్స్ చెప్పించి, సంఖ్యలు చదివించడంతో పాటు వారికి చాక్లెట్లు అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి వినూత్న, వైద్యారోగ్య శాఖ అధికారులు పవన్ కుమార్, సౌమ్య, నయనా రెడ్డి, రమేష్, అలీ, సర్పంచ్ హరీష్, ఉప సర్పంచ్ భూమేష్, అంగన్వాడీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# రైతులంతా క్రాప్ సర్వేలో పంటల వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి - జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా

**- రైతుల సమక్షంలోనే క్షేత్రస్థాయిలో పంటల వివరాల నమోదు**

**- ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా సర్వే పూర్తి చేయాలి**



నిర్మల్ జిల్లా,ఆగస్ట్ 03,(విజన్ ఆంధ్ర); జిల్లాలోని రైతులందరూ తమ సాగు, పంటల వివరాలను క్రాప్ సర్వేలో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా స్పష్టం చేశారు. గురువారం సారంగాపూర్ మండలం గోపాల్‌పేట్ గ్రామ శివారులో పొలాల్లో కొనసాగుతున్న క్రాప్ సర్వే ప్రక్రియను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో కలెక్టర్ మాట్లాడుతూ, పంటల వివరాలు క్రాప్ సర్వేలో సక్రమంగా నమోదైతే భవిష్యత్తులో ధాన్యం విక్రయాలు, ప్రభుత్వ పథకాల ద్వారా లభించే సహాయం, ఇతర వ్యవసాయ ప్రయోజనాలు పొందే సమయంలో ఇబ్బందులు తలెత్తకుండా ఉంటాయని తెలిపారు. రైతులు వ్యవసాయ శాఖ సిబ్బందికి అవసరమైన సహకారం అందించి, తమ పంటల వివరాలను సక్రమంగా నమోదు చేయించుకోవాలని సూచించారు. క్రాప్ సర్వేలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పంటల వివరాలను పకడ్బందీగా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. సర్వే సిబ్బంది తప్పనిసరిగా రైతుల సమక్షంలోనే పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, వాస్తవ సాగు వివరాలను నమోదు చేయాలని స్పష్టం చేశారు. నిర్దేశిత గడువులోగా క్రాప్ సర్వేను పూర్తి చేసేందుకు పదో తరగతి ఉత్తీర్ణులైన స్థానిక యువతను వాలంటీర్లుగా నియమించుకుని వారి సేవలను వినియోగించుకోవాలని సూచించారు. సర్వే ప్రక్రియను అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ, నమోదు ప్రక్రియలో పారదర్శకత, ఖచ్చితత్వం ఉండేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి సుజాత, ఎంపీఓ అజీజ్ ఖాన్, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 5, 6, 12, 13 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాలు



నిజామాబాద్, సెప్టెంబర్03:( విజన్ ఆంధ్ర ) స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియలో భాగంగా ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ నెల 5, 6, 12, 13 తేదీలలో జిల్లాలోని అన్ని నియోజకవర్గాల పరిధిలో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం (స్పెషల్ క్యాంపెయిన్) నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భవేష్ మిశ్రా తెలిపారు. మొదటి విడతగా 5, 6 తేదీలలో, రెండవ విడతగా 12, 13వ తేదీలలో స్పెషల్ క్యాంపెయిన్ కొనసాగుతుందన్నారు. ప్రత్యేక ఓటరు నమోదు సందర్భంగా ప్రతి బూత్ లెవల్ అధికారి (బీఎల్ఓ) తమకు కేటాయించిన నిర్దేశిత ప్రదేశంలో అందుబాటులో ఉంటారని అన్నారు. ఓటర్లకు అవసరమైన ఫారం-6, ఫారం-7, ఫారం-8లతో పాటు ముసాయిదా ఓటరు జాబితాను అందుబాటులో ఉంచడం జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవాల్సిన వారు ఫారం-6 ద్వారా, ఓటరు జాబితాలోని పేర్ల తొలగింపు లేదా అభ్యంతరాలకు ఫారం-7 ద్వారా, ఓటరు వివరాల్లో మార్పులు, సవరణలు, చిరునామా మార్పు వంటి వాటికి ఫారం-8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో సంబంధిత బూత్ లెవల్ అధికారులతో పాటు బూత్ లెవల్ ఏజెంట్లు కూడా అందుబాటులో ఉండాలని, ముసాయిదా ఓటరు జాబితాను ఓటర్లు పరిశీలించేందుకు సహకరించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఓటరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఓటరు జాబితాలో తమ పేరు ఉందో లేదో పరిశీలించుకోవడంతో పాటు, అవసరమైన సవరణలు, మార్పులు లేదా కొత్తగా ఓటరు నమోదు కోసం స్పెషల్ క్యాంపెయిన్ రోజుల్లో తమ సమీప పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

# కాంగ్రెస్ పాలన ప్రజాపాలన కాదు.. '1,000 అబద్ధాల దగాపాలన'

**- 420 హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం**

**- బాల్కొండలో 420 అడుగుల భారీ ఫ్లెక్సీతో బీఆర్ఎస్ నిరసన.. ర్యాలీ, మానవహారం, ధర్నా**

**- రైతులు, మహిళలు, యువతకు కాంగ్రెస్ ప్రభుత్వం పడ్డ బకాయిల లెక్కలతో 'కాంగ్రెస్ బాకీ కార్డులు' పంపిణీ**




నిజామాబాద్, సెప్టెంబర్ 3 (విజన్ ఆంధ్ర): ఎన్నికల సమయంలో ఆరు గ్యారెంటీలు, వివిధ డిక్లరేషన్ల పేరుతో 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. అధికారంలోకి వచ్చి 1,000 రోజులు గడిచినా హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. కాంగ్రెస్ పాలన ప్రజాపాలన కాదని, ఇది ముమ్మాటికీ '1,000 అబద్ధాల దగాపాలన' అని ఆయన ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు చేపట్టిన రాష్ట్రవ్యాప్త ఆందోళనల్లో భాగంగా బాల్కొండ నియోజకవర్గ కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహించడంతో పాటు, కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీల వైఫల్యాలను ప్రతిబింబించేలా 420 అడుగుల భారీ ఫ్లెక్సీతో మానవహారం, ధర్నా చేపట్టారు.

### '100 రోజులు' అన్న మాటను ఇప్పుడు 'ఐదేళ్లు'గా మార్చారు

అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో డిసెంబర్ 9న ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే ఆరు గ్యారెంటీ కార్డులపై తొలి సంతకం చేస్తామని, తొలి నెలలో లేదా 100 రోజుల్లోనే హామీలను అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారని గుర్తుచేశారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సైతం గ్యారెంటీ కార్డులను ప్రజల ఇళ్లకు తీసుకెళ్లి అధికారంలోకి వచ్చిన వెంటనే వాటిని అమలు చేస్తామని చెప్పారని పేర్కొన్నారు. అయితే 1,000 రోజులు గడిచిన తర్వాత టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ '100 రోజుల్లో అమలు చేస్తామని ఎక్కడా చెప్పలేదు.. ఐదేళ్లలో అమలు చేస్తామని చెప్పాం' అంటూ మాట మార్చడం సిగ్గుచేటని ప్రశాంత్‌రెడ్డి మండిపడ్డారు.

### మహిళలకు రూ.82,500 బకాయి

18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.2,500 ఇస్తామని ఇచ్చిన హామీని అమలు చేయలేదని ఎమ్మెల్యే ఆరోపించారు. 33 నెలలకు లెక్కిస్తే ఒక్కో మహిళకు రూ.82,500 బకాయి పడిందన్నారు. రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తామని చెప్పి ఆ హామీని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. ఒక్కో కుటుంబానికి నెలకు రూ.500 చొప్పున 33 నెలలకు రూ.16,500 బకాయి ఉందన్నారు. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, బీడీ కార్మికులకు రూ.4,000 పింఛన్, దివ్యాంగులకు రూ.6,000 పింఛన్ ఇస్తామని చెప్పి అమలు చేయలేదన్నారు. పెంచాల్సిన రూ.2,000 చొప్పున 33 నెలలకు ఒక్కో పింఛన్‌దారుడికి రూ.66,000 బకాయి ఉందని తెలిపారు.

### బాల్కొండలో 5 వేల మంది ఆడబిడ్డలకు తులం బంగారం బకాయి

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలతో పాటు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చి ఆడబిడ్డలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని ప్రశాంత్‌రెడ్డి ఆరోపించారు. ఒక్క బాల్కొండ నియోజకవర్గంలోనే సుమారు 5,000 మంది ఆడబిడ్డలకు తులం బంగారం బకాయి ఉందన్నారు.

### ఇందిరమ్మ ఇళ్ల పేరుతో పేదలపై అప్పుల భారం

స్థలం లేని నిరుపేదలకు స్థలంతో పాటు ఇల్లు నిర్మించుకునేందుకు రూ.5 లక్షలు ఇస్తామని చెప్పి ప్రభుత్వం చేతులెత్తేసిందని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బాల్కొండ నియోజకవర్గంలో 300 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నిర్మించి లబ్ధిదారులకు అందించామని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామానికి అరకొరగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి నిర్మాణ బిల్లుల్లో రూ.3.60 లక్షలు మాత్రమే చెల్లిస్తూ మిగతా రూ.1.40 లక్షలు ఇవ్వకపోవడంతో పేద కుటుంబాలపై రూ.5 నుంచి రూ.6 లక్షల వరకు అప్పుల భారం పడుతోందని ఆరోపించారు.

### రైతు కుటుంబానికి రూ.6.02 లక్షల వరకు బకాయి

గత ప్రభుత్వ హయాంలో 24 గంటల ఉచిత విద్యుత్, రైతుబంధు, ధాన్యం కొనుగోళ్లు, యూరియా సరఫరాతో వ్యవసాయ రంగాన్ని ఆదుకున్నామని ప్రశాంత్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి రైతులను మోసం చేసిందని విమర్శించారు. ఎకరాకు ఏడాదికి రూ.15,000 రైతు భరోసా ఇస్తామని చెప్పి కోతలు విధించారని, నాలుగు ఎకరాల రైతుకు రూ.1.02 లక్షల వరకు రైతు భరోసా బకాయి ఉందన్నారు. ప్రతి ధాన్యం గింజకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి కొన్ని సన్న రకాలకే పరిమితం చేశారని ఆరోపించారు. తన లెక్కల ప్రకారం నాలుగు ఎకరాల రైతుకు రుణమాఫీ రూ.2 లక్షలు, రైతు భరోసా రూ.1.02 లక్షలు, ధాన్యం బోనస్ రూ.3 లక్షలు కలిపి మొత్తం రూ.6.02 లక్షల వరకు బకాయి ఉందని తెలిపారు.

### యువతకు ఇచ్చిన హామీలు ఎక్కడ?

కౌలు రైతులకు ఎకరాకు రూ.15,000, ఉపాధి హామీ కూలీలకు ఏటా రూ.12,000 ఇస్తామని ఇచ్చిన హామీలను అమలు చేయలేదని అన్నారు. విద్యార్థులకు 'యువ వికాసం' కింద రూ.5 లక్షల బ్యాంక్ గ్యారెంటీ కార్డు, విద్యార్థినులకు ఉచిత ఎలక్ట్రిక్ స్కూటీల హామీలను గాలికొదిలేశారని ఆరోపించారు. నిరుద్యోగ యువతకు నెలకు రూ.4,000 చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి అమలు చేయలేదని, 33 నెలలకు ఒక్కో నిరుద్యోగికి రూ.1.32 లక్షలు బకాయి పడ్డాయని తెలిపారు. తొలి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి.. ఇప్పటివరకు పరిమిత సంఖ్యలోనే ఉద్యోగ నోటిఫికేషన్లు ఇచ్చారని విమర్శించారు.

### ఉద్యోగుల సమస్యలను పట్టించుకోవడం లేదు

ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్సీ అమలు చేయకుండా, ఆరు డీఏలను పెండింగ్‌లో పెట్టారని ప్రశాంత్‌రెడ్డి ఆరోపించారు. ఉద్యోగులు తమ హక్కుల కోసం ప్రశ్నిస్తే వేధింపులకు గురిచేస్తున్నారని అన్నారు. గృహజ్యోతి కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తామని చెప్పినా, విద్యుత్ వినియోగం పెరిగిన సమయంలో యూనిట్ ధరలు పెంచి ప్రజలపై అదనపు భారం మోపారని విమర్శించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించి, పల్లెవెలుగు బస్సుల సంఖ్య తగ్గించడం ద్వారా గ్రామీణ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారని అన్నారు.

### బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ హామీలపై విమర్శలు

బీసీ డిక్లరేషన్‌లో ఏటా రూ.20 వేల కోట్ల బడ్జెట్, 42 శాతం రిజర్వేషన్లు, సివిల్ కాంట్రాక్టుల్లో వాటా వంటి హామీలు అమలుకు నోచుకోలేదని అన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ప్రోత్సాహకాలు ఇవ్వలేదని, దళితబంధును రద్దు చేసి ప్రత్యామ్నాయ పథకాన్ని కూడా చూపలేదని విమర్శించారు. మైనార్టీ డిక్లరేషన్, ఆటో డ్రైవర్లకు రూ.12 వేల ఆర్థిక సాయం వంటి హామీలన్నీ కాగితాలకే పరిమితమయ్యాయని ఆరోపించారు.

### 'అప్పుల సాకు'తో తప్పించుకుంటున్నారు

గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న అప్పులతో కాళేశ్వరం, మిషన్ భగీరథ, 24 గంటల ఉచిత విద్యుత్, సబ్‌స్టేషన్లు, చెక్‌డ్యాంలు వంటి శాశ్వత ప్రజా ఆస్తులను సృష్టించిందని ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. గత ప్రభుత్వ అప్పుల వివరాలు పూర్తిగా తెలిసే ఎన్నికల సమయంలో కాంగ్రెస్ 420 హామీలు ఇచ్చిందన్నారు. గతంలో భట్టి విక్రమార్క స్వయంగా మౌలిక వసతులు పూర్తయ్యాయని, కొత్త ప్రభుత్వానికి పెద్దగా ప్రాజెక్టుల వ్యయం ఉండదని చెప్పిన వీడియోను సభలో ప్రదర్శించినట్లు తెలిపారు. అధికారంలోకి వచ్చిన తర్వాత అప్పుల సాకుతో హామీల నుంచి తప్పించుకోవడం అవకాశవాద రాజకీయమని విమర్శించారు.

### హామీలు అమలయ్యే వరకు పోరాటం

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు బీఆర్ఎస్ ప్రజల తరఫున రాజీలేని పోరాటం కొనసాగిస్తుందని వేముల ప్రశాంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో చేపట్టనున్న తదుపరి కార్యాచరణను ప్రకటించారు. వేల్పూర్ ఎక్స్‌రోడ్ వద్ద రైతుల సమస్యలపై రైతు సదస్సు, మోర్తాడ్‌లో మహిళల సమస్యలు, పింఛన్లు, మహాలక్ష్మి బకాయిలపై మహిళా సదస్సు, భీమ్‌గల్‌లో విద్యార్థులు, నిరుద్యోగ యువత సమస్యలపై విద్యార్థియువజన సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే సెప్టెంబర్ 6, 7, 8 తేదీల్లో నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో బూత్ కమిటీల ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు పడ్డ బకాయిల వివరాలతో కూడిన 'కాంగ్రెస్ బాకీ కార్డులు' పంపిణీ చేస్తామని చెప్పారు. ఎండ, వాన, పోలీసుల నిర్బంధాలను లెక్కచేయకుండా ప్రజల పక్షాన నిలబడి కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం కొనసాగిస్తామని, హామీలన్నీ అమలు చేసే వరకు వెనక్కి తగ్గేది లేదని వేముల ప్రశాంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, రైతులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టులో ప్రమాదం.. భద్రత గాలిలో!!

**- ఎయిర్‌ఫిల్ ఎయిర్ ట్యాంక్ పేలుడు**

**- ఐదుగురు కార్మికులకు గాయాలు**

**- ప్రమాదంలో ఇద్దరికి వినికిడి సమస్య?**

**- భూగర్భంలో కార్మికుల విధులు**

**- పైకి వస్తున్నది మాత్రం ప్రమాదాల పరంపరేనా?**

**- సేఫ్టీ ప్రోటోకాల్స్ ఎక్కడ?**

**- టార్గెట్లా.. భద్రతా? అని ప్రశ్నిస్తున్న సంఘాలు**



పెద్దపల్లి బ్యూరో చీఫ్, సెప్టెంబర్ 3 (విజన్ ఆంధ్ర): సింగరేణి ప్రతిష్ఠాత్మక అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టులో మరోసారి ప్రమాదం చోటుచేసుకోవడం కలకలం రేపింది. బొగ్గు ఉత్పత్తిలో ఆధునిక సాంకేతికతను వినియోగిస్తున్నామని చెప్పుకుంటున్న యాజమాన్యానికి.. కార్మికుల భద్రత విషయంలో మాత్రం ప్రమాదాలు ప్రశ్నార్థకంగా మారుతున్నాయి. గురువారం రాత్రి ప్రాజెక్టులోని భూగర్భ ప్రాంతంలో ఎయిర్‌ఫిల్ ఎయిర్ ట్యాంక్ పేలడంతో ఐదుగురు కార్మికులు గాయపడటం ఆందోళన కలిగిస్తోంది. విధుల్లో ఉన్న సమయంలో ఒక్కసారిగా పేలుడు సంభవించడంతో కార్మికులు ఉలిక్కిపడ్డారు. గాయపడిన వారిని హుటాహుటిన గోదావరిఖని సింగరేణి ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రమాదంలో ఆపరేటర్ శ్రీనివాస్, ఫిట్టర్ కిరణ్, ఎలక్ట్రిక్ యాక్టింగ్ ఫిట్టర్ మహేష్, హెల్పర్ ప్రశాంత్, మనోజ్ గాయపడినట్లు సమాచారం. వీరిలో ఇద్దరికి పేలుడు ప్రభావంతో వినికిడి సమస్యలు తలెత్తినట్లు తెలుస్తోంది. అదృష్టవశాత్తూ ప్రాణనష్టం జరగకపోయినా.. భూగర్భంలో జరిగిన ఈ ఘటన మరో పెద్ద ప్రమాదం ముంచుకొచ్చే ముందస్తు హెచ్చరికగా కార్మికులు భావిస్తున్నారు.

### సాంకేతికత ఉన్నా.. భద్రత ఎక్కడ?

అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టును సింగరేణి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్వహిస్తున్న ప్రాజెక్టుగా ప్రచారం చేస్తోంది. అయితే వరుస ఘటనలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో అత్యాధునిక యంత్రాలు ఉన్నంత మాత్రాన కార్మికులకు భద్రత లభిస్తుందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఎయిర్ ట్యాంక్ వంటి కీలక పరికరాల నిర్వహణ, నాణ్యత, సాంకేతిక తనిఖీలు, ముందస్తు భద్రతా చర్యలు ఎంతవరకు పకడ్బందీగా అమలు చేస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రమాదం జరిగిన తర్వాత గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించడం కంటే.. ప్రమాదమే జరగకుండా నిరోధించాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉంది అని కార్మిక సంఘాలు, నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

### గత ఘటనలున్నా.. మారని పరిస్థితులా?

అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టులో గతంలోనూ ప్రమాదాలు చోటుచేసుకున్న నేపథ్యంలో తాజా ఘటన మరింత ఆందోళన కలిగిస్తోంది. భూగర్భ గనుల్లో చిన్న నిర్లక్ష్యం కూడా పెద్ద విపత్తుగా మారే అవకాశం ఉన్నప్పటికీ భద్రత విషయంలో ఏదైనా లోపం ఉంటే దాని మూల్యం కార్మికుల ప్రాణాలతో చెల్లించాల్సి వస్తుంది. ఉత్పత్తి లక్ష్యాలు, యంత్రాల సామర్థ్యం, టార్గెట్లు.. ఇవన్నీ కార్మికుల ప్రాణాల తర్వాతే. అందుకే తాజా ప్రమాదంపై కేవలం ప్రాథమిక విచారణతో సరిపెట్టకుండా సమగ్ర దర్యాప్తు జరిపి, ఎయిర్ ట్యాంక్ పేలుడుకు అసలు కారణాలను వెలుగులోకి తీసుకురావాలి.

### ప్రమాదం తర్వాతే మేల్కొంటారా?...కార్మిక సంఘాల ప్రశ్న

ఈ ఘటనతో మరోసారి ఒక కీలక ప్రశ్న ముందుకొస్తోంది.. కార్మికుడి ప్రాణానికి విలువ ప్రమాదం జరిగిన తర్వాతే తెలుస్తుందా? భూగర్భంలో వందల మీటర్ల లోతులో పనిచేసే కార్మికులకు ప్రతి క్షణం భద్రతా భరోసా అవసరం. పరికరాల తనిఖీలు, నిర్వహణ, భద్రతా ప్రోటోకాల్స్, అత్యవసర స్పందన వ్యవస్థలను కఠినంగా సమీక్షించాల్సిన అవసరం ఉంది. అడ్రియాలలో మరో ప్రమాదం జరిగే వరకు ఎదురుచూడకుండా.. ఇప్పుడే లోపాలను గుర్తించి సరిదిద్దాలి. లేదంటే నిన్నటి పేలుడు కేవలం ఒక హెచ్చరికగా మిగలకుండా.. రేపటి పెను ప్రమాదానికి కారణమయ్యే ప్రమాదం లేకపోలేదనే ఆందోళన కార్మిక వర్గాల్లో వ్యక్తమవుతోంది. "బొగ్గు కోసం భూగర్భంలోకి వెళ్తున్న కార్మికుడు.. ప్రాణాలతో బయటకు వస్తాడన్న భరోసా ఎక్కడ?" అనేది కార్మికులను, కార్మిక కుటుంబాలను, సంఘాల నేతలను, ప్రజలను నిత్యం తట్టుతున్న మిలియన్ డాలర్ల ప్రశ్న.

# అక్రమ నిర్మాణాలకు కళ్లెం!

**- దుండిగల్ సర్కిల్‌లో అధికారుల కొరడా**

**- బౌరంపేట్, బహదూర్‌పల్లిలో అనధికార కట్టడాల కూల్చివేత**

**- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవన్న డిప్యూటీ కమిషనర్**

దుండిగల్, సెప్టెంబర్ 3 విజన్ ఆంధ్ర: నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న అక్రమ, అనధికార నిర్మాణాలపై దుండిగల్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు కొరడా ఝుళిపించారు. భవన నిర్మాణ అనుమతులను ఉల్లంఘించి అదనపు అంతస్తులు నిర్మిస్తున్న వారిపై కఠిన చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా బౌరంపేట్, బహదూర్‌పల్లి ప్రాంతాల్లో అనధికార నిర్మాణాలను గుర్తించి కూల్చివేత చర్యలు చేపట్టారు.

### బౌరంపేట్‌లో అదనపు అంతస్తుపై చర్యలు

దుండిగల్ సర్కిల్ పరిధిలోని బౌరంపేట్ వెంకటేశ్వర కాలనీలో భవన నిర్మాణానికి జా+2 అనుమతి తీసుకుని, అందుకు విరుద్ధంగా జా+3 నిర్మాణం చేపట్టినట్లు అధికారులు గుర్తించారు. అనుమతులకు విరుద్ధంగా నిర్మించిన అదనపు భాగంపై అధికారులు కూల్చివేత చర్యలు చేపట్టారు.

### బహదూర్‌పల్లిలోనూ కూల్చివేత

అదేవిధంగా బహదూర్‌పల్లి పరిధిలోని సర్వే నంబర్లు 238, 239లో కేవలం 120 గజాల స్థలంలో ఎలాంటి అనుమతులు లేకుండా జా+3 నిర్మాణం చేపట్టినట్లు అధికారులు గుర్తించారు.



నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భాగాలపై అధికారులు కూల్చివేత చర్యలు చేపట్టారు.

### అక్రమ నిర్మాణాలను ఉపేక్షించం

ఈ సందర్భంగా దుండిగల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్. వెంకట మణికరణ్ మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా చేపట్టే ఎలాంటి నిర్మాణాన్నీ ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. భవన నిర్మాణానికి అనుమతులు తీసుకున్న తర్వాత వాటికి విరుద్ధంగా అదనపు అంతస్తులు నిర్మించడం, అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టడం వంటి చర్యలపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.

### నిఘా మరింత తీవ్రతరం

దుండిగల్ సర్కిల్ పరిధిలో తక్కువ విస్తీర్ణం ఉన్న స్థలాల్లో అనుమతులు లేకుండా చేపడుతున్న నిర్మాణాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు డిప్యూటీ కమిషనర్ తెలిపారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్న వారితో పాటు, ఒక విధమైన అనుమతులు తీసుకుని అనంతరం అదనపు నిర్మాణాలు చేపడుతున్న వారినీ గుర్తిస్తున్నట్లు పేర్కొన్నారు.

### ఉల్లంఘనలకు చెక్

భవన నిర్మాణ అనుమతులు, నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని అధికారులు సూచించారు. అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే వాటిని గుర్తించి నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

### కూల్చివేతలు కొనసాగుతాయి

దుండిగల్ సర్కిల్ పరిధిలో అనధికార నిర్మాణాలపై తనిఖీలు, నిఘా కొనసాగుతాయని డిప్యూటీ కమిషనర్ తెలిపారు. నిబంధనలను ఉల్లంఘించిన నిర్మాణాలను గుర్తించి, చట్టపరమైన నిబంధనల మేరకు కూల్చివేత చర్యలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కూల్చివేతల కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీనివాస్, టీపీఎస్ ముఖేష్ సింగ్తో పాటు టౌన్‌ప్లానింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# స్వస్తిక్ కాన్సెప్ట్ స్కూల్ లో ఘనంగా శ్రీకృష్ణ జయంతి వేడుకలు.



మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 3 (విజన్ ఆంధ్ర): మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని బైపాస్ రోడ్ లో ఉన్న స్వస్తిక్ కాన్సెప్ట్ స్కూల్ లో విద్యార్థిని విద్యార్థుల ఆనందోత్సవాల మధ్య శ్రీకృష్ణ గోపిక వేశాధారణలో అలరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ శ్రీ కే. చంద్రమౌళి మాట్లాడుతూ ఈ రోజు మనం అందరం ఎంతో ఆనందంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను జరుపుకుంటున్నాము. శ్రీకృష్ణుడు భగవంతుడిగా మాత్రమే కాకుండా, ఒక గొప్ప గురువుగా, స్నేహితుడిగా, మార్గదర్శిగా మనందరికీ ఆదర్శప్రాయుడు. శ్రీకృష్ణుడు మనకు ధర్మం, సత్యం, ప్రేమ, స్నేహం మరియు కర్తవ్యబద్ధత గురించి ఎన్నో గొప్ప విషయాలను బోధించాడు. ముఖ్యంగా భగవద్గీతలో ఆయన చెప్పిన "కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన" అనే సందేశం మన జీవితానికి ఎంతో విలువైనది. ఫలితం గురించి ఆలోచించకుండా మన కర్తవ్యాన్ని మనం నిజాయితీగా చేయాలని శ్రీకృష్ణుడు మనకు బోధించాడు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీ దాసరి మధు మాట్లాడుతూ చిన్ననాటి కృష్ణుడి అల్లరి, వెన్న దొంగతనం, గోపికలతో ఆయన స్నేహం, గోవర్ధనగిరిని ఎత్తిన ఘట్టం పిల్లలందరికీ ఎంతో ఇష్టమైనవి. అయితే ఆ కథల వెనుక ఉన్న ప్రేమ, ధైర్యం, తెలివితేటలు మరియు మంచితనం అనే విలువలను మనం జీవితంలో ఆచరించాలి. నా ప్రియమైన విద్యార్థులారా, మీరు శ్రీకృష్ణుడి నుండి ఎల్లప్పుడూ నిజం మాట్లాడటం, ఇతరులను ప్రేమించడం, కష్టాల్లో ధైర్యంగా ఉండటం, మీ బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తించడం నేర్చుకోవాలి. ఈ పవిత్రమైన రోజున ప్రతి ఒక్కరి జీవితంలో శ్రీకృష్ణుడి ఆశీస్సులు ఉండాలని, మీ అందరికీ మంచి ఆరోగ్యం, జ్ఞానం, ఆనందం మరియు విజయాలు కలగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. "ధర్మాన్ని పాటిద్దాం సత్యాన్ని ఆచరిద్దాం శ్రీకృష్ణుని బోధనలను మన జీవితంలో అనుసరిద్దాం." ఈ కార్యక్రమం లో పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, తల్లి దండ్రులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొని కార్యక్రమం విజయవంతం చేశారు.

## హరిత సాంకేతికతతోనే చిన్న పరిశ్రమలకు లాభాలు

**- రిచ్ సంస్థ యోజన నిర్వాహకుడు చరణ్ ఉప్పరపల్లి**





ములుగు, సెప్టెంబర్ 03, విజన్ ఆంధ్ర ప్రతినిధి; చిన్న, మధ్యతరహా పరిశ్రమలు హరిత సాంకేతికతను అందిపుచ్చుకుంటేనే ఉత్పత్తి ఖర్చులు తగ్గి లాభాలు పెరుగుతాయని రిచ్ సంస్థ యోజన నిర్వాహకుడు చరణ్ ఉప్పరపల్లి అన్నారు. ములుగు రైస్ మిల్లుదారుల సంఘం సహకారంతో రిచ్ సంస్థ ఆధ్వర్యంలో చిన్న పరిశ్రమల పచ్చదనం కార్యక్రమంపై మంగళవారం జిల్లా కేంద్రంలోని రైస్ మిల్ ఆఫీస్ సమావేశ గదిలో జరిగిన అవగాహన సదస్సులో చరణ్ ఉప్పరపల్లి మాట్లాడుతూ.. "ఇంధన సామర్థ్యం, వనరుల పొదుపు, సౌర విద్యుత్ వంటి హరిత సాంకేతికతలను వాడటం వల్ల కరెంటు బిల్లులు, నిర్వహణ ఖర్చులు 30 నుండి 40 శాతం తగ్గుతాయి. పచ్చదనం వైపు వెళ్లడం అంటే పర్యావరణాన్ని కాపాడటమే కాదు, వ్యాపారాన్ని భవిష్యత్తుకు సిద్ధం చేయడం. ప్రపంచ మార్కెట్లో పోటీగా నిలవాలంటే ప్రతి చిన్న పరిశ్రమ ఈ మార్పును తప్పనిసరిగా చేసుకోవాలి" అని వివరించారు. జిల్లా రైస్ మిల్లుదారుల సంఘం అధ్యక్షులు బాదం ప్రవీణ్ మాట్లాడుతూ "ములుగు జిల్లాలో రైస్ మిల్లులకు విద్యుత్ ఖర్చు పెద్ద భారంగా మారింది. రిచ్చు సంస్థ నిర్వాహకుడు చరణ్ చెప్పినట్లుగా ప్రతి మిల్లు సౌర విద్యుత్, ఇంధన పొదుపు యంత్రాలను వాడితే ఖర్చులు తగ్గి స్థిరమైన లాభాలు వస్తాయి. మన సంఘం తరపున ఈ హరిత మార్పుకు అవసరమైన అన్ని విధాలా సహకరిస్తాం" అని తెలిపారు. జిల్లా పరిశ్రమల కేంద్రం ప్రధాన నిర్వాహకుడు సిద్ధార్థ రెడ్డి మాట్లాడుతూ . కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న రాయితీ పథకాలను పారిశ్రామికవేత్తలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు రైస్ మిల్లర్ల యజమానులు, చిన్న పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

## బీజేపీలో చేరిన దేవ నగర్ యువకులు

**- కాంగ్రెస్ పాలనపై జిల్లా అధ్యక్షులు బలరాం విమర్శలు**



మల్లంపల్లి, సెప్టెంబర్ 03 (విజన్ ఆంధ్ర): మల్లంపల్లి మండల అధ్యక్షులు బైకాని మహేందర్ యాదవ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో దేవ నగర్ గ్రామానికి చెందిన పదిమంది యువకులు భారతీయ జనతా పార్టీలో చేరారు. మండల ఉపాధ్యక్షులు గూడెల్లి కొమురెల్లి ఆధ్వర్యంలో ఈ చేరికలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన జిల్లా అధ్యక్షులు సిరికొండ బలరాం, మండల ఇంచార్జి కృష్ణాకర్ రావు కొత్తగా చేరిన యువకులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిరికొండ బలరాం మాట్లాడుతూ...లి "కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు ఒక్కటీ నెరవేర్చకుండా వెయ్యి రోజుల ప్రజా పాలన పేరుతో రాష్ట్ర బడ్జెట్ను స్కామ్ చేస్తోందని మండిపడ్డారు. అనంతరం దేవ నగర్ గ్రామ బూత్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా బొమ్మర వేణి అజయ్, ఉపాధ్యక్షునిగా రాచర్ల వరుణ్, ప్రధాన కార్యదర్శిగా ముక్కామల రంజిత్ లను నియమించారు. పార్టీలో చేరిన వారిలో గాదర వేన రజనీకాంత్, ఉప్పు చారి దండిగా శ్రీధర్, గూడెల్లి హరీష్ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నగరపు రమేష్, జిల్లా కోశాధికారి గంగిశెట్టి రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

### 22ఏ నుండి నిషేధిత భూముల జాబితాను తొలగించాలని బిజెపి మహాధర్నా




మంచిర్యాల టౌన్ సెప్టెంబర్ 3 (విజన్ ఆంధ్ర) కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల భూములను దోపిడీ చేయడానికి తీసుకువచ్చిన 22ఏ నిషేదిత భూముల జాబితాను రద్దు చేయాలని మరియు దీనికి బాధ్యత వహిస్తూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తు బీజేపీ ఆధ్వర్యంలో మంచిర్యాల ఆర్డీవో కార్యాలయం ఎదుట 22ఏ బాధిత ప్రజలతో కలిసి నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి మరియు బీజేపీ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ పాల్గొన్నారు. గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం ధరణి పోర్టల్ పేరుతో పేద ప్రజల భూములు దోచుకుంటే ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం భూ భారతి పేరుతో జీవో 22ఏ తో పేదల నివాస మరియు వ్యవసాయ భూములు దోచుకోవడాని కాంగ్రెస్ ప్రభుత్వం ఈ జీవో తీసుకవచ్చిందని రఘునాథ్ గారు అన్నారు. 22ఏ లో ఉన్న అర్హులైన పేదల భూములను తొలగించి 22ఏ జీవో ని పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దేనికి బాధ్యత వహిస్తూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు అనంతరం ఆర్డీవో కార్యాలయం ఏవో 22 ఏ లో పేదల భూములు తొలగించాలని మెమోరాండం అందజేశారు ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ బిజెపి రోడ్ లీడర్ ముఖేష్ గౌడ్ బిజెపి నాయకులు కార్యకర్తలు బాదిత ప్రజలు పాల్గొన్నారు.

# ములుగు జిల్లాలో మీసేవ, ఆధార్ సెంటర్లలో వరుస తనిఖీలు

**- అధిక రుసుము వసూలు చేస్తే చర్యలు తప్పవు**

**- ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ దేవేందర్**







ములుగు, సెప్టెంబర్ 03 (విజన్ ఆంధ్ర): ములుగు జిల్లాలోని మీసేవ, ఆధార్ కేంద్రాల్లో అధిక రుసుము వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ దేవేందర్ హెచ్చరించారు. బుధవారం గోవిందరావుపేట, వెంకటాపూర్ మండలాల్లోని మీసేవ, ఆధార్ కేంద్రాలను ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ దేవేందర్, జిల్లా మేనేజర్ పోలోజు విజయ్ లతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. గోవిందరావుపేట మండలంలోని పస్రా, గోవిందరావుపేట, చల్వాయి మరియు వెంకటాపూర్ మండలంలోని పాలంపేట, కేశవాపూర్, నర్సాపూర్, వెంకటాపూర్ గ్రామాల్లోని కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా దేవేందర్ మాట్లాడుతూ "దరఖాస్తుదారుల నుండి ప్రభుత్వం నిర్ణయించిన రేటు చార్ట్ ప్రకారమే రుసుము తీసుకోవాలి. అధిక రుసుము వసూలు చేసినా, దరఖాస్తుదారులతో దురుసుగా ప్రవర్తించినా సంబంధిత సెంటర్ పై కఠిన చర్యలు తీసుకుంటాం. మీసేవ కేంద్రాలు ఎప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలి. ఈఎస్డీ మార్గదర్శకాల ప్రకారం నడపాలి" అని సూచించారు. ప్రతి కేంద్రంలో తప్పనిసరిగా పౌర హక్కుల పత్రం, భూ భారతికి సంబంధించిన ఫ్లెక్సీలు, మీసేవ లోగో, తహసీల్దార్, ఈడీఎం, పరిష్కారం కాల్ సెంటర్ల ఫోన్ నంబర్లు ప్రదర్శించాలని ఆదేశించారు. కళ్యాణ లక్ష్మి, యూడీఐడీ (సదరం), జనన, మరణ ధృవీకరణ పత్రాలను ఎలాంటి తప్పులు లేకుండా నమోదు చేయాలని, నిర్వాహకులు ప్రజల పట్ల సున్నితంగా వ్యవహరించాలని తెలిపారు.

**జీపీవో, ఆర్ఐలకు ప్రత్యేక మీసేవ మొబైల్ యాప్**

ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఉండేందుకు గ్రామ పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లకు ప్రత్యేక మీసేవ మొబైల్ యాప్ అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో మీసేవ, ఆధార్ కేంద్రాల నిర్వాహకులు పాల్గొన్నారు.

# ములుగులో కన్నుల పండువగా బాలగోకులం

**- చౌరస్తాలో అలరించిన శోభాయాత్ర**



ములుగు, సెప్టెంబర్ 03 (విజన్ ఆంధ్ర ప్రతినిధి): శ్రీకృష్ణ జన్మాష్టమి పురస్కరించుకొని ములుగు జిల్లా కేంద్రంలోని లీలా గార్డెన్‌లో బాలగోకులం వేడుకలు కన్నుల పండువగా జరిగాయి. ధర్మ జాగరణ సమితి కన్వీనర్ గంధ్ర కోట కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు 15 పాఠశాలల నుండి 1500 మంది విద్యార్థులు కృష్ణుడు, గోపికల వేషధారణలో పాల్గొని చౌరస్తాలో శోభాయాత్ర నిర్వహించారు. చిన్నారుల వేషధారణతో ములుగు పట్టణం బృందావనంలా మారింది.ములుగు డీఎస్పీ రవీందర్ మాట్లాడుతూ..."బాలల్లో ఇలాంటి సాంస్కృతిక స్ఫూర్తిని నింపడం చాలా గొప్ప విషయం. శ్రీకృష్ణుడు ధర్మానికి, న్యాయానికి, స్నేహానికి ప్రతీక. చిన్ననాటి నుండే పిల్లలకు మన సంస్కృతి, సంప్రదాయాల విలువలు తెలియజేయడం వల్ల భవిష్యత్తులో వారు మంచి పౌరులుగా ఎదుగుతారు. 26 సంవత్సరాలుగా ఎంతో క్రమశిక్షణతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ధర్మ జాగరణ సమితికి నా అభినందనలు" అని అన్నారు. మున్సిపల్ కమిషనర్ జే. సంపత్ మాట్లాడుతూ... "ములుగు పట్టణంలో ఇంత పెద్ద ఎత్తున బాలగోకులం జరగడం ఆనందంగా ఉంది. పట్టణం మొత్తం బృందావనంలా మారింది. పిల్లలు వేసిన ప్రతి వేషంలో భక్తి, సంప్రదాయం కనిపించింది. ఇలాంటి కార్యక్రమాలు పిల్లల్లో దేశభక్తిని, ధర్మం పట్ల అవగాహనను పెంచుతాయి. ఈ వేడుకకు సహకరించిన ప్రతి పాఠశాల యాజమాన్యానికి, తల్లిదండ్రులకు ధన్యవాదాలు. లహరి గ్రూప్ వారు విద్యార్థులకు బహుమతులు ఇవ్వడం అభినందనీయం. మధు ఫోటో స్టూడియో వారు ఉచిత ఫోటోగ్రఫీ అందించడం గొప్ప విషయం" అని అన్నారు. విశిష్ట అతిథి ఆర్ఎస్ఎస్ ప్రచారక్ విగ్నేష్ మాట్లాడుతూ..."ధర్మ జాగరణ అంటే కేవలం ఒక కార్యక్రమం కాదు, అది మన సంస్కృతిని మేల్కొలపడం. శ్రీకృష్ణుడు భగవద్గీత ద్వారా ఇచ్చిన సందేశం నేటికీ ప్రతి భారతీయునికి దిక్సూచి. బాల్యంలోనే పిల్లలకు గీతలోని ధర్మ సూక్ష్మాన్ని పరిచయం చేయాలి. 26 ఏళ్లుగా ఆగకుండా ఈ బాలగోకులాన్ని నిర్వహించడం ములుగు గడ్డ గొప్పతనం. ఇది ములుగు సంస్కృతికి నిదర్శనం. పిల్లలే మన దేశానికి భవిష్యత్తు, వారిలోనే కృష్ణుడిని చూడాలి" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ శానిటేషన్ ఇన్స్పెక్టర్ తాళ్ల ఉదయ్ కుమార్, ముక్కు సుబ్బారెడ్డి, మేడుదుల మమన్, కుసుమ రాజు, నూనె బిక్షపతి, యాద సంపత్, రాయించూ నాగరాజు, పాఠశాలల కరస్పాండెంట్లు ముద్దం సంతోష్, తుమ్మ పిచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక అవసరాల పిల్లల్లో అపార ప్రతిభ

**- వారిని ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరిపై ఉంది**

**- అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్**







వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 3 (విజన్ ఆంధ్ర) : ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల్లో (సిడబ్ల్యూఎస్ఎన్) అపారమైన జ్ఞానం, ప్రతిభ దాగి ఉన్నాయని, వారిలోని సృజనాత్మకతను గుర్తించి ప్రోత్సహించాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజంపై ఉందని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్ పేర్కొన్నారు. గురువారం వనపర్తి పట్టణంలోని ఎస్ఎల్వీ గ్రాండ్‌లో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో 'భవిత' కేంద్రాల ద్వారా శిక్షణ పొందుతున్న పిల్లల తల్లిదండ్రులు, సంరక్షకులకు నిర్వహించిన జిల్లా స్థాయి అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలకు సేవ చేసే అవకాశం లభించడం అదృష్టమని, తల్లిదండ్రులు తమ పిల్లలను చూసి గర్వపడాలని సూచించారు. ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, నెలకు రూ.4,000 పింఛను ఇవ్వడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రత్యేక రిజర్వేషన్లు కల్పిస్తోందని తెలిపారు. భవిత కేంద్రాలు, ఐఆర్‌పీల (ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్స్) ద్వారా పిల్లలకు నిరంతరం శిక్షణ, ప్రోత్సాహం అందిస్తున్నామని చెప్పారు.

ఈ నెల 16 వరకు పింఛన్ల దరఖాస్తుకు అవకాశం

దివ్యాంగుల పింఛన్ల కోసం ప్రభుత్వం ప్రస్తుతం దరఖాస్తులు స్వీకరిస్తోందని, అర్హత కలిగిన వారు ఈ నెల 16వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని అదనపు కలెక్టర్ కోరారు. సదస్సులో భాగంగా పిల్లలు ప్రదర్శించిన వివిధ ప్రతిభా పాటవాలు, సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. చిన్నారుల సృజనాత్మకతను అధికారులు, తల్లిదండ్రులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య, విద్యాశాఖ అధికారులు, భవిత కేంద్రాల సిబ్బంది, ఐఆర్‌పీలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ హియరింగ్ పారదర్శకంగా నిర్వహించాలి

**- అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్**



వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 3 (విజన్ ఆంధ్ర) : అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రధాన లక్ష్యమని, ఈ ప్రక్రియను నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం వనపర్తి మున్సిపల్ కార్యాలయంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ హియరింగ్ ప్రక్రియను ఆయన క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హియరింగ్‌కు హాజరైన ఓటర్లు, దరఖాస్తుదారుల వివరాలను పరిశీలించి, సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అర్హత ఉన్న ఏ ఒక్క ఓటరు పేరు కూడా ఓటర్ల జాబితా నుంచి తొలగించబడకుండా అధికారులు తగిన జాగ్రత్తలు వహించాలి. నోటీసులు అందుకున్న ఓటర్లు సమర్పించిన ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి, వాస్తవాల ఆధారంగా నిబంధనల ప్రకారం నిర్ణయం తీసుకోవాలి. ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా నిష్పక్షపాతంగా వ్యవహరిస్తూ, పెండింగ్‌లో ఉన్న హియరింగ్‌లను త్వరితగతిన పూర్తి చేయాలి. ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజలకు ఎలాంటి అనుమానాలు ఉన్నా సంబంధిత అధికారులు లేదా బీఎల్ఓ (బూత్)లను సంప్రదించి నివృత్తి చేసుకోవాలి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, రెవెన్యూ అధికారులు, సంబంధిత బీఎల్ఓలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## 22-ఏ నిషేధిత జాబితా లోని బాధితులకు న్యాయం చేస్తా

**- మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి**



అల్వాల్, సెప్టెంబర్ 3,(విజన్ ఆంధ్ర): అల్వాల్ సర్కిల్ పరిధిలోని పలు కాలనీలలో ఉన్న 22-ఏ నిషేధిత జాబితాలోని బాధితులకు బీఆర్ ఎస్ పార్టీ అండగా ఉంటుందనిఅల్వాల్ మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి హమీనిచ్చారు. గురువారం 192, 193 డివిజన్ లలో కాలనీలలో 22ఏ నిషేధిత జాబితాలో ఉన్న బాధితులకు ఆమె అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 22 ఏ నిషేధిత జాబితాలో సంబంధించిన స్థిరాస్తులు ఉండటంతో జాబితా నుండి ఆ కాలనీలను తొలగించాలని, అమ్మడం కొనడం వంటి రిజిస్ట్రేషన్ల విషయంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందుల పరిష్కారంపై ఆమె అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ బాధితులకు తగిన న్యాయం జరిగేలా అన్ని విధాలుగా కృషి చేస్తానని తెలిపారు. నిషేధిత జాబితా నుంచి మీ కాలనీలను తొలగిం చేందుకు ప్రభుత్వంపై బీఆర్ ఎస్ పార్టీ తరుపున ఒత్తిడి తీసుకువచ్చి, బాధితులకు న్యాయం జరిగేలా అన్ని విధాలుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వేణు గోపాల్ నగర్ కాలనీ, ఎగ్జిక్యూటివ్ కాలనీల ప్రజలు సాహూ, సరిత, మధుసూదన్ రావు, బీ ఆర్ ఎస్ నాయకులు శ్రీధర్ గౌడ్, సురేష్, చరణ్ గిరి, యాదగిరి గౌడ్, హనుమంతు, బి ఆర్ ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు

# కాంగ్రెస్ 1000 రోజుల పాలనలో ప్రజలకు నయవంచన

**- 22ఏ నిషేధిత జాబితా పేరుతో ప్రైవేట్ భూముల యజమానులకు ఇబ్బందులు**

**- రైతు భరోసా, రైతు బీమా, ఉచిత విద్యుత్‌ను నిర్వీర్యం చేస్తున్నారు**

**- మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల**




నిజామాబాద్, సెప్టెంబర్ 3 (విజన్ ఆంధ్ర): కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి అన్ని వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల తీవ్రంగా విమర్శించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలోని వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టేందుకు నిర్వహించిన నిరసన, ధర్నా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

22ఏ జాబితాతో భూ యజమానులకు అవస్థలు

రాష్ట్రంలో ప్రజల ఆస్తులు, భూములకు రక్షణ లేకుండా పోయిందని గణేష్ బిగాల ఆరోపించారు. ముఖ్యంగా 22ఏ నిషేధిత జాబితాలో ప్రైవేట్ భూములు చేరడంతో రైతులు, భూ యజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. భూములు 22ఏ జాబితాలో చేరడంతో వాటిని విక్రయించడం, కొనుగోలు చేయడం, బ్యాంకుల్లో తాకట్టు పెట్టడం వంటి లావాదేవీలు నిలిచిపోతున్నాయని తెలిపారు. 1908 రిజిస్ట్రేషన్ చట్టం ప్రకారం ప్రభుత్వ, దేవాదాయ, వక్ఫ్ తదితర రక్షించాల్సిన భూములను నిషేధిత జాబితాలో ఉంచే ఉద్దేశం ఉన్నప్పటికీ, ప్రైవేట్ వ్యక్తుల భూములను కూడా అందులో చేర్చడం అన్యాయమని పేర్కొన్నారు. 2026 ఫిబ్రవరిలో లక్షల ఎకరాల భూములను 22ఏ జాబితాలో చేర్చిన సమయంలో అవసరమైన భూములతో పాటు అనేక ప్రైవేట్ భూములు కూడా జాబితాలో చేరాయని ఆరోపించారు. అధికారుల తప్పిదాలకు ప్రజలను బాధ్యులను చేసి, తమ భూములను 22ఏ నుంచి తొలగించుకునేందుకు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి కల్పించడం సరికాదన్నారు. మంత్రి హోదాలో ఉన్న వ్యక్తుల ఇళ్లు, భూములు కూడా 22ఏ జాబితాలో చేరాయని వార్తలు రావడం రాష్ట్రంలోని భూ రికార్డుల పరిస్థితికి అద్దం పడుతోందని అన్నారు.

**బోధన్‌లో 40 శాతం భూములు 22ఏలోకి?**

బోధన్ పట్టణంలో దాదాపు 40 శాతం భూములను 22ఏ నిషేధిత జాబితాలో చేర్చడం వల్ల ప్రజలు తమ భూములను అమ్ముకోలేక, కొనుగోలు చేయలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గణేష్ బిగాల తెలిపారు. భూమి అనేది సామాన్య ప్రజల జీవితకాల సంపాదన అని, అలాంటి ఆస్తుల విషయంలో ప్రభుత్వం స్పష్టత లేకుండా వ్యవహరించడం వల్ల వేలాది కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. కంటేశ్వర్ ఆలయ భూముల విషయంలో ఏం జరుగుతోందని, అసైన్డ్ భూముల పరిస్థితి ఏమిటని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గూపన్‌పల్లిలోని వక్ఫ్ భూములను 22ఏ జాబితాలో ఎందుకు చేర్చలేదో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రక్షించాల్సిన భూములను వదిలిపెట్టి, ఏళ్ల తరబడి ప్రజలు అనుభవిస్తున్న ప్రైవేట్ భూములను నిషేధిత జాబితాలో చేర్చడం వెనుక ఉద్దేశం ఏమిటో వెల్లడించాలని కోరారు.

**కేసీఆర్ హయాంలో రైతులకు అండ**

బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో రైతుల సంక్షేమానికి అనేక పథకాలను అమలు చేసిందని గణేష్ బిగాల గుర్తుచేశారు. రైతులకు పెట్టుబడి సాయం, ఉచిత విద్యుత్, రైతు బీమా, రైతు భరోసాతో పాటు 'యంత్ర లక్ష్మి' ద్వారా వ్యవసాయ యంత్రాలను అందించి రైతులకు అండగా నిలిచిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదని అన్నారు. రైతుకు ప్రమాదం జరిగినప్పుడు ఆ కుటుంబం రోడ్డున పడకూడదనే ఉద్దేశంతో రైతు బీమా ద్వారా ఆర్థిక భరోసా కల్పించామని తెలిపారు. వ్యవసాయంలో యాంత్రీకరణను ప్రోత్సహించేందుకు ఆధునిక వ్యవసాయ పరికరాలను అందించామని పేర్కొన్నారు.

**తెలంగాణ రైతాంగాన్ని బలోపేతం చేసింది బీఆర్ఎస్: గణేష్ బిగాల**


కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ తెలంగాణ రైతాంగాన్ని దేశానికి అన్నం పెట్టే స్థాయికి తీసుకెళ్లామని గణేష్ బిగాల అన్నారు. సాగు విస్తీర్ణం, వరి ఉత్పత్తి గణనీయంగా పెరిగి దేశ ఆహార భద్రతలో తెలంగాణ రైతులు కీలక పాత్ర పోషించారని తెలిపారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అందాల్సిన రైతు భరోసా, రైతు బీమా, ఉచిత విద్యుత్ వంటి సంక్షేమ పథకాల అమలులో నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. ఎరువుల విషయంలోనూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. హైడ్రా పేరుతో కూల్చివేతల భయాన్ని సృష్టించి ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నారని అన్నారు.

**'బీఆర్ఎస్ ఎక్కడ?' అన్నవారికి ధర్నానే సమాధానం**

'బీఆర్ఎస్ పార్టీ ఎక్కడ ఉంది?' అని ప్రశ్నించే వారికి ధర్నా కార్యక్రమానికి తరలివచ్చిన ప్రజలు, నాయకులు, కార్యకర్తలను చూస్తే సమాధానం తెలుస్తుందని గణేష్ బిగాల అన్నారు. బీఆర్ఎస్ పార్టీని ఎవరూ బలహీనపరచలేరని, తెలంగాణ ప్రజల హక్కుల కోసం పార్టీ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని తెలిపారు. 22ఏ నిషేధిత జాబితా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించి, ప్రైవేట్ భూముల యజమానులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ దండు నీతూ కిరణ్ శేఖర్, నగర అధ్యక్షుడు సిర్ప రాజు, మాజీ నుడా చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, నాగారం నర్సింగ్, సుజిత్ సింగ్,

# భద్రాద్రికి రైలుబాట.. అభివృద్ధికి తొలి అడుగు

**- పాండురంగాపురంసాకేతపురి మధ్య**
**16 కి.మీ. రైల్వే లైన్‌కు కేంద్రం సానుకూల స్పందన**




కొత్తగూడెం బ్యూరో, సెప్టెంబర్ 04(విజన్ ఆంధ్ర) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రైల్వే కనెక్టివిటీకి కీలక ముందడుగు పడింది. పాండురంగాపురంమల్కన్‌గిరి రైల్వే లైన్‌లో భాగంగా పాండురంగాపురం నుంచి సాకేతపురి (సారపాక) వరకు సుమారు 16 కిలోమీటర్ల రైల్వే లైన్ పనులను ముందుగా చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కోరారు. మంత్రి విజ్ఞప్తిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించి పనులను వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని రైల్వే అధికారులను ఆదేశించారు. పూర్తి పాండురంగాపురంమల్కన్‌గిరి రైల్వే ప్రాజెక్టుకు భూసేకరణ, అటవీశాఖ అనుమతులు, గోదావరి వంతెనతో పాటు ఇతర వంతెనల నిర్మాణం వంటి అంశాలు అవరోధంగా ఉన్నాయని మంత్రి తుమ్మల కేంద్ర మంత్రికి వివరించారు. పూర్తి ప్రాజెక్టుకు మరింత సమయం పట్టే అవకాశం ఉన్నందున, ఎలాంటి పెద్ద అవరోధాలు లేని పాండురంగాపురంసాకేతపురి మార్గంలో పనులను ముందుగా చేపట్టాలని కోరారు. ఈ మార్గానికి అవసరమైన భూసేకరణను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టి, భూమిని రైల్వే శాఖకు అప్పగించేందుకు సిద్ధంగా ఉందని మంత్రి తెలిపారు. సాకేతపురి వరకు రైల్వే సౌకర్యం అందుబాటులోకి వస్తే భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయానికి వచ్చే భక్తులు, పర్యాటకులకు రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి. దీంతో ఆధ్యాత్మిక పర్యాటకంతో పాటు స్థానికంగా వ్యాపారం, ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉంది. అదేవిధంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పారిశ్రామిక సంస్థలకు రైల్వే కనెక్టివిటీ రవాణా పరంగా ప్రయోజనకరంగా మారనుంది. ముడిసరుకు, ఉత్పత్తుల రవాణా సులభతరం కావడంతో పారిశ్రామిక అభివృద్ధికి ఊతం లభిస్తుందని అధికారులు, ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. సాకేతపురి వరకు 16 కిలోమీటర్ల రైల్వే లైన్ పనులకు కేంద్రం సానుకూలంగా స్పందించడం భద్రాద్రి ప్రాంత అభివృద్ధికి కీలక మలుపుగా నిలవనుంది.

## ఈనెల 6న సంకల్ప సభను విజయవంతం చేయండి

**- తెలంగాణ రాష్ట్ర స్పౌజ్ ఫోరం అధ్యక్షుడు ఎస్.వివేక్ పిలుపు**



హైదరాబాద్, సెప్టెంబర్ 03 (విజన్ ఆంధ్ర) : పీఆర్సీ సాధన, 6 డీఏల మంజూరు, పెండింగ్‌లో ఉన్న స్పౌజ్ బదిలీలను పూర్తి చేయడం, కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్(సీపీఎస్)ను రద్దు చేయాలనే డిమాండ్ల సాధన కోసం టీజీఈ జేఏసీ(లచ్చిరెడ్డి) ఆధ్వర్యంలో సెప్టెంబర్ 6న సంకల్ప సభ నిర్వహించనున్నట్లు తెలంగాణ రాష్ట్ర స్పౌజ్ ఫోరం అధ్యక్షుడు ఎస్.వివేక్ తెలిపారు. హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు ఈ సభ జరుగుతుందని పేర్కొన్నారు. స్పౌజ్ దంపతులు, ఉద్యోగ–ఉపాధ్యాయ దంపతులు తమ కుటుంబ సభ్యులతో కలిసి పెద్ద సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా కదిలి సంకల్ప సభకు హాజరై విజయవంతం చేయాలని వివేక్ కోరారు. 'మన హక్కుల కోసం మనమంతా ఒక్కటిగా' అనే నినాదంతో సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## ప్రత్యేక అవసరాల పిల్లలకు ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలి




కొత్తగూడెం బ్యూరో , సెప్టెంబర్ 3(విజన్ ఆంధ్ర) : ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ప్రభుత్వం అందిస్తున్న విద్యా అవకాశాలు, పునరావాస సేవలు, సంక్షేమ పథకాలను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి డి. వాసంతి సూచించారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో గురువారం ఆనందఖని జెడ్పీహెచ్‌ఎస్‌లో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల తల్లిదండ్రులు, సంబంధిత సిబ్బందికి ఒకరోజు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ వాసంతి మాట్లాడుతూ.. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల కోసం జిల్లాలో అందుబాటులో ఉన్న ఫిజియోథెరపీ సేవలు, భవిత కేంద్రాల సేవలు, నిర్మాణంలో ఉన్న భవిత కేంద్రాల వివరాలను వెల్లడించారు. సదరం సర్టిఫికెట్ పొందే విధానం, దాని ద్వారా లభించే ప్రభుత్వ ప్రయోజనాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. మండల స్థాయిలో అందుబాటులో ఉన్న ఐఈఆర్‌పీలు, ప్రత్యేక ఉపాధ్యాయులు, ఎంఐఎస్‌లు, సీసీఓలు, సీఆర్‌పీలు, ఫిజియోథెరపిస్టుల సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పిల్లల విద్యాభివృద్ధి, సమగ్ర వికాసం కోసం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రత్యేక ఉపాధ్యాయులు, సంబంధిత శాఖల సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని డీఈఓ తెలిపారు. పిల్లల అవసరాలను గుర్తించి విద్యా, వైద్య, పునరావాస, సంక్షేమ సేవలు అందించేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఎంఓ తుమ్మలపల్లి రామారావు, డిస్ట్రిక్ట్ ప్లానింగ్ కోఆర్డినేటర్ సతీష్, మండల విద్యాశాఖ అధికారి మధురవాణి, ఆనందఖని జెడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి, డీఆర్‌డీఏ డీపీఓ నర్మద తదితరులు పాల్గొన్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల తల్లిదండ్రులు, స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లు, ఐఈఆర్‌పీలు, ఎంఐఎస్‌లు, సీసీఓలు, సీఆర్‌పీలు, ఫిజియోథెరపిస్టులు కలిపి సుమారు 550 మంది పాల్గొన్నారు.

## నేడు రాధికా చౌరస్తాలో వంట వార్పు



కాప్రా/సెప్టెంబర్–03(విజన్ ఆంధ్ర ప్రతినిధి) : వెయ్యి రోజుల కాంగ్రెస్ వైఫల్యాల పాలనను నిరసిస్తూ బి.ఆర్.ఎస్. చేపట్టిన ఆందోళన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నాడు రాధికా చౌరస్తాలో వంటావార్పు కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు బి.ఆర్.ఎస్. డాక్టర్.ఏ.ఎస్ రావునగర్ డివిజన్ సీనియర్ నాయకులు కాసం మహిపాల్ రెడ్డి తెలిపారు. వంటావార్పు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి డాక్టర్ ఏ.ఎస్ రావు నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీష సోమశేఖర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు తదితరులు హాజరవుతారని తెలిపారు.




# మున్సిపాలిటీలో 'హుకుం' ఎవరిది..?

**- చైర్‌పర్సన్ భర్తకు అధికారమేంటి..?**
**- ఉద్యోగిపై పెత్తనం ఎందుకు..?**
**- మున్సిపాలిటీలో చట్టబద్ధమైన అధికార వ్యవస్థ నడుస్తోందా..?**
**- లేక 'హుకుం' చెప్పే మరో వ్యవస్థ నడుస్తోందా..?**
**- వైరల్ ఆడియోపై అధికారులు ఎందుకు నోరు మెదపడం లేదు..?**
**- దళిత ఉద్యోగి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారా..?**

సూర్యాపేట సెప్టెంబర్ 03:(విజన్ ఆంధ్ర) : సూర్యాపేట మున్సిపాలిటీలో అధికారిక వ్యవస్థకు సమాంతరంగా మరో 'పెత్తనం' నడుస్తోందా..? మున్సిపల్ ఉద్యోగులపై అధికారిక హోదా లేని వ్యక్తుల ఆదేశాలు చెల్లుబాటు అవుతున్నాయా..? వీధిలైట్ల వ్యవహారంలో మున్సిపల్ ఎలక్ట్రీషియన్‌తో చైర్‌పర్సన్ భర్త మాట్లాడినట్లు చెబుతున్న వైరల్ ఆడియో ఈ ప్రశ్నలను మరింత తీవ్రం చేస్తోంది.ఆడియోలో "నేను ఇస్తున్నా.. నువ్వు చేయాలి", "అధికారి ఎవరు..?" అంటూ ఉద్యోగిని ప్రశ్నించినట్లు ప్రచారం జరుగుతోంది. అంతేకాకుండా ఉద్యోగిని అవమానకరమైన పదజాలంతో సంబోధించినట్లు ఆరోపణలు రావడం మున్సిపల్ వర్గాల్లో కలకలం రేపుతోంది.

**పదవి లేని వ్యక్తికి ఇంత అధికారం ఎవరిచ్చారు..?**

మున్సిపల్ ఉద్యోగులకు విధులు కేటాయించేది అధికారులా..? లేక పాలకవర్గానికి చెందిన వ్యక్తులా..? అనే ప్రశ్న ఇప్పుడు ప్రధానంగా మారింది. చైర్‌పర్సన్ భర్తకు మున్సిపల్ పరిపాలనలో అధికారిక హోదా లేకుంటే ఉద్యోగికి నేరుగా ఆదేశాలు ఇచ్చే పరిస్థితి ఎలా వచ్చింది..? "నేను ఇస్తున్నా.. నువ్వు చేయాలి" అనే స్థాయిలో మాట్లాడే అధికారం ఎక్కడి నుంచి వచ్చింది..? దీనిపై అధికారులు ఎందుకు స్పష్టత ఇవ్వడం లేదనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి.

**ఉద్యోగిని 'యూజ్‌లెస్' అనడం ఏ సంస్కృతి..?**

విధుల్లో ఉన్న ఉద్యోగితో గౌరవంగా మాట్లాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉంటుంది. కానీ వైరల్ ఆడియోలో ఉద్యోగిని అవమానకరమైన పదజాలంతో సంబోధించినట్లు ఆరోపణలు వస్తున్నాయి.ఒక ఉద్యోగి తప్పు చేస్తే నిబంధనల ప్రకారం చర్య తీసుకునే అధికారం అధికారులకు ఉంది. కానీ బెదిరించడం, దూషించడం, అవమానించడం ఎవరి అధికార పరిధిలోకి వస్తుంది..? ఇదే విషయాన్ని దళిత సంఘాల ప్రతినిధులు ప్రశ్నిస్తున్నారు. కింది స్థాయి ఉద్యోగి అయినంత మాత్రాన అతని ఆత్మగౌరవాన్ని కించపరిచే హక్కు ఎవరికీ లేదని వారు స్పష్టం చేస్తున్నారు.

**దళిత ఉద్యోగిపై ఒత్తిడి ఆరోపణలు.. సంఘాల ఆగ్రహం..**

మున్సిపల్ కార్మికులు పట్టణ ప్రజలకు నిత్యం సేవలందిస్తున్నారని దళిత సంఘాలు పేర్కొంటున్నాయి. వారిపై రాజకీయ ఒత్తిళ్లు, బెదిరింపులు ఉంటే అది ఉద్యోగి సమస్యగా మాత్రమే కాకుండా సామాజిక గౌరవానికి సంబంధించిన అంశంగా చూడాలని కోరుతున్నాయి. దళిత ఉద్యోగిని అవమానించేలా వ్యాఖ్యలు




చేసినట్లు ఆరోపణలు నిజమైతే సంబంధిత వ్యక్తిపై అధికారులు నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

**ఆడియో వైరల్.. అధికారులు మాత్రం 'మౌనం' ఎందుకు..?**

ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతోంది.
సోషల్ మీడియాలో ఆడియో వైరల్ అవుతోంది.
ఉద్యోగిపై దురుసు వ్యాఖ్యల ఆరోపణలు వస్తున్నాయి.
అధికారిక హోదాపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.దళిత సంఘాలు స్పందిస్తున్నాయి. అయినా మున్సిపల్ అధికారులు మాత్రం ఇప్పటివరకు ఎందుకు స్పష్టమైన వివరణ ఇవ్వడం లేదనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.
అధికారిక హోదా లేకుండా ఆదేశాలు ఇచ్చారా..?
మున్సిపల్ పరిపాలనలో ఎవరి మాటకు ప్రాధాన్యం ఉంది..?
ఈ ప్రశ్నలకు సమాధానాలు చెప్పాల్సింది మున్సిపల్ అధికారులే.

**'హుకుం' ఎవరిదో.. 'అధికారం' ఎవరిదో తేల్చాల్సిందే**

మున్సిపాలిటీ ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వ వ్యవస్థ. వ్యక్తిగత పెత్తనాలకు వేదిక కాకూడదని దళిత సంఘాలు, స్థానికులు అంటున్నారు. వైరల్ ఆడియోపై స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా విచారణ జరిపి నిజానిజాలను ప్రజల ముందుంచాలని, ఉద్యోగి విధుల్లో రాజకీయ జోక్యం లేకుండా చూడాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ ప్రశ్నలకు అధికారుల సమాధానం కోసం పట్టణ ప్రజలు ఎదురుచూస్తున్నారు.

# సింగరేణి కార్మికులకు అర "చేతి" లో స్వర్గం చూపి... నేడు మొండి "చేయి" చూపుతున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం.

**- ఎన్నికల హామీలు అమలు చేయకుండా**
**కార్మికులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం**
**- 6 గ్యారంటీలు, 420 హామీల అమలుపై**
**ప్రజల్లో చైతన్యం తీసుకువస్తాం..**
**- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి.**





భూపాలపల్లి జిల్లా 3.సెప్టెంబర్ (విజన్ ఆంధ్ర) : ఎన్నికలకు ముందు సింగరేణి కార్మికులకు అనేక హామీలు ఇచ్చి అరచేతిలో స్వర్గం చూపించిన కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారంలోకి వచ్చిన తర్వాత నేడు వారికి మొండిచేయి చూపుతోందని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి గారు తీవ్రస్థాయిలో విమర్శించారు. ఈ రోజు భూపాలపల్లి సింగరేణి ఏరియా 1 ఇంక్లైన్ నందు ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్ కార్యక్రమంలో పాల్గొన్న భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి , టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షులు మిరియాల రాజీ రెడ్డి భూపాలపల్లి పట్టణ బిఆర్ఎస్ పార్టీ నాయకులు మరియు టిబిజికెఎస్ నాయకులు, సింగరేణి కార్మికులు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీ లో చేరిన సింగరేణి కార్మికులు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు తెలంగాణ ప్రజలకు 6 గ్యారంటీలు, అనేక హామీలు ఇచ్చినట్లుగానే సింగరేణి కార్మికులకు కూడా 6 గ్యారెంటీల వాగ్దానాలు చేసిందన్నారు.కార్మికులు కాంగ్రెస్ పార్టీని నమ్మి అధికారంలోకి తీసుకొచ్చినప్పటికీ, వారి సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ముఖ్యంగా విధుల్లో ఉండి అనారోగ్యానికి గురైన సింగరేణి కార్మికులకు మెడికల్ ఇన్వాలిడేషన్ కల్పించే విషయంలో ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోవడం లేదని పేర్కొన్నారు. మెడికల్ బోర్డులను ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం జరుగుతోందని, ఏర్పాటు చేసిన బోర్డుల ద్వారా కూడా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న పలువురు కార్మికులను తిరస్కరిస్తూ, తిరిగి సర్ఫేస్ విధులు లేదా యథావిధిగా డ్యూటీలు చేయాలని సూచిస్తున్నారని విమర్శించారు. దీంతో అనారోగ్యంతో బాధపడుతున్న సింగరేణి కార్మికుల్లో తీవ్ర ఆందోళన నెలకొందన్నారు.భూపాలపల్లి ప్రాంతంలో సింగరేణి కార్మికులు అధిక సంఖ్యలో ఉన్న నేపథ్యంలో వారి వద్దకు వెళ్లి, ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారంటీలు, హామీలను గుర్తు చేస్తూ ప్రభుత్వం ఏ విధంగా మాట తప్పిందో వివరించే కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు. ఇంకా ప్రభుత్వానికి పదవీకాలంలో సమయం ఉన్నప్పటికీ, ఇప్పటికైనా ఎన్నికల హామీలను అమలు చేసి ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. మాట నిలబెట్టుకోకుండా ప్రతిపక్షాలపై విమర్శలు చేయడం సరైన పద్ధతి కాదని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో కేసీఆర్ పాత్రను ఎవరూ విస్మరించలేరని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన కారణంగానే నేడు రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యే అవకాశం వచ్చిందని అన్నారు. అలాంటి తెలంగాణ ఉద్యమ నాయకుడిపై అనుచితమైన, అవమానకరమైన వ్యాఖ్యలు చేయడం ముఖ్యమంత్రి పదవికి తగదని విమర్శించారు. ప్రభుత్వంలోనే అంతర్గత విభేదాలు పెరుగుతున్నాయని, మంత్రివర్గ సహచరుల మధ్య సమన్వయం లేదని, పలువురు ఎమ్మెల్యేలు ప్రభుత్వ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని ఆరోపించారు. అధికారులపై కూడా ప్రభుత్వానికి పూర్తి నియంత్రణ ఉన్న పరిస్థితి కనిపించడం లేదని పేర్కొన్నారు. రాష్ట్రంలో అవినీతి విచ్చలవిడిగా పెరిగిపోయిందని, బిల్లుల చెల్లింపుల విషయంలో పర్సెంటేజీల వ్యవస్థ నడుస్తోందనే ఆరోపణలు ప్రజల్లో వినిపిస్తున్నాయని అన్నారు. రేవంత్ రెడ్డి పాలన అవినీతికి మారుపేరుగా మారిందని ఆరోపించారు. ప్రజలందరూ చైతన్యవంతులై కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే ప్రజలే కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయని 6 గ్యారంటీలు, 420 హామీలకు సంబంధించిన ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేసి ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చే కార్యక్రమం చేపట్టామని తెలిపారు. అయితే నిన్న ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, బ్యానర్లను ఈ రోజు ఉదయం మున్సిపల్ అధికారులు తొలగించి తీసుకెళ్లడం ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులకు సంబంధించిన పెద్ద పెద్ద ఫ్లెక్సీలు, బ్యానర్లు నెలల తరబడి నగరంలో ఉన్నప్పటికీ వాటిపై ఎటువంటి చర్యలు తీసుకోని అధికారులు, బీఆర్ఎస్ పార్టీ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను మాత్రం వెంటనే తొలగించడం ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనమని ఆరోపించారు. ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు గుర్తుకు వస్తాయనే భయంతోనే ప్రభుత్వం ఈ విధంగా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. అధికార దుర్వినియోగంతో ఫ్లెక్సీలు, బ్యానర్లు తొలగించవచ్చుగానీ, ప్రజల మనస్సుల్లో ఏర్పడిన ప్రభుత్వ వ్యతిరేక అభిప్రాయాన్ని మాత్రం తొలగించే శక్తి ఎవరికీ లేదన్నారు. ప్రజల గొంతును అణిచివేసే ప్రయత్నాలు ఎంత చేసినా బీఆర్ఎస్ పార్టీ వెనక్కి తగ్గదని, కాంగ్రెస్ పార్టీ అమలు చేయని హామీలపై ప్రజలను చైతన్యవంతులను చేసే కార్యక్రమాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ వారం రోజుల పాటు నిర్వహిస్తున్న బీఆర్ఎస్ సమరభేరి కార్యక్రమానికి ప్రజలు, పార్టీ శ్రేణులు, ముఖ్యంగా మీడియా ప్రతినిధులు సహకరించాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

# వెయ్యి రోజుల ప్రజాపాలనలో వరంగల్ పశ్చిమ అభివృద్ధికి కొత్త దిశ..

**- గత పదేళ్లలో జరగని అభివృద్ధిని రెండున్నరేళ్లలో**
**కళ్లముందు చూపించాం: ఎమ్మెల్యే నాయిని..**
**- ఘనంగా డీసీసీ భవన్ ఎదుట 1000 రోజుల**
**ప్రజా పాలన విజయోత్సవ వేడుకలుడ**
**- భానసంచా పేల్చి,స్వీట్లు పంచుకొని సంబరాలు**
**చేసుకున్న ఎమ్మెల్యే నాయిని ,డీసీసీ అధ్యక్షులు..**

హనుమకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 3 ( విజన్ ఆంధ్ర ) : కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా టీపీసీసీ ఆదేశాల మేరకు హనుమకొండ జిల్లా కేంద్రంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఎదుట జిల్లా కాంగ్రెస్ కమిటీ, వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ఆధ్వర్యంలో ప్రజాపాలన విజయోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బాణాసంచా పేల్చి, స్వీట్లు పంచుకుని వేడుకలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, గత పదేళ్లలో జరగని అభివృద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్లలోనే ప్రజల కళ్లముందు నిలబెట్టిందని అన్నారు. గత పాలనకు, ప్రస్తుత కాంగ్రెస్ పాలనకు ఉన్న స్పష్టమైన వ్యత్యాసాన్ని ప్రజలు స్వయంగా గమనిస్తున్నారని పేర్కొన్నారు.ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేసిందని, వెయ్యి రోజుల కాలంలో అనేక కీలక ప్రాజెక్టులు, అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని ఎమ్మెల్యే తెలిపారు. వరంగల్ విమానాశ్రయం, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, మాస్టర్ ప్లాన్, కాలేజీలు, కలెక్టరేట్, పాలిటెక్నిక్ కళాశాల ,ఐటీఐ కళాశాల అభివృద్ధి బల్దియా పరిధిలోని ప్రధాన రహదారులు తదితర అభివృద్ధి పనులు వరంగల్ భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తున్నాయని చెప్పారు.గతంలో కేవలం శిలాఫలకాలు వేసి, కొబ్బరికాయలు కొట్టి, ప్రారంభోత్సవాల పేరుతో హడావుడి చేయడం తప్ప ప్రజలకు కనిపించే స్థాయిలో అభివృద్ధి జరగలేదని ఎమ్మెల్యే విమర్శించారు. "మేము శిలాఫలకాల కోసం కాదు.. కళ్లముందు కనిపించే అభివృద్ధి కోసం పనిచేస్తున్నాం" అని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో వరంగల్ అభివృద్ధికి అవసరమైన నిధులను తీసుకురావడంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని తెలిపారు. వరంగల్ నగరాన్ని భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామని చెప్పారు.మేం సముద్రాన్ని తీసుకొస్తామని చెప్పలేదు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నాం. డబుల్ బెడ్రూం ఇళ్లలో కూర్చోబెట్టి వైఫై ఇస్తామని చెప్పి ప్రజలను మభ్యపెట్టలేదు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి పెట్టాం అని నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. గత పాలనలో చేసిన అభివృద్ధి, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమని ఎమ్మెల్యే సవాల్ చేశారు. గత పదేళ్లలో వరంగల్ జిల్లాకు ఎన్ని నిధులు తీసుకొచ్చారు? కాంగ్రెస్ ప్రభుత్వం ఈ రెండున్నరేళ్లలో ఎన్ని నిధులు తీసుకొచ్చింది? ఆ లెక్కలు ప్రజల ముందుంచితే చాలు అని అన్నారు.విమర్శలు, ధర్నాలు, ఆందోళనలతో రాజకీయ హైప్ సృష్టించడం సులభమే కానీ, తాము చేసిన అభివృద్ధిని ప్రజలకు చూపించే ధైర్యం తమకు ఉందని చెప్పారు. అభివృద్ధి పనుల్లో ఇంకా చేయాల్సినవి ఉన్నాయని, మిగిలిన పనులను కూడా దశలవారీగా పూర్తి చేస్తామని స్పష్టం చేశారు.ప్రతిపక్షాలు తమ పాలనలో జరిగిన అభివృద్ధిని చూపించకుండా, ప్రభుత్వం చేస్తున్న పనుల్లో ఇంకా పూర్తికాని కొద్దిపాటి అంశాలనే పదేపదే ప్రస్తావిస్తున్నాయని విమర్శించారు. మేము చేసిన 80 శాతం పనులను చూపించే ధైర్యం వారికి లేదు. చేయాల్సి ఉన్న మిగిలిన 20 శాతం పనుల గురించే మాట్లాడుతున్నారు అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో నీతి, నిజాయితీ, పారదర్శకతకు ప్రాధాన్యత ఇస్తున్నామని, ప్రజల కోసం పనిచేయడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును కాంగ్రెస్ ప్రభుత్వం గౌరవిస్తుందని, ప్రజల సమస్యలపై పోరాడే స్వేచ్ఛను కల్పిస్తున్నామని అన్నారు. వరంగల్ జిల్లా ప్రజలే గత పాలనకు, ప్రస్తుత పాలనకు మధ్య ఉన్న వ్యత్యాసానికి ప్రత్యక్ష సాక్షులని నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు.గతంలో ఏం జరిగింది.. నేడు ఏం జరుగుతోంది అనేది మేము చెప్పాల్సిన అవసరం లేదు. అభివృద్ధిని మీ కళ్లముందే చూపిస్తున్నాం. ప్రజలే దీనికి సాక్షులు అని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఇనగల వెంకట్రామ్ రెడ్డి,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్,టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి,టీపీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాస్ రావు,మాజీ కార్పొరేటర్ లు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, నియోజకవర్గ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, డివిజన్ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కులతో నిరుపేదలకు భరోసా

***11 మంది లబ్ధిదారులకు రూ.6.50 లక్షల చెక్కులు పంపిణీ చేసిన వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య***



హన్మకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 3 ( విజన్ ఆంధ్ర ) : అనారోగ్యంతో బాధపడుతూ ఖరీదైన వైద్యం చేయించుకునే ఆర్థిక స్తోమత లేని నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) అండగా నిలుస్తోందని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. వైద్య ఖర్చులతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ ద్వారా చేయూత అందిస్తోందని తెలిపారు.హనుమకొండ కనకదుర్గ కాలనీలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో గురువారం వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని 11 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.6.50 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎంపీ డాక్టర్ కడియం కావ్య పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య మాట్లాడుతూ.. పేద ప్రజలకు అత్యవసర సమయంలో వైద్య సహాయం అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకున్నప్పటికీ ఆర్థిక ఇబ్బందులతో సతమతమయ్యే కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందించడం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన సమయంలో ప్రభుత్వ సహాయం అందేలా తన వంతు కృషి చేస్తానని ఎంపీ తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందడంతో లబ్ధిదారులు ఎంపీ డాక్టర్ కడియం కావ్య గారికి కృతజ్ఞతలు తెలిపారు. వైద్య ఖర్చుల భారాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం అందించిన ఈ సహాయం తమ కుటుంబాలకు ఎంతో ఊరటనిచ్చిందని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

# వైద్య, ఆరోగ్య శాఖ రిపోర్టింగ్ సూపర్వైజర్లతో సమీక్ష సమావేశం

**- డిఎంఎచ్ఓ.జే.సంధ్యా కిరణ్మయి**



గద్వాల సెప్టెంబర్ 3 (విజన్ ఆంధ్ర బ్యూరో) : జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో జిల్లా పరిధిలోని రిపోర్టింగ్ సూపర్వైజర్లతో జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి (డిఎం ఎచ్ఓ) డాక్టర్. జె. సంధ్యా కిరణ్మయి అధ్యక్షతనలో ఈ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించిన వివిధ కార్యక్రమాల అమలు, పురోగతి, పనితీరును సమీక్షించడం జరిగింది. ప్రతి కార్యక్రమానికి నిర్దేశించిన లక్ష్యాలు, పారామీటర్లు, సూచికలను నిర్ణీత గడువులోగా 100 శాతం పూర్తి చేయాలని డిఎం ఎచ్ఓ. రిపోర్టింగ్ సూపర్వైజర్లను ఆదేశించారు. అన్ని ఆరోగ్య కార్యక్రమాలకు సంబంధించి క్షేత్రస్థాయిలో జరుగుతున్న కార్యకలాపాలను నిరంతరం పర్యవేక్షిస్తూ, పెండింగ్‌లో ఉన్న పనులను తక్షణమే పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమాల అమలులో ఎటువంటి జాప్యం లేకుండ సంబంధిత సిబ్బందితో సమన్వయం చేసుకుని, నిర్దేశిత లక్ష్యాలను సాధించే విధంగ ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.అలాగే, ప్రతి కార్యక్రమానికి సంబంధించిన డేటా, రిపోర్టులను సకాలంలో, ఖచ్చితత్వంతో సంబంధిత పోర్టల్స్‌లో నమోదు చేసి, నివేదికలను నిర్ణీత సమయానికి సమర్పించాలని సూచించారు. వెనుకబడిన కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించి, వాటి పురోగతిని నిరంతరం సమీక్షించాలని తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్. రాజు, డాక్టర్. ప్రసూన రాణి ,ఎస్ఓ. తిరుమల్ రెడ్డి,డిపిఎచ్ఎన్ఓ. వరలక్ష్మి, ఇన్‌చార్జ్ డిఈఎంఓ.హిర్య నాయక్ పాల్గొన్నారు.

# రేషన్ మాదే.. స్మార్ట్ కార్డులు మావే..

**- నిరుపేదల కోసం కాంగ్రెస్ చేసిన సేవలు అనిర్వచనీయం..**
**- స్మార్ట్ కార్డులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్..**
**- ఎమ్మెల్యే శంకర్, మాజీ ఎమ్మెల్యే బక్కని పరస్పర ప్రశంసలు..**
**- నాకు, నరసింహులు అన్నకు ఫామ్ హౌస్ లు లేవు: ఎమ్మెల్యే**
**- కెసిఆర్ కు, అంజయ్య యాదవ్ కు ఉన్నాయి: ఎమ్మెల్యే**
**- పదేండ్ల నిండా ఉంచి 1000ల పాలన గురించి మాట్లాడతారా అంటూ ఆగ్రహం..**
**- లింగారెడ్డి గూడాలో స్మార్ట్ కార్డుల పంపిణీ శ్రీకారం**



షాద్ నగర్ సెప్టెంబర్ 03(విజన్ ఆంధ్ర ): ఒకప్పుడు రేషన్ కార్డుల వ్యవస్థను వెలుగులోకి తెచ్చి నిరుపేదల కడుపు నింపిన కాంగ్రెస్ ఈరోజు స్మార్ట్ కార్డుల పంపిణీ ద్వారా మరో అడుగు ముందుకు వేసిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఫరూక్ నగర్ మండలం లింగారెడ్డిగూడెం గ్రామంలో స్మార్ట్ కార్డుల కంపెనీ కార్యక్రమాన్ని ఆయన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వతంత్రం వచ్చిన తర్వాత రేషన్ వ్యవస్థను తీసుకువచ్చిన పార్టీ కాంగ్రెస్ అని అన్నారు. అదేవిధంగా తెలుగుదేశం అధినేత ఎన్టీ రామారావు అడుగు పెట్టాక రెండు రూపాయలకు కిలో బియ్యంతో ఈ వ్యవస్థను మరింత ముందుకు తీసుకువెళ్లాలని ప్రదర్శించారు. కాంగ్రెస్ పార్టీ నిరంతరం ప్రజల గురించి ఆలోచిస్తుందని, దీనిని గుర్తించాలని పేర్కొన్నారు. కెసిఆర్, అంజయ్య యాదవ్, ఇంకా చాలామంది నాయకులకు ఫామ్ హౌస్ ఉన్నాయి అని, నాకు గాని, ఇక్కడున్న మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు అన్నకు గాని ఇలాంటి ఫామ్ హౌస్ లు లేవని ఎద్దేవా చేశారు. పదేళ్లపాటు జనాలను నిండా ముంచి బీఆర్ఎస్ ఇప్పుడు తమ వెయ్యి రోజుల పాలన గురించి ప్రశ్నించడం హాస్యాస్పదమని అన్నారు. ప్రజలు పార్టీలు ఏం చేస్తున్నాయో గమనించి ఆలోచించాలని, అబద్ధపు ప్రచారాలు నమ్మవద్దని స్పష్టం చేశారు.బక్కని నరసింహులు మాట్లాడుతూ ప్రభుత్వం ఏదైనా ప్రజల కోసం పనిచేసినప్పుడు అభినయం దించడం అలవాటు చేసుకోవాలని అన్నారు. అలాగని భజన చేయాల్సిన అవసరం లేదని తప్పులుంటే ప్రశ్నించడం కూడా నేర్చుకోవాలని స్పష్టం చేశారు. పుల్లలు పెట్టడం చాలా తేలిక, కానీ పనిచేయడం అత్యంత కష్టం అని అన్నారు. స్మార్ట్ కార్డులను అరకులు మాత్రమే ఉపయోగించుకోవాలని, దుర్వినియోగం చేయవద్దని సూచించారు.



**- ఎమ్మెల్యే.. మాజీ ఎమ్మెల్యే.. పరస్పర ప్రశంస**

ఈ సందర్భంగా పార్టీలకు అతీతంగా కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, తెలుగుదేశం మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు ఒకరినొకరు ప్రశంసించుకున్నారు. నిస్వార్థ నాయకుడిగా రూపాయి కూడా సంపాదించుకోకుండా మాజీ ఎమ్మెల్యే నర్సింలు అన్నగారు పనిచేశారని, గ్రామాన్ని కూడా క్రమశిక్షణలో పెట్టారని అభినందించారు. ఆయన వల్ల గ్రామం అన్ని విధాల ముందడుగు వేసిందని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు మాట్లాడుతూ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గ్రామానికి పాలిటెక్నిక్ కళాశాల తీసుకురావడం, గ్రామాభివృద్ధికి అన్ని విధాల సహకరించడం ఎంతో అభినందనీయమని అన్నారు. ఇలాంటి నాయకులను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో నాగయ్య, పిఎసిఎస్ చైర్మన్ చల్లా శ్రీకాంత్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మొహమ్మద్ అలీ ఖాన్ బాబర్, గ్రామ సర్పంచ్ ప్రవీణ్, ఉప సర్పంచ్ లింగారెడ్డిగూడెం అశోక్, చెంది తిరుపతిరెడ్డి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు..

# బోడుప్పల్‌లో ఘనంగా కాంగ్రెస్ వెయ్యి రోజుల వేడుకలు

**- వజ్రేష్ యాదవ్ నేతృత్వంలో బైక్ ర్యాలీ..**

**- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం**





బోడుప్పల్,సెప్టెంబర్ 03(విజన్ ఆంధ్ర) : కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తిచేసుకున్న సందర్భంగా బోడుప్పల్‌లో పార్టీ శ్రేణులు గురువారం సందడి చేశాయి. బోడుప్పల్, చెంగిచర్ల డివిజన్ల కాంగ్రెస్ పార్టీ ఆద్వర్యంలో నాయకులు, కార్యకర్తలు భారీగా బైక్ ర్యాలీ నిర్వహించారు. ముఖ్యమంత్రి అనుముల రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి ప్రభుత్వ పాలనపై తమ మద్దతును చాటుకున్నారు.ఈ కార్యక్రమానికి మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు,మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ ర్యాలీలో ముఖ్యఅతిథిగా పాల్గొన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి బైక్‌పై ర్యాలీలో పాల్గొని శ్రేణుల్లో ఉత్సాహం నింపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఈ ర్యాలీ నిర్వహించినట్లు నాయకులు తెలిపారు.ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ.. ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం దశలవారీగా అమలు చేస్తోందన్నారు. సంక్షేమంతోపాటు అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ మరింత ప్రగతి సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, మాజీ కార్పొరేషన్ అధ్యక్షుడు పోగుల నర్సింహారెడ్డి, బోడుప్పల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొమ్మకు కళ్యాణ్ కుమార్, చెంగిచర్ల డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోగుల దిలీప్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యువజన నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతులను నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

**- హామీలు కొండంత.. అమలు శూన్యం**
**- పంటలకు బోనస్ లేదు.. గిట్టుబాటు ధర లేదు.. రైతన్నకు మిగిలింది కన్నీరే**
**- సంక్షోభంలో వ్యవసాయ రంగం... రైతులకు అండగా బీఆర్ఎస్**
**- మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్**
**- కాంగ్రెస్ 1000 రోజుల విధ్వంస పాలనపై బీఆర్ఎస్ చార్జ్‌షీట్**



షాద్ నగర్ సెప్టెంబర్ 03(విజన్ ఆంధ్ర ): కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో వ్యవసాయ రంగాన్ని పూర్తిగా సంక్షోభంలోకి నెట్టిందని, ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అన్నదాతలను మోసం చేసిందని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను ఎండగడుతూ కొందుర్గ్ మండల కేంద్రంలోని జి.ఎం. పటేల్ గార్డెన్‌లో ఆయన ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి వ్యవసాయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ 1000 రోజుల పాలనలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను బీఆర్ఎస్ నాయకులు వివరించారు. వరంగల్ డిక్లరేషన్‌లో రైతులకు ఇచ్చిన హామీలను గాలికొదిలేసి కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నిలువునా మోసం చేసిందని విమర్శించారు. రైతులకు రైతు భరోసా అందించడంలో ప్రభుత్వం విఫలమైందని, ఎన్నికల ముందు హామీ ఇచ్చిన రూ.2 లక్షల రైతు రుణమాఫీని పూర్తిస్థాయిలో అమలు చేయకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని అన్నారు. రూ.50 వేల కోట్ల రుణమాఫీ చేస్తామని చెప్పి ఆ హామీని కూడా నీరుగార్చారని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు అందిన రైతుబంధు, 24 గంటల ఉచిత విద్యుత్ వంటి పథకాలను నిర్వీర్యం చేశారని ఆరోపించారు. ప్రస్తుతం రైతులకు కనీసం పది గంటల పాటు కూడా నిరంతర విద్యుత్ అందని పరిస్థితులు ఉన్నాయని అన్నారు. వ్యవసాయానికి అవసరమైన విద్యుత్ కోతలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అన్ని పంటలకు బోనస్ ఇస్తామని చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం ఆ హామీని బోగస్‌గా మార్చిందని, పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో విఫలమైందని విమర్శించారు. మద్దతు ధర కోసం రైతులు ఎదురుచూస్తుంటే, పంటల కొనుగోలు కేంద్రాల విషయంలో కూడా ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోవడం లేదన్నారు. వర్షాలు, తుఫాన్లు, ప్రకృతి వైపరీత్యాలతో పంటలు నష్టపోయిన రైతులకు సకాలంలో పంటల బీమా పరిహారం అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల కష్టాలను పట్టించుకోకుండా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. కాంగ్రెస్ 1000 రోజుల పాలనలో రైతులకు ఒరిగిందేమీ లేదని.. హామీలు మాత్రం కొండంత, అమలు మాత్రం శూన్యమని విమర్శించారు. రైతుల సమస్యలపై బీఆర్ఎస్ ఎప్పటికీ రాజీపడదని, అన్నదాతలకు అండగా నిలిచి వారి హక్కుల కోసం ప్రభుత్వంపై పోరాటం కొనసాగిస్తామని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ స్పష్టం చేశారు. రైతులకు ఇచ్చిన ప్రతి హామీని కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న రైతు ప్రయోజనాలను తక్షణమే పరిష్కరించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వంకాయల నారాయణరెడ్డి, రవీందర్ యాదవ్, మాజీ మార్కెట్ చైర్మన్లు, మాజీ ఎంపీపీలు, మాజీ జడ్పీటీసీలు, మాజీ పీఏసీఎస్ చైర్మన్లు, మాజీ వైస్ చైర్మన్లు, మాజీ వైస్ ఎంపీపీలు, బీఆర్ఎస్ మండల, గ్రామ, మున్సిపాలిటీ, వార్డు అధ్యక్షులు, ప్రస్తుత మరియు మాజీ సర్పంచులు, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, మాజీ ఎంపీటీసీలు, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ యువత, అనుబంధ విభాగాల నాయకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు..

# శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం

**- సీసీటీవీల ఏర్పాటు, 24 గంటల గస్తీకి ఆదేశం**
**- వినాయక చవితి వేడుకలపై ముందస్తు నిఘా**
**- డీజేలపై కఠిన నిషేధం**



సూర్యాపేట సెప్టెంబర్ 03:(విజన్ ఆంధ్ర) : సూర్యాపేట జిల్లా పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పోలీస్ యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పి నరసింహ ఆదేశించారు. గురువారం సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్‌ను ఎస్పి ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలను నిశితంగా పరిశీలించి సిబ్బంది విధి నిర్వహణ తీరును మరియు బాధితులకు అందుతున్న సేవలపై సమీక్షించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో భద్రతను మరింత కట్టుదిట్టం చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలో అసాంఘిక చర్యలు, అక్రమ రవాణా జరగకుండా పటిష్ట నిఘా ఉంచాలి. పట్టణంలో కొత్త వ్యక్తుల కదలికలను నిరంతరం గమనిస్తూ ఉండాలి, పెట్రో కార్, బ్లూ కోట్స్ సిబ్బంది నిరంతరాయంగా 24 గంటల పాటు క్షేత్రస్థాయిలో గస్తీ నిర్వహించాలి. రాత్రి వేళ అనుమానితుల వేలిముద్రలు తనిఖీ చేయాలని అన్నారు. నేరాల నియంత్రణకు పట్టణంలో వీలైనన్ని ఎక్కువ సంఖ్యలో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలి అని సూచించారు, నిరంతరం వాహనాల తనిఖీలు చేయాలని అన్నారు.రానున్న వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని పట్టణంలో ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాలి. స్థానిక పెద్దలతో, ఉత్సవ కమిటీలతో శాంతి సమావేశాలు నిర్వహించాలి. గణేష్ మండపాల ఏర్పాటుకు సంబంధించి కమిటీలు ముందస్తుగా అనుమతులు తీసుకునేలా అవగాహన కల్పించాలి. రాకపోకలకు ఇబ్బంది కలగకుండా రోడ్లపై వినాయక మండపాలు ఏర్పాటు చేయవద్దని స్పష్టం చేయాలి. పట్టణంలో ఎన్ని విగ్రహాలు ఏర్పాటు అవుతున్నాయో ముందే అంచనా వేసి, వాటికి నంబరింగ్ కేటాయించి, నిమజ్జన రూట్లను పరిశీలించాలాని అన్నారు.పండుగల సందర్భంగా డీజేల వల్ల ప్రమాదాలు, మరణాలు సంభవిస్తున్నందున డీజేల వాడకాన్ని పూర్తిగా నియంత్రించాలి. డీజే నిర్వాహకులను పిలిపించి ముందస్తుగా బైండోవర్ చేయాలి. డీజేల వల్ల కలిగే నష్టాలపై భక్తులకు, ఉత్సవ కమిటీలకు సాధారణ ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలి. పోలీస్ యంత్రాంగం ఎల్లప్పుడూ ప్రజల వినతులు, ఫిర్యాదుల మేరకు స్పందిస్తూ పారదర్శకంగా పనిచేయాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.ఈ తనిఖీలో పట్టణ సిఐ వెంకటయ్య, సిసిఎస్ ఇన్స్పెక్టర్ శివ కుమార్, ఎస్ఐ లు సాయిరాం,రామచందర్, రహిముద్దీన్, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రజా పాలన వెయ్యి రోజులు పూర్తిచేసుకున్న సందర్భంగా కాంగ్రెస్ నాయకుల సంబురాలు




ఆదిలాబాద్ జిల్లా (విజన్ ఆంధ్ర బ్యూరో)ఆదిలాబాద్ రూరల్ మండలం తంతోలి గ్రామంలో ప్రజల పాలన సంబరాలను నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి సంజీవ్ రెడ్డి , మాజీ డిసిసి అధ్యక్షులు సాజిద్ ఖాన్ ల తో కలిసి గ్రామంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి కాంగ్రెస్ ప్రజా పాలనా అందిస్తున్న సంక్షేమ పథకాలను, అభివృద్ధిని వివరించడం జరిగింది. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి సారధ్యంలో కాంగ్రెస్ప్ర భుత్వం వెయ్యి రోజుల పాలనలో ప్రజల సంక్షేమం నుంచి రాష్ట్ర సమగ్ర అభివృద్ధి వరకు.. వర్తమాన అవసరాల నుంచి భవిష్యత్ తెలంగాణ నిర్మాణం వరకు.. ఈ వెయ్యి రోజుల ప్రజా పాలన రాష్ట్ర ప్రగతి ప్రస్థానంలో కొత్త అధ్యాయానికి నాంది పలికిందని అన్నారు. రైతులు, మహిళలు, యువత, బడుగు బలహీన వర్గాలకు భరోసా కల్పించడంతో పాటు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుందని తెలిపారు. సన్నబియ్యం పంపిణీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ ఆరోగ్యశ్రీ వంటి సంక్షేమ కార్యక్రమాల ద్వారా ప్రజలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారని, వాటికి ప్రజలే సరైన సమాధానం చెబుతారని అన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలనను పునర్నిర్మిస్తూ సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయం ప్రధాన ఎజెండాగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఈ కార్యక్రమము లోవెంకట్ యాదవ్,మాజీ జేపీటీసీ కొండా గంగాధర్,అభిషేక్ రెడ్డి,డీసీసీ ఉపా అధ్యక్షులు సుధాకర్ గౌడ్,ఎంఎ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పుంద్ర నర్సింగ్,తంతోలి గ్రామ నాయకులు వీరయ్య,రాజేశ్వర్,దండు మధుకర్ ,సత్మరం,రాములు,రవి,వినోద్ రెడ్డి,పోచారెడ్డి,మరియు వివిధ గ్రామాల సర్పంచులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# నర్సరీలు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకొని లైసెన్స్ పొందాలి

**- జిల్లా ఉద్యాన అధికారి జి. రాజ్ కుమార్**



గద్వాల సెప్టెంబర్ 3 (విజన్ ఆంధ్ర బ్యూరో) : జిల్లాలోని వివిధ మండలాల్లో 30 కూరగాయల నర్సరీలు ఉన్నాయని, ప్రతి నర్సరీ తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకొని లైసెన్స్ పొందాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి జి.రాజ్ కుమార్ సూచించారు. గురువారం గద్వాల మండల కేంద్రంలోని పలు కూరగాయల నర్సరీలను పరిశీలించారు. నర్సరీల నిర్వహణ,మొక్కల నాణ్యత,రిజిస్ట్రేషన్,లైసెన్స్ తదితర అంశాలను పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.నిబంధనలు పాటించకుండా నర్సరీలను నిర్వహిస్తే ఉద్యాన నర్సరీల రిజిస్ట్రేషన్, క్రమబద్ధీకరణ చట్టం2010 యాక్ట్ 13 ఆఫ్ 2010), తెలంగాణ ఉద్యాన నర్సరీల రిజిస్ట్రేషన్ రూల్స్2017 ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొన్ని నర్సరీలు ప్రభుత్వ అనుమతి, రిజిస్ట్రేషన్ లేకుండా నాసిరకం నారు,మొక్కలను విక్రయిస్తున్నట్లు, రైతులకు బిల్లులు ఇవ్వడం లేదని తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇలాంటి నర్సరీలపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.రైతులకు నాణ్యమైన, ఆరోగ్యకరమైన, చీడపీడలు లేని కూరగాయల నారు,పండ్లు,పూల మొక్కలను అందించడమే నర్సరీ చట్టం ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు.కూరగాయల నారును సాంప్రదాయ పద్ధతిలో కాకుండా షేడ్‌నెట్ నర్సరీలు, ప్రోట్రేలలో శాస్త్రీయ పద్ధతుల్లో ఉత్పత్తి చేసి రైతులకు అందించాలని సూచించారు.మొక్కల నాణ్యత, పరిమాణం మరియు ప్రమాణాలకు అనుగుణంగా ధర నిర్ణయించడం, నాణ్యమైన తల్లి మొక్కలను నిర్వహించడం కూడా చట్టం ముఖ్య ఉద్దేశ్యాల్లో భాగమన్నారు. నర్సరీ రిజిస్ట్రేషన్ కోసం నర్సరీ పూర్తి చిరునామా, దరఖాస్తుదారుని ఫోటో,భూమి పత్రాలు/పట్టాదారు పాస్‌బుక్/లీజ్ అగ్రిమెంట్, ప్రభుత్వ గుర్తింపు పొందిన సర్వేయర్ ద్వారా రూపొందించిన లేఅవుట్ మ్యాప్, నర్సరీలోని వసతుల వివరాలు, భూసార , నీటి నాణ్యత పరీక్ష నివేదికలు, గత మూడు సంవత్సరాల మొక్కల ఉత్పత్తి వివరాలు,నర్సరీ డిజిటల్ ఫోటోగ్రాఫ్,రిజిస్ట్రేషన్ రుసుము చెల్లించిన రశీదు తదితర పత్రాలను సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. రైతులు మొక్కలు,నారు కొనుగోలు చేసే సమయంలో రిజిస్ట్రేషన్ , లైసెన్స్ కలిగిన నర్సరీల నుంచే కొనుగోలు చేసి తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని జిల్లా ఉద్యాన అధికారి సూచించారు. ఈ కార్యక్రమంలో గద్వాల ఉద్యాన అధికారి ఎం. రాజశేఖర్,నర్సరీ నిర్వాహకులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.


# బ్రిలియంట్ స్కూల్ పై విచారణకు బీఎస్ఎఫ్ డిమాండ్



ములుగు సెప్టెంబర్ 03, విజన్ ఆంధ్ర ప్రతినిధి : బ్రిలియంట్ హై స్కూల్ ఒక చోట అనుమతి పొంది మరో చోట నడుపుతోందని, ప్రేమ్ నగర్ వివేకవర్ధిని ప్రాంగణంలో విద్యార్థులను ఉంచారని, ఫైర్ సేఫ్టీ, మరుగుదొడ్లు, బస్సుల ఫిట్నెస్, టీచర్ల అర్హతలపై విచారణ జరపాలని బీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కాడపాక రాజశేఖర్ వర్మ ఎంఈఓకు వినతిపత్రం ఇచ్చారు. నిబంధనలు ఉల్లంఘిస్తే లైసెన్స్ రద్దు చేయాలని కోరారు.

# ప్రజల భూములపై ప్రభుత్వ పెత్తనమా?

**- 22-ఏ జాబితా నుంచి అర్హతలేని భూములను తొలగించాలి**
**- మాజీ మేయర్ జక్క వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో తహసీల్దార్ కు వినతిపత్రం అందజేత**
**- పీర్జాదిగూడలో బీఆర్ఎస్ ఆందోళన..**



బోడుప్పల్,సెప్టెంబర్03(విజన్ ఆంధ్ర) : ప్రజలు కష్టార్జితంతో కొనుగోలు చేసిన పట్టా భూములు, ప్రైవేటు ప్లాట్లను 22-ఏ (రిజిస్ట్రేషన్ నిషేధిత) జాబితాలో చేర్చి వారి ఆస్తి హక్కులను హరించే అధికారం ప్రభుత్వానికి ఎవరు ఇచ్చారని మాజీ మేయర్ జక్క వెంకట్‌రెడ్డి ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తయిన సందర్భంగా బీఆర్ఎస్ చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా మేడిపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం ఆందోళన నిర్వహించారు.అనంతరం రెవిన్యూ అధికాఋఉలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జక్క వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి కష్టపడి సంపాదించిన డబ్బుతో భూములు కొనుగోలు చేసిన రైతులు, మధ్యతరగతి కుటుంబాలు 22-ఏ జాబితా కారణంగా రిజిస్ట్రేషన్లు, భూ లావాదేవీలు, బ్యాంకు రుణాల విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. భూ యజమానుల పత్రాలు, అభ్యంతరాలను పూర్తిస్థాయిలో పరిశీలించకుండానే అర్హతలేని భూములను 22-ఏ జాబితాలో చేర్చడం సరికాదని పేర్కొన్నారు. ప్రజల భూములను పరిరక్షించాల్సిన ప్రభుత్వమే వాటిని వివాదాస్పదంగా మార్చడం దుర్మార్గమైన చర్య అని విమర్శించారు. 22-ఏ జాబితా పేరుతో భూ యజమానులను కార్యాలయాల చుట్టూ తిప్పుతూ ఇబ్బందులకు గురిచేయడం నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అర్హతలేని భూములను తక్షణమే 22-ఏ జాబితా నుంచి తొలగించి, భూ యజమానులకు హక్కులు స్పష్టంగా కల్పించాలని కోరారు. సమస్యను పరిష్కరించకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రజల భూములు, ఆస్తుల పరిరక్షణ కోసం చివరి వరకు పోరాడుతామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు దొంతిరి హరిశంకర్‌రెడ్డి, కొల్తూరి మహేష్, లేతాకుల మాధవి, రఘుపతిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి,కౌడే పోచయ్య,మహిళా అధ్యక్షురాలు నిర్మల,యువజన అధ్యక్షుడు ప్రభు, సీనియర్ నాయకులు ఆకుల మధుకర్, యూబీఏ అధ్యక్షుడు ఆకుల సత్యనారాయణ, రమేష్, సతీష్‌రెడ్డి, మురళి, రాజేష్‌రెడ్డి, నరసింహారెడ్డి, కోటగిరి శ్రీకాంత్, జగన్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, యాసారం శ్రీనివాస్, మునికుంట్ల కిరణ్‌గౌడ్, బుల్లెట్ శంకర్, అశోక్, సతీష్, కిరణ్‌నాయక్, పాశం నరేందర్‌రెడ్డి, అక్షిత్, వెంకట్, అమర్‌పటేల్‌తో పాటు వివిధ డివిజన్ల అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ విజయవంతం చేసేందుకు సహకరించాలి

**- అర్హులైన వారందరికీ ఓటు హక్కు ఉండాలి, - జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



గద్వాల సెప్టెంబర్ 3 (విజన్ ఆంధ్ర బ్యూరో) : అర్హులైన వారందరికీ ఓటు హక్కు ఉండేలా ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేసేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా ప్రస్తుతం మ్యాపింగ్ కానీ, అనామిలిస్ జాబితాలో ఉన్న వారందరికీ నోటీసులు ఇస్తున్న నేపథ్యంలో గురువారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశమై మాట్లాడారు. జిల్లాలో మొత్తం 1,49,282 మందికి నోటీసులు ఇవ్వాల్సి ఉండగా ఇప్పటివరకు సుమారు 36,000 మందికి ఇవ్వడం జరిగిందన్నారు. కొంతమంది ఓటర్లు అందుబాటులో లేకపోవడం ఇతర కారణాలతో ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉన్నందున రాజకీయ పార్టీల ప్రతినిధులు, బిఎల్ఎ లు బిఎల్వోలకు సహకరించేలా చూడాలన్నారు. తప్పులు లేని, పారదర్శకమైన ఓటరు జాబితాలను రూపొందించేందుకు ఎన్నికల సంఘం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియను జిల్లాలో విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ తోడ్పాటును అందించాలన్నారు. ఏ, బి, సి కేటగిరీల వారీగా ఉన్న వ్యక్తులు ఇవ్వాల్సిన డాక్యుమెంట్స్ పై ఎన్నికల సిబ్బందికి స్పష్టమైన అవగాహన కలిగిస్తూ దిశా నిర్దేశం చేయడం జరిగిందన్నారు. ఇందులో భాగంగానే ఈనెల 5న మున్సిపల్ కౌన్సిలర్లకు, సర్పంచులకు, వార్డు అధికారులకు, గ్రామపంచాయతీ కార్యదర్శులకు కూడా శిక్షణ కార్యక్రమం నిర్వహించాలని ఎన్నికల విభాగం అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మధుమోహన్, ఆర్డీవో శ్రీనివాసరావు, ఎన్నికల విభాగం అధికారి మంజుల, గద్వాల తహసిల్దార్ హరికృష్ణ, ఇతర అధికారులు, పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# భద్రకాళి బండ్ అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

**- జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న**



హన్మకొండ బ్యూరోచిఫ్ సెప్టెంబర్ 3(విజన్ ఆంధ్ర ) : భద్రకాళి బండ్ అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న ఆదేశించారు. వరంగల్ నగరంలోని భద్రకాళి బండ్పై కొనసాగుతున్న అభివృద్ధి పనులను గురువారం ఆయన బల్దియా ఇంజినీరింగ్, కుడా అధికారులతో కలిసి జాయింట్ ఇన్స్పెక్షన్ నిర్వహించి పరిశీలించారు. ఈ సందర్భంగా బండ్పై కొనసాగుతున్న వివిధ ఇంజినీరింగ్ పనుల పురోగతిని, ఇప్పటికే పూర్తయిన పనుల పరిస్థితిని కమిషనర్ పరిశీలించారు. పెండింగ్లో ఉన్న పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. బండ్పై నిర్మిస్తున్న టాయిలెట్ల పనులను పరిశీలించిన కమిషనర్, వాటిని నిర్దేశిత ప్రమాణాల ప్రకారం పూర్తి చేయాలని సూచించారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని బండ్పై సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. భద్రకాళి బండ్ పరిసరాల సుందరీకరణతో పాటు, భవిష్యత్లో నిర్వహణకు అవసరమైన చర్యలను కూడా ముందస్తు ప్రణాళికతో చేపట్టాలని సూచించారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, ఆహ్లాదకరమైన వాతావరణం, సౌకర్యవంతమైన సేవలు అందేలా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ నాణ్యతలో రాజీ పడవద్దని కమిషనర్ స్పష్టం చేశారు. పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తూ, నిర్దేశిత గడువులోగా అన్ని పనులను పూర్తి చేసేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కమిషనర్ వెంట ఎస్ఈ రాజ్కుమార్, ఈఈ రవికుమార్, కుడా పీఓ అజిత్రెడ్డి, ఈఈ భీంరావు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో ఘనంగా సంబురాలు

**- చౌరస్తాలో ఘనంగా కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలన సంబరాలు**
**- డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**
**- రహదారిపై టపాసులు కాల్చి, మిఠాయిలు పంచి సంబరాలు చేసుకున్న కాంగ్రెస్ శ్రేణులు**





హన్మకొండ జిల్లా బ్యూరోచిఫ్ సెప్టెంబర్ 3(విజన్ ఆంధ్ర ) : తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి, ప్రజా రంజక పాలనలో విజయవంతంగా 1000 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం హనుమకొండ చౌరస్తాలో సంబరాలు అత్యంత ఘనంగా, వైభవంగా జరిగాయి. ఈ వేడుకలకు వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, హనుమకొండ డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ముఖ్య అతిథులుగా సంబరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు చౌరస్తాలో టపాసులు కాల్చారు. ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుంటూ, “కాంగ్రెస్ ప్రభుత్వం – రేవంత్ రెడ్డి నాయకత్వం“ వర్ధిల్లాలంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ... ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం గత 1000 రోజులుగా పేద, మధ్యతరగతి ప్రజల సంక్షేమమే ధ్యేయంగా అద్భుతమైన పాలన సాగిస్తోంది. గత పాలకుల నిరంకుశత్వానికి చరమగీతం పాడుతూ, ప్రజాస్వామ్య బద్ధంగా ‘ప్రజా పాలన‘ను ప్రజల చెంతకు చేర్చాం. ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేస్తూ, నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పన, రైతులకు రుణమాఫీ వంటి చారిత్రాత్మక నిర్ణయాలతో దేశంలోనే తెలంగాణను నెంబర్ వన్ స్థానంలో నిలిపాం. ఈ 1000 రోజుల ప్రగతి ప్రస్థానం మున్ముందు కూడా ఇలాగే కొనసాగుతుంది“ అని ధీమా వ్యక్తం చేశారు. డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ..... కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతి మాటను నిలబెట్టుకుంటూ ప్రజా హృదయాల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకుంది. హనుమకొండ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పథకాలు ప్రతి పేదవానికి అందుతున్నాయి. నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా ఉంటూ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లాలి“ అని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు: టీపీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాస్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, డీసీసీ మీడియా కమిటీ చైర్మన్ మార్క విజయ్ కుమార్ గౌడ్, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, పీసీసీ మరియు డీసీసీ కమిటీల సీనియర్ సభ్యులు, జిల్లా కమిటీ ప్రతినిధులు, మహిళా నాయకురాలులు, అనుబంధ సంఘాల నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కులతో నిరుపేదలకు భరోసా..

**-11 మంది లబ్ధిదారులకు రూ.6.50 లక్షల చెక్కులు పంపిణీ చేసిన వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య**



హన్మకొండ బ్యూరోచిఫ్ సెప్టెంబర్ 3(విజన్ ఆంధ్ర ) : అనారోగ్యంతో బాధపడుతూ ఖరీదైన వైద్యం చేయించుకునే ఆర్థిక స్థోమత లేని నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) అండగా నిలుస్తోందని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. వైద్య ఖర్చులతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ ద్వారా చేయూత అందిస్తోందని తెలిపారు. హనుమకొండ కనకదుర్గ కాలనీలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో గురువారం వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని 11 మంది లబ్ధిదారులకు మొత్తం రూ. 6.50 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎంపీ డాక్టర్ కడియం కావ్య పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య మాట్లాడుతూ....పేద ప్రజలకు అత్యవసర సమయంలో వైద్య సహాయం అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకున్నప్పటికీ ఆర్థిక ఇబ్బందులతో సతమతమయ్యే కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందించడం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన సమయంలో ప్రభుత్వ సహాయం అందేలా తన వంతు కృషి చేస్తానని ఎంపీ తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందడంతో లబ్ధిదారులు ఎంపీ డాక్టర్ కడియం కావ్య గారికి కృతజ్ఞతలు తెలిపారు. వైద్య ఖర్చుల భారాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం అందించిన ఈ సహాయం తమ కుటుంబాలకు ఎంతో ఊరటనిచ్చిందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

# నేడు మల్కాజిగిరి కార్పోరేషన్ పరిధిలో మాంసం దుకాణాలు బంద్

**- జన్మాష్టమి సందర్భంగా కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి ఆదేశాలు..**
**- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు**



మేడ్చల్ జిల్లా,సెప్టెంబర్ 03(విజన్ ఆంధ్ర ప్రతినిధి) : శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా నేడు మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మటన్, బీఫ్ దుకా ణాలను మూసివేయాలని కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి ఆదేశించారు. కబేళాలను సైతం విధిగా మూసివేయాలని స్పష్టం చేశారు.జన్మాష్టమి సందర్భంగా మాంసం విక్రయాలు జరగకుండా సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని కమిషనర్ సూచించారు.కార్పోరేషన్ పరిధిలోని అన్ని సర్కిళ్ల అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి ఆదేశాలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించి మాంసం విక్రయాలు జరిపే దుకాణాలపై కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. మాంసం దుకాణాలు, కబేళాల నిర్వాహకులు మున్సిపల్ ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

# ఈవీఎం గోడౌన్ ను పరిశీలించిన జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

గద్వాల సెప్టెంబర్ 3( విజన్ ఆంధ్ర బ్యూరో) : జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమీపంలో ఉన్న ఈవీఎం గోడౌన్ ను ఈవీఎంల నెలవారి సాధారణ తనిఖీలో భాగంగా గురువారం కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి సందర్శించారు. ఈవీఎంలు, బ్యాలెట్ యంత్రాల విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు, సిబ్బందికి సూచించారు. ఈ తనిఖీలో ఎన్నికల విభాగం పర్యవేక్షకులు మంజుల, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పేటీఎంతో క్యారట్లేన్ భాగస్వామ్యం

హైదరాబాద్, సెప్టెంబర్ 03 (విజన్ ఆంధ్ర) : పేటీఎం(వన్ 97 కమ్యూనికేషన్స్ లిమిటెడ్) క్యారట్లేన్తో భాగస్వామ్యం ద్వారా తన ప్లాట్ఫామ్లో రింగ్స్, చెవిపోగులు, పెండెంట్లు, నెక్లెస్లు, గాజులు, బ్రేస్లెట్లు తదితర ఆభరణాలను అందుబాటులోకి తెచ్చిందని పేటీఎం వైస్ ప్రెసిడెంట్ వీర్ మిశ్రా గురువారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. క్యారట్లేన్ మేనేజింగ్ డైరెక్టర్ సౌమెన్ భౌమిక్ తోకలసి ఆయన మాట్లాడుతూ పేటీఎం డిజిటల్ గోల్డ్ను ఆభరణాల కొనుగోలుకు వినియోగించి, మిగిలిన మొత్తాన్ని యూపీఐ, క్రెడిట్, డెబిట్ కార్డులు, నెట్ బ్యాంకింగ్ తదితర మార్గాల్లో చెల్లించవచ్చని తెలిపారు. డిజిటల్ గోల్డ్ను ఆభరణాల కొనుగోలుకు వినియోగించే సౌకర్యాన్ని కల్పిస్తున్నామని తెలిపారు. డిజిటల్ గోల్డ్ను ఆభరణాలుగా మార్చుకునే అవకాశం వినియోగదారులకు లభిస్తోందన్నారు. క్యారట్లేన్ ప్యాకేజింగ్, ఆర్డర్ పూర్తి చేయడం, హోమ్ డెలివరీని నిర్వహించనుందని తెలిపారు.

# విధులు సక్రమంగా నిర్వహించకుండా అవినీతి ఆక్రమాలకు పాల్పడుతూన్న ఝురి పునాగూడ హెచ్ఎం పై కఠిన చర్యలు తీసుకోవాలని తుడుం దెబ్బ డిమాండ్ .......



ఆదిలాబాద్ జిల్లా (విజన్ ఆంధ్ర బ్యూరో) : ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం పునగూడ ఆశ్రమ పాఠశాల విద్యార్థులపై లంబాడా ఉపాధ్యాయులు ఆదివాసీ పిల్లల పై చిన్న చూపు చూస్తున్న లంబాడా ఉపాధ్యాయులపై విద్యార్థులు,గిరిజన సంఘాలు ఆందోళన చేపట్టారు .పిల్లలకు మెనూ ప్రకారము భోజనం పెట్టడం లేదన్నారు. ఉడకని అన్నం నిల పప్పు మరుగుదొడ్ల సక్రమంగా లేవన్నారు. ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు ఎవరు రాత్రిపూట ఉండడం లేదు సమయపాలన పాటించడం లేదు ఇష్టం స్వరంగా విధులకు హాజరవుతున్నారు పాటలు సక్రమంగా చెప్తలేరు ఆదివాసి గిరిజన పిల్లలపై వివక్ష చూపుతున్న ఉపాధ్యాయులు అధికారులు పట్టించుకోవడం నీళ్లు లేక ఇబ్బందులు 200 మంది విద్యార్థులో సగం మంది విద్యార్థులు హాజరవుతున్నారు జ్వరం వచ్చిన ఎవరు పట్టించుకోవడం లేదు ఇ విషయము ఐటీడీఏ అధికారులకు అలాగే ఆదివాసీ సంగలకు థెలియా డముతో పాటశాలకు చేరుకొని పిల్లలతో మాట్లాడి వరం రోజుల్లో పాఠశాల సమస్య పరిష్కారిస్థము అని హామీ ఇవ్వడముతో విద్యార్థులు ఆందోళన విరమించారు. ఈ కరిక్రమంలో ఐటీడీఏ ఏపీఓ ఆత్రం భాస్కర్, ఏ టీ డబ్ల్యూ ఓ అనిల్ తలమడుగుఎమ్మార్వో రాజమోహన్ ఎస్ ఐ రాదికా, తుడం దెబ్బ రాష్ట్రా అధ్యక్షుడు గోడం గణేష్ మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు గోడం రేణుక, ఉయిక ఇంద్ర, అర్క శేషరావు ,కుమ్ర జ్ఞానేశ్వర్, సార్ మేడి సిదామ మాధవ్ పటేల్, కుమ్ర కృష్ణ ,పెందోర్ జైతు పటేల్, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున విద్యార్థులు, తల్లిదండ్రు పాఠశాలకు వచ్చారు.

# దేశంలోనే పాఠశాల విద్యార్థులకు అల్పాహారం ప్రవేశం పెట్టిన ఏకైక ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వం

**- ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద విద్యార్థులకు పోషకవిలువలతో కూడిన పౌష్టికాహారం అందించడమే ప్రభుత్వ లక్ష్యం....**
**- విద్యార్థులు ఆకలితో ఉండకూడదని రోజుకో రకమైన అల్పాహారం విద్యార్థులకు అందించబడుతుంది....**
**- విద్యార్థుల ఆరోగ్యం మెరుగుపరచడంతో పాటు చెరువుపై ఏకాగ్రత పెంచడమే ముఖ్యమంత్రి గారి ఉద్దేశ్యం....**
**- విద్యా రంగానికి పెద్ద పీట వేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి..**
**-తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలి.....**
**- అర్హులైన పేదలందరికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు....**




హన్మకొండ జిల్లా బ్యూరో ఛిఫ్ సెప్టెంబర్ 3(విజన్ ఆంధ్ర ) : దేశంలోనే ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పోషకవిలువలతో కూడిన అల్పాహారం అందించేందుకు బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని ప్రవేశ పెట్టిన మొట్ట మొదటి రాష్ట్రం తెలంగాణ రాష్ట్రం అని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు.ధర్మసాగర్ మండలం కాషాగూడెం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ముఖ్యమంత్రి బ్రేక్ ఫాస్ట్ పథకం ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి , హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఎమ్మెల్యే , కలెక్టర్ స్వయంగా విద్యార్థులకు రుచికరమైన అల్పాహారాన్ని వడ్డించి బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని ఘనంగా ప్రారంభించారు. అనంతరం చిన్నారుల మధ్య కూర్చొని వారితో ముచ్చటిస్తూ వారితో కలిసి బ్రేక్ ఫాస్ట్ చేశారు. అలాగే పాఠశాల ఆవరణలో 12లక్షలతో నిర్మించనున్న అంగన్వాడీ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే , కలెక్టర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ..... రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద మధ్యతరగతి విద్యార్థులు ఆకలి ఉండకూడదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అలోచించి విద్యార్థులకు పోషకవిలువలతో కూడిన పౌష్టిక అల్పాహారం అందించడంతో పాటు చదువుపై విద్యార్థుల ఏకాగ్రత పెంచాలనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని ప్రవేశ పెట్టారని తెలిపారు. అందులో భాగంగానే ఈ రోజు కాషాగూడెం గ్రామ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు రుచికరమైన అల్పాహారం అందించి పథకాన్ని ప్రారంభించుకున్నామని వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి విద్యారంగంపై ప్రత్యేక దృష్టి సారించారని ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అల్పాహారం అందించే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. వారంలో ఒక్కో రోజు ఒక్కో రకంగా బోండాలు, పూరీలు, ఉప్మా, ఇడ్లీ, వడ తదితర అల్పాహారాన్ని విద్యార్థులకు అందించనున్నట్లు చెప్పారు. విద్యార్థులు ఉదయాన్నే పాఠశాలకు వచ్చి అల్పాహారం తీసుకుని ఉత్సాహంగా తరగతులకు హాజరయ్యేలా ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని తెలిపారు. దేశంలోనే ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహారం అందిస్తున్న తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందన్నారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ప్రస్తుతం 92 మంది విద్యార్థులు ఉన్నారని, దీనిని అప్పర్ ప్రైమరీ పాఠశాలగా అప్గ్రేడ్ చేయాలన్న గ్రామస్థుల విజ్ఞప్తిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. పాఠశాలను అప్గ్రేడ్ చేస్తే అదనంగా రెండు తరగతి గదులు, అవసరమైన ఉపాధ్యాయులను సమకూర్చేందుకు కృషి చేస్తానన్నారు. ఇంగ్లిష్ మీడియంలో విద్యాబోధనకు అవసరమైన సౌకర్యాలను కల్పిస్తామని చెప్పారు. అయితే గ్రామస్థులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగితే మరిన్ని తరగతి గదులు, ఉపాధ్యాయులు, ఇతర మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అదేవిధంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు అందించేందుకు తాను కృషి చేస్తానన్నారు. ఎంపీడీవో, హౌసింగ్ అధికారులు, సర్పంచ్ కలిసి గ్రామంలో పర్యటించి పూరిగుడిసెలు, కవర్లు కప్పుకుని నివసిస్తున్న ఇళ్లు, ఇళ్లులేని నిరుపేద కుటుంబాల వివరాలను సేకరించి ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. కాషాగూడెం గ్రామంలో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఎమ్మెల్యే తెలిపారు. రూ.11 లక్షలతో సీసీ రోడ్డు నిర్మించామని, రూ.12 లక్షలతో అంగన్వాడీ భవనం నిర్మిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే ఏడు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని, గ్రామపంచాయతీ భవనం, మరిన్ని సీసీ రోడ్ల నిర్మాణానికి చర్యలు చేపడుతున్నామన్నారు. గ్రామంలో ఇంకా పరిష్కరించాల్సిన చిన్న, పెద్ద సమస్యలు ఉన్నాయని, సర్పంచ్, గ్రామస్థులు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలతో పాటు మిగిలిన సమస్యలను కూడా దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గత రెండున్నరేళ్లలో రెండు విడతల్లో సుమారు ఏడు లక్షల ఇందిరమ్మ ఇళ్లను



మంజూరు చేసిందని ఎమ్మెల్యే తెలిపారు. మొదటి విడతలో 4.50 లక్షలు, రెండో విడతలో 2.50 లక్షల ఇళ్లను మంజూరు చేసినట్లు చెప్పారు. ఈ ఇళ్ల నిర్మాణానికి సుమారు రూ.35 వేల కోట్లు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. పేదల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు జారీ చేసిందని చెప్పారు. రేషన్ కార్డుదారులకు దొడ్డు బియ్యానికి బదులుగా సన్నబియ్యం ఉచితంగా అందిస్తుందని తెలిపారు. రాష్ట్రంలో సుమారు 3.10 కోట్ల మందికి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని, ఇందుకు ప్రభుత్వం ఏటా సుమారు రూ.13,800 కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజలు రోజంతా కష్టపడి సంపాదించిన డబ్బును మద్యం వంటి వ్యసనాలకు ఖర్చు చేయవద్దని ఎమ్మెల్యే సూచించారు. కుటుంబ అవసరాలకు, పిల్లల చదువులకు, భవిష్యత్ కోసం ఆదా చేసుకోవాలని కోరారు. మద్యానికి దూరంగా ఉండాలని ప్రజలకు పిలుపునిచ్చారు. గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు కాశగూడెం గ్రామం పేరును కాసీం నగర్ గా మార్చాలని, కొత్తగా ఏర్పడిన కాషాగూడెం గ్రామానికి గ్రామ పంచాయతీ భవనం మంజూరు చేయాలని, గ్రామంలో అంతర్గత సిసి రోడ్ల నిర్మాణానికి 20లక్షలు మంజూరు చేయాలని కలెక్టర్ గారిని కోరారు. ఈ సందర్బంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ అల్పాహార పథకం ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరయ్యే అవకాశం లభించడం సంతోషంగా ఉందన్నారు. కాశగూడెం గ్రామానికి వస్తుంటే ఇరువైపులా పచ్చని వరి పొలాలు, కొండలు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పిస్తున్నాయని పేర్కొన్నారు. ఇప్పటికే జిల్లాలోని నాలుగు మండలాల్లో అల్పాహార పథకం ప్రారంభమైందని, ధర్మసాగర్ మండలంలో ఈ గ్రామం నుంచి పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. దేశంలోనే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందించే ప్రత్యేక కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. విద్యార్థులు ఉదయం పాఠశాలకు వచ్చిన తర్వాత మధ్యాహ్నం వరకు ఆకలితో ఉండటం వల్ల చదువుపై ఏకాగ్రత తగ్గే అవకాశం ఉందని, దీనిని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం అల్పాహార పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. హరేకృష్ణ సంస్థ ఆధ్వర్యంలో ప్రతిరోజూ తాజా ఆహారాన్ని వివిధ రకాల మెనూతో విద్యార్థులకు అందిస్తున్నట్లు తెలిపారు. బోండా, పూరి, ఇడ్లీ, మిల్లెట్ ఉప్మా తదితర పోషకాహార పదార్థాలను అందిస్తున్నట్లు వెల్లడించారు. కాషాగూడెం ప్రభుత్వ పాఠశాలలో సుమారు 90 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని, పాఠశాలను ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు అవసరమైన అప్గ్రేడేషన్ ప్రతిపాదనను పంపిస్తామని తెలిపారు. విద్యార్థులకు నూతన యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, నోట్బుక్స్ తదితరాలను ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. పాఠశాలల్లో కంప్యూటర్లు ఏర్పాటు చేయడంతో ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులకు కంప్యూటర్ విద్యను అందించే అవకాశం ఏర్పడిందన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ఫౌండేషన్ లెర్నింగ్కు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. విద్యార్థులు ఐదో తరగతికి చేరుకునే నాటికి ప్రాథమిక ఇంగ్లిష్, గణితం, కూడిక, తీసివేత, గుణకారం తదితర అంశాల్లో పట్టు సాధించేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు పాఠశాలల్లో రెమెడియల్ తరగతులు నిర్వహిస్తున్నామని, అవసరమైన విద్యార్థులకు అదనపు బోధన అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి విద్యార్థికి పునాది స్థాయి విద్య బలంగా ఉండేలా చూడటమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అల్పాహార పథకం ప్రారంభంతో విద్యార్థులకు పోషకాహారంతో పాటు చదువుపై మరింత ఏకాగ్రత పెరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సయ్యద్ సత్తార్, డీఈవో గిరిరాజ్ గౌడ్, తహసిల్దార్ బావ్ సింగ్, ఎంపీడీవో అనిల్ కుమార్, ఎంఈఓ శ్రీదేవి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు యాస్మిన్ జహాన్, విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే

**- బీజేపీ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానం**




మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 03,(విజన్ ఆంధ్ర ) :సెప్టెంబర్ 5 న ఉపాధ్యాయుల దినోత్సవం పురస్కరించుకొని గురువారం మంచిర్యాల పట్టణంలోని గర్మిళ్ళ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులను బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి, 12 వ డివిజన్ కార్పొరేటర్ కస్తూరి నాగరాజు ఘనంగా సన్మానించారు. ఈసందర్బంగా బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు ఉన్నత విద్య బోధించి, వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుల కృషి అభినందనీయం అని అన్నారు. విద్యార్థులు తమ ఉపాధ్యాయులు చెప్పినవిధంగా నడుచుకొని తమ ప్రతిభను చాటుకోవాలని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అమిరిశెట్టి రాజ్ కుమార్, బుద్దారపు రాజమౌళి, పల్లి రాకేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ములుగు జిల్లా కరెగట్టాలో ఐఈడీ బాంబు పేలుడు

## - గిరిజనుడి మృతి

***రాష్ట్ర డీజీపీ కర్రిగుట్టాలు ప్రాంతంలో పర్యటించి, ములుగు జిల్లాను మావోయిస్టు రహిత తెలంగాణగా ప్రకటించిన కొద్దికాలానికే ఘటన***





చర్ల/వెంకటాపురం ,సెప్టెంబర్ 3 (విజన్ ఆంధ్ర): మండలంలో విషాదం వెంకటాపురం మండలం నూగురు ఏధుల చెరువు కాలనీకి చెందిన మడకం నాగేశ్వరరావు (55) అనే గిరిజనుడు ఐఈడీ (ఐ ఈ డి ) బాంబు పేలుడులో దుర్మరణం చెందడంతో ములుగు జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది నూరుగ్ కాలనీకి చెందిన ఆరుగురు వ్యక్తులు సోమవారం నాడు మూడు రోజుల వంటసామాగ్రితో కలిసి వెదురు బద్దల కోసం పామునూరు అటవీ ప్రాంతానికి వెళ్లారు, అక్కడ బస చేసి, మరుసటి రోజు వెదురు సేకరణ చేపట్టారు బుధవారం నాడు వారు తిరిగి వస్తుండగా, మార్గమధ్యంలో నాగేశ్వరరావు కాలు అక్కడ అమర్చిన ఒక బాంబుపై పడింది, ఈ ప్రమాదంలో ఆయన తీవ్రంగా గాయపడ్డారు,గురువారం ఉదయం తోటి గిరిజనులు ఆయనను డోలీలో మోసుకుంటూ పాలెం ప్రాజెక్ట్ వరకు తీసుకువస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందారు, ఆ తర్వాత మృతదేహాన్ని నూరుగ్ కాలనీకి తరలించారు సమాచారం అందుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు, వెంకటాపురం సీఐ ఎం. రమేష్, ఎస్సై కే. తిరుపతిరావు వివరాలు సేకరించారు. గురువారం ఉదయం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వెంకటాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం నాగేశ్వరావు మృతదేహాన్ని స్వగృహానికి తరలించారు నాగేశ్వరరావు మృతితో నూరుగ్ పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి, గురువారం సాయంత్రం నాగేశ్వరరావు అంత్యక్రియలు నిర్వహించారు, ఈ ఘటన కరెగట్టాలు, పామునూరు పోలీస్ స్టేషన్ల పరిధిలోని అడవుల్లో జరగడం కలకలం రేపింది, రాష్ట్ర డీజీపీ కర్రిగుట్టాలు ప్రాంతంలో పర్యటించి, ములుగు జిల్లాను మావోయిస్టు రహిత తెలంగాణగా ప్రకటించిన కొద్దికాలానికే పోలీసులను లక్ష్యంగా చేసుకుని మావోయిస్టులు అమర్చిన బాంబు పేలి ఒక నిరపాయమైన గిరిజనుడు ప్రాణాలు కోల్పోవడం ప్రస్తుతం సర్వత్రా చర్చనీయాంశమైంది.

# చిన్నన్నకు రేవంత్ వెన్నుపోటు!

## - 40 ఏళ్ల రాజకీయ బంధానికి సీఎం గండికొట్టాడా?



తెలంగాణ స్టేట్ బ్యూరో, విజన్ ఆంధ్ర, ఆగస్ట్ 03: ఒకప్పుడు వనపర్తి గోడల మీద చిన్నన్న కోసం నినాదాలు రాశానని సభల్లో పొగిడిన రేవంత్ రెడ్డి, నేడు సీఎం హోదాలో అదే చిన్నారెడ్డి రాజకీయ జీవితానికి సున్నం పెట్టారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**టికెట్ కట్ వెనుక పెద్ద కుట్ర!**

2023 ఎన్నికల్లో వనపర్తి ఎమ్మెల్యే టికెట్ దాదాపు చిన్నారెడ్డికే ఖాయమైనట్లు ప్రచారం జరిగింది. అయితే పీసీసీ అధ్యక్షుడి హోదాలో ఉన్న రేవంత్ రెడ్డి ఆ టికెట్ ను మేఘారెడ్డికి కట్టబెట్టారు. వనపర్తిలో చిన్నారెడ్డి గెలిస్తే తన సీఎం సీటుకు పోటీగా వస్తాడనే భయంతోనే రేవంత్ ఈ ఎత్తుగడ వేశారని కాంగ్రెస్ వర్గాల్లోనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

**సోనియా గాంధీకి అత్యంత సన్నిహితుడు!**

చిన్నారెడ్డి సాధారణ నాయకుడు కాదు, రాజీవ్ గాంధీ కుటుంబానికి అత్యంత సన్నిహితుడు. 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆయనను సీఎం చేయాలని సోనియా గాంధీ స్వయంగా భావించారని, ఆ ఎన్నికల్లో ఢిల్లీ నుంచి ప్రత్యేకంగా దూతలను పంపి విచారించారని చెబుతారు.

**కొండా సురేఖ భుజం మీద తుపాకీ!**

తన టికెట్ మేఘారెడ్డికి వెళ్లడం వెనుక జరిగిన కుట్రలు తెలుసుకున్న చిన్నారెడ్డి ఇటీవల పరోక్షంగా రేవంత్ పై ఆరోపణలు చేశారు. కొండా సురేఖ భుజం మీద తుపాకీ పెట్టి చిన్నారెడ్డిని కాల్చారని, రేవంత్ ఆడిన రాజకీయ క్రీడలో నాలుగు దశాబ్దాల కాంగ్రెస్ బంధానికి అవమానకర తొలగింపే బహుమతిగా దక్కిందని ఆయన అనుచరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యువజన కాంగ్రెస్ నేతగా రాజకీయ జీవితం ప్రారంభించి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా పనిచేసిన చిన్నారెడ్డి రాజకీయ బంధం తెగిపోయిందనే చర్చ జరుగుతోంది. ఈ అవమాన భారంతో ఆయన కాంగ్రెస్ లో కొనసాగుతారా? నిష్క్రమిస్తారా? అనేది వేచి చూడాలి.

## కల్వకుర్తికి తిరిగి వచ్చి రెండోసారి సీఐ గా రవిచంద్రా రెడ్డి బాధ్యత..



కల్వకుర్తి, సెప్టెంబర్ 03 (విజన్ ఆంధ్ర): కల్వకుర్తి ఎక్సైజ్ సర్కిల్ లో కీలక బదిలీలు జరిగాయి. ఇక్కడ సీఐ గా పనిచేసిన జె. వెంకట్ రెడ్డి బదిలీపై షాద్ నగర్ ఎస్ హెచ్ ఓ గా వెళ్లగా, ఆయన స్థానంలో లికె. రవిచంద్రా రెడ్డి నూతన సీఐ గా బాధ్యతలు స్వీకరించారు. యాదాద్రి జిల్లా మోత్కూర్ స్టేషన్ నుండి బదిలీపై కల్వకుర్తికి వచ్చిన రవిచంద్రా రెడ్డి గురువారం అధికారికంగా బాధ్యతలు చేపట్టారు.

**గతంలోనూ కల్వకుర్తిలో సేవలు – మళ్లీ అదే బాధ్యతలు!**

కొత్తగా వచ్చిన లిసీఐ రవిచంద్రా రెడ్డికి కల్వకుర్తి కొత్త కాదు. గతంలోనూ ఆయన ఇక్కడే విధులు నిర్వహించి తన పనితీరుతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. అక్రమ మద్యం, నాటుసారా స్థావరాలపై ఉక్కుపాదం మోపి స్థానికంగా మంచి పేరు సంపాదించారు. అనుభవం ఉన్న అధికారి కావడంతో ప్రభుత్వం లిరెండోసారిలి మళ్లీ కల్వకుర్తి బాధ్యతలను ఆయనకే అప్పగించింది. అనుభవజ్ఞుడైన అధికారి తిరిగి రావడంతో నియోజకవర్గంలో అక్రమ మద్యం వ్యాపారాలకు చెక్ పడనుందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# నేడు లోకాన్ని ఏలే చిన్ని కృష్ణుడి పుట్టినరోజు – జై శ్రీకృష్ణ!




**తెలంగాణ స్టేట్ బ్యూరో, సెప్టెంబర్ 03 (విజన్ ఆంధ్ర):** యదా యదా హి ధర్మస్య గ్లానిర్భవతి భారత... అని గీతలో చెప్పినట్లుగా, అధర్మం పెరిగిన ప్రతిసారీ ధర్మాన్ని నిలబెట్టడానికి శ్రీమహావిష్ణువు అవతరిస్తూనే ఉంటాడు. అలా ఎనిమిదో అవతారంగా అవతరించిన శ్రీకృష్ణుడి జన్మదినమే నేడు జరుపుకునే శ్రీకృష్ణ జన్మాష్టమి.

**1. చెరసాలలో దివ్యజననం:**

ద్వాపరయుగంలో మధురను మేనమామ కంసుడు పరిపాలిస్తుండేవాడు. తన చెల్లి దేవకీ వసుదేవుల ఎనిమిదో సంతానం చేతిలో తన మరణం తప్పదని ఆకాశవాణి చెప్పడంతో వారిని చెరసాలలో బంధించాడు. భాద్రపద బహుళ అష్టమి, రోహిణి నక్షత్రం, అర్ధరాత్రి 12 గంటలకు ఆ చెరసాలలోనే దేవకీమాతకు శ్రీకృష్ణుడు జన్మించాడు. పుట్టగానే చతుర్భుజాలతో, శంఖు చక్ర గదా పద్మాలతో దర్శనమిచ్చి, వెంటనే బాలకృష్ణుడిగా మారిపోయాడు.

**2. యమునా నదిని దాటిన వసుదేవుడు:**

కంసుడి నుంచి బిడ్డను కాపాడమని ఆదేశించడంతో వసుదేవుడు బుట్టలో బిడ్డను పెట్టుకుని యమునా నదిని దాటాడు. ఆ సమయంలో యమున ఉప్పొంగుతుండగా, ఆదిశేషువు పడగతో వర్షం నుంచి కాపాడాడని, యమునా నది తగ్గి దారి ఇచ్చిందని పురాణం. గోకులంలో యశోద, నందుల ఇంట్లో ఆ బిడ్డను వదిలి, అక్కడ పుట్టిన యోగమాయను తిరిగి తీసుకొచ్చాడు.

**3. గోకులంలో బాల్య లీలలు:**

గోకులంలో కృష్ణుడు చేసిన అల్లరి లీలలు అన్నీ ఇన్నీ కావు. వెన్న దొంగతనం, కాళీయ మర్దనం, గోవర్ధనగిరి ఎత్తడం, పూతన సంహారం... ప్రతి లీలలో ఒక సందేశం ఉంది. అందుకే నేటికీ ఉట్ల కొట్టడం (దహి హండి) సంప్రదాయంగా వస్తోంది. మానవ ప్రయత్నంతో దైవాన్ని అందుకోవచ్చని దీని అర్థం.

**4. జగద్గురువుగా కృష్ణుడు:**

కృష్ణుడు కేవలం అల్లరి బాలుడు మాత్రమే కాదు. కురుక్షేత్రంలో అర్జునుడికి భగవద్గీతను బోధించిన జగద్గురువు. “కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన“ అనే మహా మంత్రాన్ని లోకానికి అందించాడు. ఫలితం ఆశించకుండా కర్మ చేయమని చెప్పిన తత్వవేత్త.

**5. నేడు రాష్ట్రవ్యాప్తంగా వేడుకలు:**

నేడు తెలుగు రాష్ట్రాల్లో కృష్ణాష్టమి వేడుకలు కన్నుల పండువగా జరుగుతున్నాయి. హైదరాబాద్ లోని అబిడ్స్ లోని ఇస్కాన్ టెంపుల్, సికింద్రాబాద్ లోని హరేకృష్ణ ఆలయాల్లో ప్రత్యేక పూజలు, ఉయ్యాల ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇళ్లలో చిన్న పిల్లలను కృష్ణుడు, రాధగా అలంకరించి ఫోటోలు తీసుకోవడం ఆనవాయితీ.

**ఈ రోజు ఏం చేయాలి?**

– ఉదయం ఉపవాసం ఉండి, సాయంత్రం అష్టోత్తరం చదవాలి.
– చిన్ని కృష్ణుడికి వెన్న, అటుకులు, పాలు నైవేద్యంగా పెట్టాలి.
– “ఓం నమో భగవతే వాసుదేవాయ“ అనే మంత్రాన్ని 108 సార్లు జపించాలి.
– పిల్లల కోసం ఎదురుచూసే దంపతులు ఈరోజు సంతాన గోపాల మంత్ర పారాయణం చేస్తే అద్భుత ఫలితం ఉంటుందని పండితులు చెబుతున్నారు.

విజన్ ఆంధ్ర పాఠకులందరికీ శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు – మీ ఇంటా వెన్న ముద్దల కృష్ణయ్య కొలువై, సకల సంపదలు కలగాలని కోరుకుంటున్నాం!

# టౌన్ ప్లానింగ్ అధికారిపై ఏసీబీ కొరడా..!






- రూ.3.54 కోట్ల ఆస్తులు.. సోమయ్యపై ఏసీబీ కేసు
- ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో టౌన్ ప్లానింగ్ అధికారి
- సోమయ్య ఆస్తులపై ఏసీబీ సోదాల కలకలం
- ఇళ్లు.. ప్లాట్లు.. భూములు.. బంగారం!
- 8 ప్రాంతాల్లో ఏకకాలంలో ఏసీబీ దాడులు
- టౌన్ ప్లానింగ్ అధికారిపై అక్రమాస్తుల ఆరోపణలు
- రూ.3.54 కోట్ల ఆస్తులు గుర్తించిన ఏసీబీ
- 709 గ్రాముల బంగారం.. 1,750 గ్రాముల వెండి
- సూర్యాపేట నుంచి హైదరాబాద్ వరకు ఏసీబీ సోదాలు

సూర్యాపేట సెప్టెంబర్ 03:(విజన్ ఆంధ్ర) : ఆదాయానికి మించిన ఆస్తులు కూడబెట్టారన్న ఆరోపణలపై సూర్యాపేట మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ అధికారి వి. సోమయ్యపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) కేసు నమోదు చేసింది. నల్గొండ రేంజ్ ఏసీబీ అధికారులు గురువారం సోమయ్య నివాసం, కార్యాలయంతో పాటు ఆయన బంధువులు, సహచరులకు సంబంధించిన మరో ఏడు ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించారు.ఈ మేరకు ఏసీబీ అధికారికంగా వివరాలు వెల్లడించింది.సోదాల్లో పలు ఆస్తులకు సంబంధించిన కీలక పత్రాలను ఏసీబీ అధికారులు గుర్తించారు. ఇందులో సూర్యాపేట జిల్లాలో 3 ఎకరాల 3 గుంటల వ్యవసాయ భూమి, సూర్యాపేట, హయత్‌నగర్ పరిధిలో ఐదు నివాస ఆస్తులు ఉన్నట్లు గుర్తించారు. వీటిలో ఒక జీ ప్లస్1 భవనం, ఒక జీప్లస్ 2 భవనం, ఒక జీప్లస్ 4 భవనం, ఒక పెంట్‌హౌస్, రెండు గ్రౌండ్‌ఫ్లోర్ ఇళ్లు ఉన్నాయి.అలాగే సూర్యాపేట పరిధిలో ఎనిమిది ఓపెన్ ప్లాట్లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. గుర్తించిన ఆస్తుల మార్కెట్ విలువ అధికారిక విలువ కంటే చాలా ఎక్కువగా ఉండే అవకాశం ఉందని ఏసీబీ పేర్కొంది.బంగారం 709 గ్రాములు.. వెండి 1,750 గ్రాములు సోదాల్లో రూ.4,63,990 నగదు, బ్యాంకు ఖాతాల్లో రూ.13 లక్షల నిల్వలు గుర్తించారు. అదేవిధంగా 709 గ్రాముల బంగారు ఆభరణాలు,






1,750 గ్రాముల వెండి ఆభరణాలు లభించాయి. వీటి విలువ సుమారు రూ.20 లక్షలుగా అంచనా వేశారు.సోమయ్యకు చెందిన రెండు నాలుగు చక్రాల వాహనాలు, మూడు ద్విచక్ర వాహనాలు కూడా గుర్తించారు. వీటి విలువ సుమారు రూ.25.20 లక్షలుగా అధికారులు పేర్కొన్నారు. ఇంట్లోని గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్ వస్తువుల విలువ సుమారు రూ.11 లక్షలుగా అంచనా వేశారు.రూ.49 లక్షల గోల్డ్ లోన్ బంగారాన్ని తాకట్టు పెట్టి బ్యాంకు ద్వారా సుమారు రూ.49 లక్షల రుణం పొందినట్లు ఏసీబీ గుర్తించింది. మరిన్ని ఆస్తుల వివరాలపై విచారణ కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు.రూ.3.54 కోట్లుగా ఆస్తుల అంచనా ఇప్పటివరకు గుర్తించిన ఆస్తులు, నగదు, బంగారం, వాహనాలు తదితరాలను కలిపి సోమయ్యకు సంబంధించిన ఆస్తుల మొత్తం విలువను రూ.3,54,36,490గా ఏసీబీ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు.ఆదాయ వనరులతో పోలిస్తే ఆస్తుల విలువపై ఏసీబీ అధికారులు మరింత దర్యాప్తు చేస్తున్నారు.అనంతరం సోమయ్యను హైదరాబాద్‌లోని ప్రత్యేక ఏసీబీ కోర్టు ఎదుట హాజరుపరిచి న్యాయ రిమాండ్‌కు తరలించనున్నట్లు ఏసీబీ వెల్లడించింది.కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

# పంచాయతీ నిధుల దుర్వినియోగంపై విజిలెన్స్ విచారణ జరపాలి

- ప్రసార మాధ్యమాల్లో వచ్చిన వార్తలపై స్పందించిన అధికారులు
- మండల స్థాయి అధికారుల ప్రాథమిక విచారణపై స్థానికుల అసంతృప్తి
- నిష్పక్షపాత విచారణ కోసం జిల్లా స్థాయి అధికారుల రంగప్రవేశం అవసరం
- క్షేత్రస్థాయిలో విజిలెన్స్ బృందాలు పర్యటించి వాస్తవాలు తేల్చాలని వినతి
- నేరం రుజువైతే నిధుల రికవరీతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజల కోరిక




పెన్ పహాడ్, సెప్టెంబర్ 3 ( విజన్ ఆంధ్ర): మండలంలోని దుపహాడ్ పంచాయతీలో ఇటీవల ప్రజాధనం దుర్వినియోగం అయిందంటూ ప్రసార మాధ్యమాల్లో వెలువడిన వార్తలు స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఈ వ్యవహారంపై ప్రజా ఒత్తిడి పెరగడంతో స్పందించిన మండల స్థాయి అధికారులు ఇటీవల గ్రామంలో ప్రాథమిక విచారణ చేపట్టారు. అయితే, ఈ విచారణ తూతూమంత్రంగా సాగిందనే ఆరోపణలు స్థానిక ప్రజల నుంచి వ్యక్తమవుతున్నాయి. కొందరు స్థానిక అధికారుల అండదండలు ఉండటం వల్లే విచారణ ప్రక్రియ నిష్పక్షపాతంగా సాగడం లేదని గ్రామస్థులు అభిప్రాయపడుతున్నారు.మండల స్థాయి అధికారుల నివేదికలపై నమ్మకం లేకపోవడంతో, ఈ నిధుల దుర్వినియోగం వెనుక ఉన్న అసలు వాస్తవాలను తేల్చేందుకు జిల్లా స్థాయి ఉన్నతాధికారుల చేత విచారణ జరిపించాలని బాధ్యతాయుతమైన పౌరులు డిమాండ్ చేస్తున్నారు. లోపాయికారీ ఒప్పందాలతో నివేదికలను మార్చే ప్రయత్నాలు జరిగితే ఊరుకునేది లేదని స్థానికులు పేర్కొంటున్నారు.

**విజిలెన్స్ రంగంలోకి దిగాల్సిందే!**

ఇంత పెద్ద మొత్తంలో ప్రజాధనం పక్కదారి పట్టినట్లు ఆరోపణలు వస్తున్నందున, రాష్ట్ర విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నేరుగా రంగంలోకి దిగాలని మండల ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు. విజిలెన్స్ బృందాలు క్షేత్రస్థాయిలో పర్యటించి, సాంకేతిక ఆధారాలు, రికార్డులను పరిశీలించి వాస్తవాలను బట్టబయలు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఒకవేళ నిధుల దుర్వినియోగం జరిగినట్లు చట్టపరంగా నేరం రుజువైతే, దానికి బాధ్యులైన వారిపై తగిన కేసులు నమోదు చేయాలని, అలాగే దుర్వినియోగమైన ప్రజాధనాన్ని పూర్తిగా రికవరీ చేసి పంచాయతీ ఖాతాలో జమ చేయాలని ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

# అక్రమ కబ్జాకు యత్నించిన సర్పంచ్ భర్త, కొడుకుపై కేసు నమోదు - జోగిపేట ఎస్ఐ గిరి శ్రీకాంత్




జోగిపేట, విజన్ ఆంధ్ర సెప్టెంబర్ 03 : ఆందోల్ మండలం కన్సన్ పల్లి గ్రామంలో తనకు చెందిన 3.5 గుంటల భూమిలో అక్రమంగా చొరబడి షెడ్డు వేసిన సర్పంచ్ భర్త,కొడుకుపై బాధితుడు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు జోగి పెట ఎస్సై గిరి శ్రీకాంత్ గురువారం తెలిపారు. కన్సన్ పల్లి గ్రామానికి చెందిన ప్రభాకర్ రెడ్డి భూమిలో అదే గ్రామానికి చెందిన సర్పంచ్ భర్త మహిపాల్ ఆయన కొడుకు ప్రవీణ్ ( మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు) అక్రమంగా చొరబడి షెడ్డు వేయడం జరిగిందన్నారు.ఈ విషయంపై బాధితుడు వారిని సంప్రదించగా ఆ స్థలం మాదేనని అందుకే షెడ్డు వేసామని బెదిరించాడన్నారు.దీంతో బాధితుడు ప్రభాకర్ రెడ్డి ఫిర్యాదు మేరకు మహిపాల్,ఆయన కొడుకు ప్రవీణ్ పై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

# పరిశీలన ప్రక్రియ వేగవంతం చేయాలి

## - జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 03,(విజన్ ఆంధ్ర ) : ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ– 2026లో నోటీసుల జారీ అనంతరం సంబంధిత ఓటర్ల నుండి స్వీకరిస్తున్న ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, వి.రాములు, ప్రత్యేక ఉపపాలనాధికారి చంద్రకళ, జిల్లా రెవెన్యూ అధికారి మోతిరామ్, డి.ఎ.ఓ. రమేష్ లతో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ2026లో హియరింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలని తెలిపారు. ఈ క్రమంలో మార్కింగ్ కాని, అనమలిస్ జాబితాలో ఓటర్లకు జారీ చేసిన నోటీసులకు సంబంధించి ఓటర్లు అందిస్తున్న ధ్రువపత్రాల విచారణ వేగవంతం చేయాలని, అర్హత గల ప్రతి ఒక్కరు ఓటరు జాబితాలో ఉండేలా చూడాలని తెలిపారు. జాబితాలో గల ఓటర్లు తమ వివరాలను సమర్పించేలా రాజకీయ పార్టీలు బూత్ స్థాయి ఏజెంట్ల ద్వారా చర్యలు తీసుకోవాలని, ఎస్.ఐ.ఆర్.2026 ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు సహకరించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## రెడ్డి జాగృతి జిల్లా అధ్యక్షునిగా బంక మోహన్ రెడ్డి ఎన్నిక.



నాగర్ కర్నూల్, జిల్లా ప్రతినిధి (విజన్ ఆంధ్ర): సెప్టెంబర్ 03 : రెడ్డి జాగృతి నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షునిగా బంక మోహన్ రెడ్డిని రాష్ట్ర రెడ్డి జాగృతి వ్యవస్థాపక అధ్యక్షులు బుట్టెం గారి మాధవరెడ్డి నియమించినట్లు మోహన్ రెడ్డి తెలిపారు. నాపై నమ్మకం ఉంచి జిల్లా అధ్యక్షునిగా నియమించి నందుకు రాష్ట్ర నాయకత్వానికి ధన్యవాదాలు తెలుపుతూ నాగర్ కర్నూల్ జిల్లాలో రెడ్డి జాగృతి వ్యవస్థ కోసం మరింత కృషిచేసి బడుగు బలహీన వర్గాల వారికి సహాయ సహకారాలు అందిస్తానని ఆయన తెలిపారు.

EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. RNI.NO.70731/1999 EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.